


APTEL/26/A4813

# శ్రీ వార్త

జాతీయ తెలుగు దినపత్రిక

కొత్త ఆలోచన.. కొత్త వార్త






సంపుటి : 01 సంచిక :90 ఎడిటర్.: కూరేటి సతీష్ పేజిలు : 08, వెల రూ. 2రూ/ బుధవారం - 07 - అక్టోంబర్ - 2026

Published From : Circulated at Srikakulam,VishakaPatanam,Vijayanagaram, East Godavari, West Godavari, Krishna, Guntur, Prakasam, Nellore, Chittoor,, Kadapa, Anantapuram, Hyderabad


## భారత్-అమెరికా వాణిజ్య చర్చల్లో స్తబ్దత ఏర్పడింది

- భారత్-అమెరికా వాణిజ్య చర్చలపై నిర్మలా సీతారామన్ కీలక వ్యాఖ్యలు
- ప్రస్తుతం వాణిజ్యం భారత్‌కే అనుకూలంగా ఉందని వెల్లడి
- వాణిజ్య లోటును తగ్గించుకోవాలని అమెరికా భావిస్తోందని వ్యాఖ్య




భారత్, అమెరికాల మధ్య కొంతకాలంగా కొనసాగుతున్న వాణిజ్య ఒప్పంద చర్చలు దాదాపుగా తుది దశకు చేరుకున్నప్పటికీ, ప్రస్తుతం అవి ప్రతిష్టంభనలో ఉన్నట్లు కనిపిస్తున్నాయని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ పేర్కొన్నారు. మిగతా 2లో

## ఈజీ వే లేదా హార్డ్ వే.. ఇరాన్‌కు ట్రంప్ స్వీట్ వార్నింగ్

- ఇరాన్‌పై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి సంచలన వ్యాఖ్యలు చేశారు.
- ఇరాన్‌పై త్వరలోనే కీలక నిర్ణయం తీసుకుంటానని ప్రకటించిన ట్రంప్.. టెహ్రాన్ ముందు రెండు మార్గాలే ఉన్నాయని హెచ్చరించారు.



ఇరాన్‌పై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి సంచలన వ్యాఖ్యలు చేశారు. ఇరాన్‌పై త్వరలోనే కీలక నిర్ణయం తీసుకుంటానని ప్రకటించిన ట్రంప్.. టెహ్రాన్ ముందు రెండు మార్గాలే ఉన్నాయని హెచ్చరించారు. అవి.. 'ఈజీ వే.. లేదా హార్డ్ వే' అంటూ మిగతా 2లో

## 2029 నాటికి 4-స్టార్.. ప్రభుత్వ స్కూళ్లపై మంత్రి లోకేశ్ సమీక్ష



- ఏడాదిలోగా వన్-స్టార్ స్కూళ్లను టూ-స్టార్‌గా మార్చాలని ఆదేశం
- 2029 నాటికి రాష్ట్రంలోని అన్ని పాఠశాలల్లో 4-స్టార్ సదుపాయాల కల్పన లక్ష్యం
- ఈ ఏడాది 5 లక్షల మంది విద్యార్థులకు నైపుణ్య శిక్షణ ఇవ్వాలని నిర్ణయం
- ఏజెన్సీ ప్రాంత పాఠశాలల అభివృద్ధిపై ప్రత్యేకంగా దృష్టి సారించాలని సూచన

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, ఈ విషయంలో నిర్దేశిత లక్ష్యాలను నిర్దేశిత గడువులోగా చేరుకోవాలని రాష్ట్ర ఐటీ, విద్య, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేశ్ అధికారులను ఆదేశించారు. పాఠశాలల్లో వసతుల కల్పన, నైపుణ్యాభివృద్ధి అంశాలపై సోమవారం ఉండవల్లిలోని తన నివాసంలో ఆయన ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి లోకేశ్ మాట్లాడుతూ.. మిగతా 2లో

- ఎల్బీనగర్, అల్వాల్, వరంగల్, ఉస్మానియా ఆస్పత్రుల ఐ పనుల్లో వేగం పెంచాలి
- కలెక్టర్లు క్షేత్రస్థాయిలో పాఠశాలలు, హాస్టళ్లు, ఆస్పత్రులు తనిఖీ చేయాలి
- సీఎంవో అధికారులతో నిర్వహించిన సమీక్షలో సీఎం రేవంత్‌రెడ్డి
- రాష్ట్రంలో విద్య, వైద్య రంగాల్లో క్షేత్రస్థాయి పరిస్థితులను నిరంతరం పర్యవేక్షించాలని సీఎం రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు.
- నిర్మాణంలో ఉన్న ప్రధాన ఆస్పత్రుల పనులను వేగవంతం చేయడంతోపాటు, అవి అందుబాటులోకి వచ్చే నాటికి వైద్యులు, వైద్య సిబ్బంది, అత్యాధునిక పరికరాలు సిద్ధంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని స్పష్టంచేశారు.
- సీఎంవో అధికారులతో నిర్వహించిన సమీక్షలో విద్య, వైద్యం, సీజనల్ వ్యాధులు, తెలంగాణ గ్లోబల్ సమ్మిట్--2026 ఏర్పాట్లపై సీఎం చర్చించారు.
- ల్బీనగర్, అల్వాల్, వరంగల్, ఉస్మానియా ఆస్పత్రుల నిర్మాణ పనుల పురోగతిని సీఎం అధికారులను అడిగి తెలుసుకున్నారు.

### ఆస్పత్రులు పూర్తయ్యేలోపే సిబ్బంది

# సిద్ధంగా ఉండాలి

**అత్యాధునిక పరికరాలు ముందుగానే సమకూర్చాలి**



రాష్ట్రంలో విద్య, వైద్య రంగాల్లో క్షేత్రస్థాయి పరిస్థితులను నిరంతరం పర్యవేక్షించాలని సీఎం రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. నిర్మాణంలో ఉన్న ప్రధాన ఆస్పత్రుల పనులను వేగవంతం చేయడంతోపాటు, అవి అందుబాటు లోకి వచ్చే నాటికి వైద్యులు, వైద్య సిబ్బంది, అత్యాధునిక పరికరాలు సిద్ధంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని స్పష్టంచేశారు .సీఎంవో అధికారుల తో నిర్వహించిన సమీక్షలో విద్య, వైద్యం, సీజనల్ వ్యాధులు, తెలంగాణ గ్లోబల్ సమ్మిట్--2026 ఏర్పాట్లపై సీఎం చర్చించారు. ఎల్బీనగర్, అల్వాల్, వరంగల్, ఉస్మానియా ఆస్పత్రుల నిర్మాణ పనుల పురోగతిని సీఎం అధికారులను అడిగి తెలుసుకున్నారు .ఆస్పత్రుల నిర్మాణం పూర్తయిన తర్వాత వైద్య సేవలు ప్రారంభించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేపట్టడంలో ఆలస్యం జరగకూడదని ఆదేశించారు. ఇందుకోసం ఆయా ఆస్పత్రుల్లో మిగతా 2లో

## ఖర్గే వ్యాఖ్యలు ప్రజల విచక్షణను అవమానించడమే



- దేశంలో జరిగిన ఎన్నికలన్నీ బూటకమని, వాటిని రద్దు చేయాలని కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే చేసిన ప్రకటన దేశ పౌరుల విచక్షణను అవమానించడమేనని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావు అన్నారు.
- వ్యవస్థలను బలహీనపరచి తద్వారా దేశ సమగ్రతకు భంగం కలిగించేందుకు కాంగ్రెస్ ప్రయత్నిస్తోందని ఆరోపించారు.

దేశంలో జరిగిన ఎన్నికలన్నీ బూటకమని, వాటిని రద్దు చేయాలని కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే చేసిన ప్రకటన దేశ పౌరుల విచక్షణను అవమానించడమేనని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావు అన్నారు. వ్యవస్థలను బలహీనపరచి తద్వారా దేశ సమగ్రతకు భంగం కలిగించేందుకు కాంగ్రెస్ ప్రయత్నిస్తోందని ఆరోపించారు. మిగతా 2లో

## వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో 'స్థితప్రజ్ఞుడు' పుస్తకావిష్కరణ

**పుస్తకాన్ని ఆవిష్కరించిన వైఎస్సార్‌సీపీ స్టేట్ కోఆర్డినేటర్ శ్రీ సజ్జల రామకృష్ణారెడ్డి**

- వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో సీనియర్ జర్నలిస్ట్, టెక్నోక్రాట్ డాక్టర్ కొత్తపల్లి శ్రీనివాస వర్మ రచించిన 'స్థితప్రజ్ఞుడు' పుస్తకాన్ని వైఎస్సార్‌సీపీ స్టేట్ కోఆర్డినేటర్ శ్రీ సజ్జల రామకృష్ణారెడ్డి ఆవిష్కరించారు.
- మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు శ్రీ వైయస్ జగన్ రాజకీయ జీవనయానం, ఆయన రాజకీయ ప్రస్థానంలోని వివిధ ఘట్టాలు, నాయకత్వ లక్షణాలను సమగ్రంగా సంకలనం చేస్తూ డాక్టర్ కొత్తపల్లి శ్రీనివాస వర్మ ఈ పుస్తకాన్ని రచించారు.



వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో సీనియర్ జర్నలిస్ట్, టెక్నోక్రాట్ డాక్టర్ కొత్తపల్లి శ్రీనివాస వర్మ రచించిన 'స్థితప్రజ్ఞుడు' పుస్తకాన్ని వైఎస్సార్‌సీపీ స్టేట్ కోఆర్డినేటర్ శ్రీ సజ్జల రామకృష్ణారెడ్డి ఆవిష్కరించారు.మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు శ్రీ వైయస్ జగన్ రాజకీయ జీవనయానం, ఆయన రాజకీయ ప్రస్థానంలోని వివిధ ఘట్టాలు, నాయకత్వ లక్షణాలను మిగతా 2లో

## రామప్ప సమీపంలో ఓపెన్‌కాస్ట్.. ఆపకుంటే ఉద్యమమే



రామప్పను కాపాడేందుకు పెద్దఎత్తున ఉద్యమిస్తాం: కేటీఆర్

ప్రఖ్యాత దేవాలయం రామప్పకు సమీపంలో ఓపెన్ కాస్ట్ గని ఏర్పాటు చేయడంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఆలయం పరిసరాల్లో బొగ్గుగని ప్రతిపాదన వెంటనే వెనక్కు తీసుకోవాలన్నారు.

ప్రఖ్యాత దేవాలయం రామప్పకు సమీపంలో ఓపెన్ కాస్ట్ గని ఏర్పాటు చేయడం పై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. మిగతా 2లో

## రాయలసీమ పౌరుషమంటే గొడ్డలి పోట్లు కాదు.. అభివృద్ధి

**పులివెందుల, అరకులోనూ వివక్ష లేకుండా అభివృద్ధి పనులు చేస్తున్నాం**

- ప్రొద్దుటూరులో రూ.30,156 కోట్లతో అమరజీవి జలధార పథకానికి శ్రీకారం
- గత ప్రభుత్వం జలజీవన్ మిషన్ నిధులను నిర్వీర్యం చేసిందని తీవ్ర విమర్శ
- ఇది కక్షసాధింపుల ప్రభుత్వం కాదు, ప్రజాభివృద్ధి ప్రభుత్వమని స్పష్టీకరణ



"యుద్ధం వచ్చినప్పుడు, హద్దులు దాటినప్పుడు నా గొంతు ఎలా ఉంటుందో మీకు తెలుసు. కానీ ఇది శాంతి సమయం. ప్రజలకు అభివృద్ధి చేయాల్సిన సమయం. అందుకే రాయలసీమ పౌరుషానికి తగిన స్పీచ్ మాట్లాడట్లేదు. మిగతా 2లో

## ఎన్నికలపై నటుడు ప్రకాశ్‌రాజ్ మాటలు వింటే నవ్వు వస్తోంది



- కాంగ్రెస్ పార్టీ, ఇండియా కూటమి నేతలు ఓటు చోరీ గురించి మాట్లాడటం విడ్డూరంగా ఉందని ఏపీ మంత్రి సత్యకుమార్ యాదవ్ విమర్శించారు.
- కాంగ్రెస్ నేత మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీ ఎన్నికలు రద్దు చేయాలని ఎందుకు అంటున్నారని ప్రశ్నించారు.

కాంగ్రెస్ పార్టీ, ఇండియా కూటమి నేతలు ఓటు చోరీ గురించి మాట్లాడటం విడ్డూరంగా ఉందని ఏపీ మంత్రి సత్యకుమార్ యాదవ్ విమర్శించారు. కాంగ్రెస్ నేత మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీ ఎన్నికలు రద్దు చేయాలని ఎందుకు అంటున్నారని ప్రశ్నించారు. కాంగ్రెస్ హయాంలోనే మిగతా 2లో

- సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ చేతుల మీదుగా శ్రీకారం
- రూ. 30,156 కోట్లతో రాష్ట్రవ్యాప్త తాగునీటి పథకం
- 27 లక్షల గ్రామీణ కుటుంబాలకు కుళాయి కనెక్షన్లు లక్ష్యం
- గండికోట నుంచి చిత్తూరు, తిరుపతి, అన్నమయ్య జిల్లాలకు నీరు
- ప్రొద్దుటూరులో రూ.30,156 కోట్లతో 'అమరజీవి జలధార' పథకం
- ప్రారంభించిన సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్
- 90 లక్షల కుటుంబాలకు కుళాయిల ద్వారా సురక్షిత తాగునీరు అందించడమే లక్ష్యం
- రాయలసీమను హార్టికల్చర్, ఏరోస్పేస్, గ్రీన్ ఎనర్జీ హబ్‌గా మారుస్తామని హామీ
- ప్రొద్దుటూరులో జరిగిన భారీ బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ, రాష్ట్ర గ్రామీణాభివృద్ధికి ఇక్కడి నుంచే పొద్దుపొడుపు అవుతుందని అన్నారు.

### వివేకా హత్య, లిక్కర్ స్కామ్‌పై సమాధానం

# చెప్పే ధైర్యం ఉందా?

**ప్రొద్దుటూరులో జల్ జీవన్ మిషన్ 2.0 పనులు ప్రారంభం**



ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సమగ్రాభివృద్ధికి, ముఖ్యంగా రాయలసీమ దశ, దిశ మార్చడమే లక్ష్యంగా ఎన్డీఏ ప్రభుత్వం పనిచేస్తోందని ముఖ్యమంత్రి చంద్రబాబు ఉద్ఘాటించారు. ప్రొద్దుటూరులో జరిగిన భారీ బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ, రాష్ట్ర గ్రామీణాభివృద్ధికి మిగతా 2లో

## 'రాయలసీమ ద్రోహి చంద్రబాబు'




- ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రాయలసీమకు చేసిందేమీ లేదని, ఒకవేళ చేసిందేమైనా ఉంటే బహిరంగంగా చెప్పాలని వైఎస్సార్‌సీపీ నేత రాచమల్లు శివప్రసాద్ రెడ్డి సవాల్ విసిరారు.
- 40 ఏళ్లుగా చూస్తే రాయలసీమ ప్రజలను చంద్రబాబు మోసం చేస్తూనే ఉన్నారని రాచమల్ల విమర్శించారు.

ప్రొద్దుటూరు(వైఎస్సార్ కడప జిల్లా): ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రాయలసీమకు చేసిందేమీ లేదని, ఒకవేళ చేసిందేమైనా ఉంటే బహిరంగంగా చెప్పాలని మిగతా 2లో

## భారత్-అమెరికా వాణిజ్య చర్చల్లో స్తబ్దత ఏర్పడింది

ఇరు దేశాల మధ్య వాణిజ్యం ప్రస్తుతం భారత్‌కు అనుకూలంగా ఉండటంతో, ఆ లోటును తగ్గించుకోవడానికి అమెరికా తీవ్రంగా ప్రయత్నిస్తోందని ఆమె వెల్లడించారు.సోమవారం ఢిల్లీలో నిర్వహించిన 'మ్యూనిచ్ లీడర్స్ మీటింగ్ 2026'లో ఆమె మాట్లాడారు. "వాణిజ్య ఒప్పందం కోసం ఇరు దేశాలు పట్టుదలగా చర్చలు జరిపాయి. ప్రస్తుతం ఇచ్చిపుచ్చుకునే ధోరణికి అతీతంగా చర్చలను ముందుకు తీసుకెళ్లడం కష్టతరంగా మారింది" అని ఆమె అభిప్రాయపడ్డారు. అయినప్పటికీ, ఈ చర్చలను మరింత ముందుకు తీసుకెళ్లే అవకాశాలను ఇరుపక్షాలు అన్వేషించవచ్చని సూచించారు.భారత్‌తో వాణిజ్యం వల్ల తమకు ఏళ్లుగా నష్టం జరుగుతోందన్న అమెరికా ఆందోళన ఈ చర్చల్లో స్పష్టంగా ప్రతిబింబిస్తోందని ఆమె తెలిపారు. ఫిబ్రవరి 2026లో ప్రకటించిన మధ్యంతర వాణిజ్య ఒప్పంద ముసాయిదా ప్రాతిపదికన ఈ చర్చలు కొనసాగుతున్నాయి.ఇదే క్రమంలో భారత్-యూరోపియన్ యూనియన్ (ఈయూ) మధ్య కుదిరిన వాణిజ్య ఒప్పందాన్ని ఆమె ఒక విజయవంతమైన ఉదాహరణగా పేర్కొన్నారు. యూరోపియన్ కమిషన్ ప్రెసిడెంట్ అభివర్ణించినట్లుగా ఇది 'తల్లి లాంటి ఒప్పందం' అని ఆమె కొనియాడారు. ఈ ఒప్పందంలో భాగంగా భారత్ 92.5 శాతం టారిఫ్ లైన్లను, 97 శాతం వాణిజ్య విలువను అందుబాటులోకి తెస్తే, ఈయూ తన వైపు నుంచి 97 శాతం టారిఫ్ లైన్లను, 99 శాతం వాణిజ్య విలువను విముక్తం చేసిందని ఆమె వివరించారు.

## ఈజీ వే లేదా హార్డ్ వే.. ఇరాన్‌కు ట్రంప్ స్వీట్ వార్నింగ్

తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఇరాన్ ఇప్పటికే తీవ్రంగా దెబ్బతిందని పేర్కొన్న ఆయన.. అమెరికా తదుపరి చర్య ఏంటనేది త్వరలోనే తేలుస్తానన్నారు. అయితే, తాను తీసుకోబోయే నిర్ణయం సైనిక చర్యా, దౌత్యపరమైన చర్యా అన్నదానిపై మాత్రం స్పష్టత ఇవ్వలేదు.వైట్‌హౌస్ నుంచి ఒహియోకు బయలుదేరే ముందు మీడియాతో మాట్లాడిన ట్రంప్.. ఇరాన్‌పై తమ తదుపరి వ్యూహాన్ని ఖరారు చేస్తున్నట్లు చెప్పారు. ఇరాన్ ఇప్పటికే ధ్వంసమైంది. ఇప్పుడు అది సులభమైన మార్గమా.. కఠినమైన మార్గమా అన్నదే ప్రశ్న అన్న ఆయన వ్యాఖ్యలు పశ్చిమాసియాలో మరోసారి ఉద్రిక్తతలకు దారితీశాయి. ఇరాన్ అణ్వాయుధ సామర్థ్యం సాధించే ప్రయత్నాలను దాదాపు విరమించుకుంటోందని కూడా ట్రంప్ పేర్కొన్నారు. అలాగే, అమెరికా మిత్రదేశాలకు చెందిన లక్ష్యాలను కూడా పరిగణనలోకి తీసుకుంటున్నట్లు సమాచారం. అదే సమయంలో కొత్త ఘర్షణను నివారించేందుకు ఇరాన్ దౌత్య ప్రయత్నాలు కొనసాగిస్తోంది.ట్రంప్ తాజా వ్యాఖ్యలకు ముందు అమెరికా అత్యున్నత జాతీయ భద్రతా అధికారులు క్యాంప్ డేవిడ్‌లో రహస్య సమావేశం నిర్వహించారు. ఇరాన్‌తో కొనసాగుతున్న ఉద్రిక్తతలు, దౌత్య చర్చలు, అవసరమైతే తిరిగి భారీ సైనిక చర్య చేపట్టే అవకాశాలపై ఈ భేటీలో చర్చించినట్లు౼ాఇఅశీం తెలిపింది. యెమెన్‌లో సౌదీ అరేబియా-హౌతీ ఘర్షణలపై అమెరికా విధానంపైనా చర్చ జరిగినట్లు సమాచారం. దౌత్యపరమైన చర్చలు ప్రతిష్ఠంభనలో ఉన్న సమయంలోనే ఈ సమావేశం జరగడం ప్రాధాన్యం సంతరించుకుంది. చర్చల ద్వారా పరిష్కారం లభించకపోతే ఇరాన్‌పై అమెరికా మళ్లీ పెద్దఎత్తున సైనిక చర్యకు దిగే అవకాశాలను ట్రంప్ ప్రభుత్వం పరిశీలిస్తున్నట్లు సంకేతాలు వెలువడుతున్నాయి.మరోవైపు అమెరికా మళ్లీ భారీ స్థాయిలో దాడులు ప్రారంభిస్తే గతంలో కంటే మరింత విస్తృతంగా, తీవ్రంగా ప్రతిదాడి చేసేందుకు ఇరాన్ సిద్ధమవుతున్నట్లు రాయిటర్స్ వెల్లడించింది. ఇరాన్ సైనిక కమాండర్లు అమెరికాకు సంబంధించిన లక్ష్యాలతో పాటు.. అమెరికా సైనిక చర్యలకు మద్దతు ఇచ్చే దేశాలు, మధ్యప్రాచ్యం వెలుపల ఉన్న కొన్ని ప్రాంతాలను కూడా లక్ష్యాలుగా పరిగణిస్తున్నట్లు సమాచారం.

## 2029 నాటికి 4-స్టార్.. ప్రభుత్వ స్కూళ్లపై మంత్రి లోకేశ్ సమీక్ష

ఏడాదిలోగా రాష్ట్రంలోని వన్-స్టార్ పాఠశాలలన్నింటినీ టూ-స్టార్ స్థాయికి అప్‌గ్రేడ్ చేయాలని స్పష్టం చేశారు. అలాగే, ప్రస్తుత విద్యా సంవత్సరంలోగా జీరో-స్టార్ రేటింగ్ ఉన్న పాఠశాలలన్నింటినీ కనీసం వన్-స్టార్ స్థాయికి చేర్చాలని సూచించారు. 2029 నాటికి రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలను 4-స్టార్ ప్రమాణాలకు అనుగుణంగా అభివృద్ధి చేయాలని, కనీసం వెయ్యి పాఠశాలలను 5-స్టార్ స్థాయికి చేర్చేలా పటిష్ఠ ప్రణాళికలు రూపొందించాలని దిశానిర్దేశం చేశారు. ముఖ్యంగా ఏజెన్సీ, వెనుకబడిన ప్రాంతాల్లోని పాఠశాలల అభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. నియోజకవర్గానికి ఒకటి చొప్పున 175 "లీప్ స్కూళ్లను" అభివృద్ధి చేసేందుకు అవసరమైన కార్యాచరణ సిద్ధం చేయాలని కోరారు.ప్రస్తుతం రాష్ట్రంలో 1,685 వన్-స్టార్... 15,618 టూ-స్టార్... 19,099 త్రీ-స్టార్... 7,172 ఫోర్-స్టార్ పాఠశాలలు ఉన్నాయని అధికారులు మంత్రికి వివరించారు. పాఠశాలల్లో మౌలిక సదుపాయాల పురోగతిపై డీఈవోలు, ఎంఈవోలు, సీఆర్‌పీలకు బాధ్యతలు అప్పగించాలని లోకేశ్ సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా 7 వేల హైస్కూళ్లలో పూర్తిస్థాయిలో కంప్యూటర్ ల్యాబ్స్, అటల్ టింకరింగ్ ల్యాబ్స్ ఏర్పాటుపై ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. అకడమిక్ సంస్కరణలు పూర్తయినందున, ఇకపై అధికారులు, ఉపాధ్యాయులు పూర్తిగా అభ్యసన ఫలితాల మెరుగుదలపైనే దృష్టి సారించాలని పిలుపునిచ్చారు.విద్యార్థులకు నైపుణ్య శిక్షణ అందించేందుకు కేంద్ర ప్రభుత్వ పథకాలను సమర్థవంతంగా వినియోగించుకోవాలని మంత్రి లోకేశ్ ఆదేశించారు. ప్రధానమంత్రి కౌశల్ వికాస్ యోజన (పీఎంకేవీవై) ద్వారా ఈ ఏడాది 5 లక్షల మంది విద్యార్థులకు నైపుణ్య శిక్షణ ఇవ్వాలని లక్ష్యంగా నిర్దేశించారు. ప్రధానమంత్రి ఇంటర్న్‌షిప్, నేషనల్ అప్రెంటిస్‌షిప్ స్కీమ్‌లను విద్యార్థులు సద్వినియోగం చేసుకునేలా ప్రోత్సహించాలని సూచించారు. నిరుద్యోగ యువతను "నైపుణ్యం పోర్టల్" పరిధిలోకి తీసుకువచ్చి, ఏఐ సాంకేతికత ద్వారా వారికి ఇంటర్వ్యూలు నిర్వహించాలన్నారు. సీడాప్, ఓంక్యాప్‌ల ద్వారా జర్మన్, జపనీస్ వంటి విదేశీ భాషల్లో శిక్షణనిచ్చి, విదేశాల్లో ఉపాధి అవకాశాలు కల్పించాలని అధికారులను ఆదేశించారు.

## ఖర్గే వ్యాఖ్యలు ప్రజల విచక్షణను అవమానించడమే

రాహుల్‌గాంధీ, ప్రకాశ్‌రాజ్ లాంటి వారు రాజ్యాంగబద్ధమైన సంస్థలపై ప్రజలకున్న విశ్వాసాన్ని దెబ్బతీసేందుకు కుట్ర పన్నుతున్నారని దుయ్యబట్టారు. ఆదివారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో రాంచందర్‌రావు మీడియాతో మాట్లాడారు.'ప్రధాని పదవి కేవలం నెహ్రూ-గాంధీ కుటుంబానికి మాత్రమే సొంతమనే రాచరికపు అహంకారంతో ఉన్న కాం గ్రెస్ పార్టీ, ఒక చాయ్‌వాలా వరసగా మూడోసారి ప్రధాని కావడాన్ని జీర్ణించుకోలేకపోతోంది. వరస ఓటములను తట్టుకోలేక ప్రజాతీర్పును అవమానిస్తోంది' అని మండిపడ్డారు. రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న 'సర్'పై కాంగ్రెస్ చేస్తున్న ఆరోపణల్లో నిజంలేదని రాంచందర్‌రావు అన్నారు. ఈ ప్రక్రియను పూర్తిగా రాష్ట్ర ప్రభుత్వ యంత్రాంగమే నిర్వహిస్తోందన్న విషయాన్ని గుర్తించాలని కాంగట?స్రకు సూచించారు. దమ్ముంటే పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలతో రాజీనామా చేయించి, ఎన్నికల్లో గెలవాలని కాంగట?స్రకు బీజేపీ ఎంపీ డీకే అరుణ సవాల్ చేశారు. కాంగ్రెస్, బీఆర్ఎ?సలు దిగజారుడు రాజకీయాలకు పాల్పడుతూ ఫిరాయింపులను ప్రోత్సహిస్తున్నాయని మండిపడ్డారు. ఖైరతాబాద్ ఉప ఎన్నికలో ఓటమిభయంతోనే కాంగ్రెస్ నేతలు ఎన్నిక జరగకుండా పిటిషన్ వేయించారని ఆరోపించారు.

## ఎన్నికలపై నటుడు ప్రకాశ్‌రాజ్ మాటలు వింటే నవ్వు వస్తోంది

రాజ్యాంగ సంస్థలను నిర్వీర్యం చేశారని ధ్వజమెత్తారు. రాజ్యాంగం, ప్రజాస్వామ్య విలువలపై నమ్మకం పోయేలాగా వారు మాట్లాడుతున్నారని దుయ్యబట్టారు.ఈరోజు (సోమవారం) ఢిల్లీలో మీడియాతో మంత్రి సత్యకుమార్ మాట్లాడారు. కాంగ్రెస్ ,ఇండియా కూటమి నేతలు ఆయా ఎన్నికల్లో ఓటములతో గుణపాఠం నేర్చుకోవడం లేదని అన్నారు. విశ్వాసనీయత లేని వారిని తీసుకువచ్చి కాంగ్రెస్ అగ్రనేతలు మాట్లాడిస్తున్నారని ఆగ్రహించారు. ఎన్నికల గురించి నటుడు ప్రకాశ్‌రాజ్ చెప్పే మాటలు వింటే నవ్వు వస్తోందని ఎద్దేవా చేశారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ కారణంగానే భారతీయులకు గౌరవం దక్కుతుందని ఉద్ఘాటించారు.మల్లికార్జున ఖర్గే ఎన్నికల గురించి మాట్లాడుతున్నారని.. కేరళం, తెలంగాణ, కర్ణాటక, హిమాచల్ ప్రదేశ్‌లో వారు గెలిచారని.. అప్పుడు ఎందుకు మాట్లాడలేదని మంత్రి సత్యకుమార్ ప్రశ్నల వర్షం కురిపించారు. ఎన్నికల ప్రక్రియ గురించి తెలిసిన వారు ఇలా మాట్లాడరని చెప్పుకొచ్చారు. ఎన్నికల ప్రక్రియలో రాజకీయ పార్టీలకు చెందిన బీఎల్‌వోలు, ప్రభుత్వ అధికారులు ఉంటారని ప్రస్తావించారు. అలాంటప్పుడు ఎన్నికల్లో అవకతవకలు ఎలా జరుగుతాయని నిలదీశారు. కాంగ్రెస్ నేతలు అసత్య వ్యాఖ్యలు చేస్తున్నారని దుయ్యబట్టారు. 1950 నుంచి 'సర్' ప్రక్రియ జరుగుతోందని.. అది ఒక నిరంతర ప్రక్రియ అని వివరించారు.పశ్చిమ బెంగాల్‌లో జరిగిన ఎన్నికల్లో ప్రజలు భారీగా పాల్గొన్నారని మంత్రి సత్యకుమార్ తెలిపారు. ఈ ఎలక్షన్‌లో 92.47 శాతం మంది ఓటు హక్కు వినియోగించుకున్నారని ప్రస్తావించారు. ఎన్నికల అధికారిపై ఎందుకు ఆరోపణలు చేస్తున్నారని ప్రశ్నించారు. బ్యాలెట్ పద్ధతిలో ఎన్నికలు జరపాలని అంటున్నారని.. టెక్నాలజీ ప్రకారం ఎన్నికలు నిర్వహిస్తుంటే కాంగ్రెస్ నేతలకు నచ్చడం లేదని మండిపడ్డారు. 13 కోట్ల మంది ఓట్లు తొలగించారని ఫేక్ ప్రచారాలు చేస్తున్నారని.. అంతమంది ఓట్లను తొలగించలేదని స్పష్టం చేశారు. ఫామ్- 6లో ఒక్క మార్పు కూడా జరగలేదని.. తాము చర్చకు సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు. ఎన్నికల అధికారుల మధ్య అభిప్రాయ భేదాలు లేవని.. ఏకగ్రీవంగా నిర్ణయం తీసుకున్నామని మంత్రి సత్యకుమార్ యాదవ్ తేల్చిచెప్పారు.

## 'రాయలసీమ ద్రోహి చంద్రబాబు'

వైఎస్సార్‌సీపీ నేత రాచమల్లు శివప్రసాద్ రెడ్డి సవాల్ విసిరారు. 40 ఏళ్లుగా చూస్తే రాయలసీమ ప్రజలను చంద్రబాబు మోసం చేస్తూనే ఉన్నారని రాచమల్ల విమర్శించారు. రాయలసీమకు చంద్రబాబు ఏం చేశారో చెప్పాలన్నారు. రాయలసీమ ప్రజలు అంటే చంద్రబాబుకు కోపం అని,. రాయలసీమ ద్రోహి చంద్రబాబు అంటూ అభివర్ణించారు.రాయలసీమ ప్రజలకు చంద్రబాబు హరికథలు మాత్రమే చెబుతారంటూ ఎద్దేవా చేశారు. 'వ్యవసాయం దండగ అని చెప్పిన వ్యక్తి చంద్రబాబు. రాయలసీమకు చంద్రబాబు చేసేందేమీ లేదు. 40 ఏళ్లుగా ఇదే జరుగుతూ వస్తుంది. ఏవో హరికథలు మాత్రమే రాయలసీమ ప్రజలకు చెబుతారు చంద్రబాబు. వైఎస్సార్‌సీపీ హయాంలోనే రాయలసీమ అభివృద్ధి చెందింది. రాయలసీమకు మంచి చేసింది వైఎస్సార్, వైఎస్ జగన్‌లు మాత్రమే. వైఎస్సార్‌సీపీ హయాంలో గ్రామీణ ప్రాంతాల్లో 38 లక్షల 74 వేల కుళాయి కనెక్షన్లు ఇచ్చాం. వైఎస్సార్‌సీపీ హయాంలో చేపట్టిన జల్ జీవన్ కార్యక్రమాన్ని కేంద్రం ప్రశంసించింది.రూ. 700 కోట్లతో ఉద్దానానికి వైఎస్ జగన్ సురక్షిత మంచి నీరు ఇచ్చారు. వైఎస్సార్‌సీపీ హయాంలో తాళ్లరామాపురంలో అనేక అభివృద్ధి పనులు చేశాం' అని స్పష్టం చేశారు. చంద్రబాబు జీవితం మొత్తం కుట్రలేనని రాచమల్లు మండిపడ్డారు. కూటమి అధికారంలోకి వచ్చాక రాయలసీమలో 125 నుంచి 150 మందిని హత్యలు జరిగాయి. కూటమి అధికారంలోకి వచ్చాక కర్నూలు జిల్లా 29 హత్యలు చేశారు. అనంతపురంలో 42 మందిని వెన్నుపోటు పార్టీ నేతలు హత్య చేశారు.శ్రీసత్యసాయి జిల్లాలో 54 మందిని హత్య చేశారు' అని పేర్కొన్నారు.

# ఆస్పత్రులు పూర్తయ్యేలోపే సిబ్బంది సిద్ధంగా ఉండాలి

అవసరమయ్యే వైద్యులు, నర్సులు, పారామెడికల్, ఇతర సిబ్బంది సంఖ్యను ముందుగానే గుర్తించాలన్నారు. సిబ్బంది నియామక ప్రక్రియ ను ఇప్పటి నుంచే ప్రారంభించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ని సీఎం ఆదేశించారు. అలాగే ఆస్పత్రులకు అవసరమైన అత్యాధునిక వైద్య పరికరాలను ముందుగానే కొనుగోలు చేయాలని చెప్పారు. నిర్మాణం పూర్తయ్యేనాటికి అన్ని విభాగాల్లో అవసరమైన వైద్య సేవలు అందుబాటులో ఉండేలా సమగ్ర ప్రణాళిక రూపొందించాలని అధికారులను ఆదేశించారు.

కలెక్టర్లు క్షేత్రస్థాయికి వెళ్లాలి

జిల్లా కలెక్టర్లు కేవలం కార్యాలయాలకే పరిమితం కాకుండా క్షేత్రస్థాయిలో పర్యటించేలా చూడాలని ముఖ్యమంత్రి సూచించారు. కలెక్టర్లతోపాటు సంబంధిత అధికారులు ప్రభుత్వ పాఠశాలలు, సోషల్ వెల్ఫేర్ హాస్టళ్లు, ప్రభుత్వ ఆస్పత్రులను తప్పనిసరిగా సందర్శించాలని స్పష్టంచేశారు. ప్రజలు, విద్యార్థులు, రోగులు ఎదుర్కొంటున్న సమస్యలను నేరుగా తెలుసుకుని పరిష్కరించేలా అధికారులు పనిచేయాలన్నారు. ప్రతి జిల్లాలో పాఠశాలలు, హాస్టళ్లు, ఆస్పత్రుల పరిస్థితిపై వారానికోసారి సమీక్ష నిర్వహించాలని సీఎం ఆదేశించారు. సీజనల్ వ్యాధుల వ్యాప్తిపై అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వర్షాకాలంలో వ్యాధుల నియంత్రణకు అవసరమైన ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో అవసరమైన చోట మరమ్మతు పనులను వెంటనే చేపట్టి, విద్యార్థులకు ఇబ్బందుల్లేకుండా చూడాలని ఆదేశించారు.

డిసెంబర్‌లో భారత్ ఫ్యూచర్ సిటీలో నిర్వహించనున్న తెలంగాణ గ్లోబల్ సమ్మిట్--2026 ఏర్పాట్లపైనా సమావేశంలో చర్చించారు. సమ్మిట్‌ను విజయవంతంగా నిర్వహించేందుకు శాఖలవారీగా చేపట్టాల్సిన కార్యక్రమాలపై సమగ్ర కార్యాచరణ సిద్ధం చేయాలని చెప్పారు. ఏర్పాట్లను త్వరలోనే తాను స్వయంగా పరిశీలిస్తానన్నారు. సమావేశంలో ఎంపీ వేం నరేందర్‌రెడ్డి, ప్రభుత్వ సలహాదారు రామకృష్ణారావు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, డీజీపీ సీవీ ఆనంద్, సీఎంవో ఉన్నతాధికారులు పాల్గొన్నారు.తెలంగాణ హైకోర్టు, రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థతో సంప్రదింపులు జరిపి ఈ ఫ్రేమ్‌వర్క్‌ను రూపొందించాలని సూచించారు. మహిళలు, పిల్లల సంరక్షణే తమ ప్రభుత్వ ప్రథమ ప్రాధాన్యత అని ఆయన స్పష్టం చేశారు. ఈ ఫ్రేమ్‌వర్క్ ద్వారా న్యాయ సేవలను రాష్ట్రంలోని ప్రతీ గ్రామానికి విస్తరించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు.ఈ సందర్భంగా తల్లిదండ్రులకు సీఎం కీలక సూచనలు చేశారు. పిల్లల ఆన్‌లైన్ కార్యకలాపాలను గమనించేటప్పుడు తీర్పులిచ్చేలా కాకుండా ఆసక్తిగా, స్నేహపూర్వకంగా వ్యవహరించాలని అన్నారు. "క్యూరియస్‌గా ఉండండి, జడ్జ్‌మెంటల్‌గా కాదు" అని ఆయన హితవు పలికారు. సైబర్ క్రైమ్ ఫిర్యాదుల కోసం 1930, చైల్డ్ హెల్ప్‌లైన్ కోసం 1098 నంబర్లను ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలని కోరారు. రాష్ట్రంలో ఇప్పటికే భరోసా సెంటర్లు, దేశంలోనే మొదటి చైల్డ్ ఫ్రెండ్లీ కోర్టు, సైబర్‌హర్ యాప్ వంటివి సమర్థంగా పనిచేస్తున్నాయని సీఎం గుర్తుచేశారు.విద్యా, వైద్యంపై జిల్లాల వారీగా అధికారులు ప్రతి వారం సమీక్షించాలని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశించారు. రాష్ట్రంలో విద్యా, వైద్యంపై సీఎంవో అధికారులతో ఈరోజు (శనివారం) వీజ=ఇలో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పలు కీలక అంశాలపై అధికారులకు ముఖ్యమంత్రి దిశానిర్దేశం చేశారు. నిర్మాణంలోని ప్రధాన ఆస్పత్రులపై సీఎం ఆరా తీశారు. ఎల్బీనగర్, అల్వాల్, వరంగల్, ఉస్మానియా ఆస్పత్రుల పనుల్లో వేగం పెంచాలని ఆదేశించారు. ఆస్పత్రుల నిర్మాణం పూర్తయ్యే నాటికి సిబ్బంది నియామకాలు పూర్తి చేయాలని మార్గనిర్దేశం చేశారు.వైద్యులు, ఇతర సిబ్బంది అవసరాలను ముందుగానే గుర్తించాలని సీఎం సూచించారు. అత్యాధునిక వైద్య పరికరాల కొనుగోలును వేగవంతం చేయాలని నిర్దేశించారు. ఆయా ఆస్పత్రులు పూర్తయ్యే నాటికి అన్ని వైద్యసేవలు అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు. జిల్లా కలెక్టర్లు క్షేత్రస్థాయిలో పర్యటించాలని దిశానిర్దేశం చేశారు. ప్రభుత్వ పాఠశాలలు, సోషల్ వెల్ఫేర్ హాస్టళ్లను అధికారులు తప్పనిసరిగా సందర్శించాలని ఆదేశించారు. జిల్లాల్లోని ఆస్పత్రులనూ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించాలని సూచించారు.సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని అధికారులను సీఎం ఆదేశించారు. అవసరమైన చోట ప్రభుత్వ పాఠశాలల్లో మరమ్మతులు చేపట్టాలని సూచించారు. తెలంగాణ గ్లోబల్ సమ్మిట్-2026 ఏర్పాట్లపైనా ముఖ్యమంత్రి సమీక్షించారు. డిసెంబరులో భారత్ ఫ్యూచర్ సిటీలో గ్లోబల్ సమ్మిట్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

# వివేకా హత్య, లిక్కర్ స్కామ్‌పై సమాధానం చెప్పే ధైర్యం ఉందా?

ఇక్కడి నుంచే పొద్దుపొడుపు అవుతుందని అన్నారు. ఈ సభ వేదికగా రూ.30,156 కోట్ల భారీ బడ్జెట్‌తో ప్రతిష్ఠాత్మక 'అమరజీవి జలధార' (జల్ జీవన్ మిషన్ 2.0) పథకానికి ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌తో కలిసి శ్రీకారం చుట్టారు. ఈ పథకం ద్వారా రాష్ట్రంలోని 90 లక్షల కుటుంబాలకు ఇంటింటికీ కుళాయి ద్వారా సురక్షితమైన తాగునీటిని అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా గత ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పిస్తూ, పలు కీలక అంశాలపై ప్రతిపక్ష నేతకు సవాల్ విసిరారు.

గ్రామీణ తాగునీటి కష్టాలకు 'అమరజీవి జలధార'తో చెక్

సభలో చంద్రబాబు మాట్లాడుతూ, "ప్రజల తాగునీటి కష్టాలకు శాశ్వత పరిష్కారం చూపేందుకే ఈ రోజు ప్రొద్దుటూరులో ఈ బృహత్కార్యక్రమాన్ని ప్రారంభించాం. తెలుగు జాతి కోసం ప్రాణత్యాగం చేసిన అమరజీవి పొట్టి శ్రీరాములు గారి స్ఫూర్తితో ఈ పథకానికి 'అమరజీవి జలధార' అని పేరు పెట్టాం. నీళ్లు తాగిన ప్రతిసారీ ఆయన త్యాగం గుర్తుకురావాలి. ఈ పథకం ద్వారా రాష్ట్రంలోని 3 కోట్ల 30 లక్షల మంది ప్రజలకు లబ్ధి చేకూరుతుంది. మహిళల నీటి కష్టాలు తీరడంతో పాటు వారి శ్రమ, సమయం, ఖర్చు ఆదా అవుతాయి" అని వివరించారు. గత ప్రభుత్వం కేంద్రం నిధులను సద్వినియోగం చేసుకోలేకపోయిందని, ఇతర రాష్ట్రాలు వేల కోట్లు వినియోగించుకుంటే, గొడ్డలి పార్టీ కేవలం రూ.2,600 కోట్లు మాత్రమే ఖర్చు చేసి రాష్ట్రానికి అన్యాయం చేసిందని ఆయన ఆరోపించారు.

రాయలసీమ దశ మార్చేస్తాం.. రత్నాల సీమగా తీర్చిదిద్దుతాం

రాయలసీమ అభివృద్ధిపై తనకున్న దార్శనికతను వివరిస్తూ, "ఒకప్పుడు కరువు సీమ, రాళ్ల సీమగా పిలిచిన ఈ ప్రాంతాన్ని రత్నాల సీమగా, దేశంలోనే అగ్రగామిగా నిలబెడతాం. మదనపల్లెలో లక్ష కోట్ల రూపాయలతో ప్రపంచానికి ఒక హార్టికల్చర్ హబ్‌గా తయారు చేసే కార్యక్రమానికి ఇప్పటికే శ్రీకారం చుట్టాం. రెండేళ్లలో రూ.24,000 కోట్లు ఖర్చు చేశాం. గొడ్డలి పార్టీ ఐదేళ్లలో ఖర్చు చేసింది కేవలం రూ.2,500 కోట్లు మాత్రమే. తేడా మీరే గమనించండి" అని అన్నారు."రాయలసీమలో కేవలం హార్టికల్చర్ మాత్రమే కాదు, రాబోయే రెండేళ్లలో నెలకు రెండు శాటిలైట్లను ఇక్కడి నుంచే ప్రయోగించేలా స్పేస్ టెక్నాలజీ, పుట్టపర్తి నుంచి శత్రుదేశాల గుండెల్లో వణుకు పుట్టించే ఐదో తరం ఫైటర్ జెట్‌లను తయారు చేసే ఏరోస్పేస్, డ్రోన్ సిటీ, ఆటోమొబైల్, ఎలక్ట్రానిక్స్, స్టీల్, సిమెంట్, గ్రీన్ ఎనర్జీ వంటి ఎన్నో పరిశ్రమలు రానున్నాయి. ఒకప్పుడు స్వర్ణగిరిగా పిలిపించుకున్న జొన్నగిరిలో మళ్లీ బంగారు గనులు వచ్చాయి. రాయలసీమ సత్తా ఇది. కొప్పర్తి, ఓర్వకల్లు పారిశ్రామిక కేంద్రాలుగా అభివృద్ధి చెందుతాయి. బుల్లెట్ రైళ్లు, రాయల్ ఎన్‌ఫీల్డ్ బుల్లెట్ తయారీ పరిశ్రమ కూడా ఇక్కడికే వస్తుంది. ఈ ప్రాంత యువత బుల్లెట్‌లా దూసుకుపోవాలి" అని చంద్రబాబు పిలుపునిచ్చారు.

పవన్ కల్యాణ్ నాయకత్వంలో పల్లెల ప్రగతి

కూటమి ప్రభుత్వంలో ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పనితీరును చంద్రబాబు ప్రశంసించారు. "నా మిత్రుడు పవన్ కల్యాణ్ గ్రామీణాభివృద్ధికి కొత్త రూటు వేశారు. మరెక్కడా లేని విధంగా పవన్ కల్యాణ్ రికార్డు స్థాయిలో ఒకేరోజు 13,326 గ్రామాల్లో గ్రామసభలు పెట్టించారు. ఆయన నాయకత్వంలో రెండున్నర దశాబ్దాల తర్వాత 10 వేల మందికి పైగా ఉద్యోగులకు పదోన్నతులు కల్పించాం. పంచాయతీలకు రూ.4,136 కోట్ల నిధులు విడుదల చేయించాం. లక్షకు పైగా పంట కుంటలు, గోకులాలు ఏర్పాటు చేశారు. ఆయన నేతృత్వంలో గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కోసం ఐదేళ్లలో రూ.1.30 లక్షల కోట్లు ఖర్చు చేయబోతున్నాం" అని ప్రకటించారు.

గొడ్డలి పార్టీకి సూటి ప్రశ్నలు.. ధైర్యం ఉంటే సమాధానం చెప్పాలి

ఈ క్రమంలో గత ప్రభుత్వంపై చంద్రబాబు తీవ్ర స్వరంతో విరుచుకుపడ్డారు. "ఈ కడప గడ్డ, ప్రొద్దుటూరు నుంచే సవాల్ విసురుతున్నా. వివేకానంద రెడ్డి హత్య కేసులో వాస్తవాలు బయటకు వచ్చాయి. అంతిమ లబ్ధిదారు ఎవరో తేలిపోయింది. రూ.40 కోట్ల సుపారీ గుట్టు విప్పింది. దీనిపై సమాధానం చెప్పే ధైర్యం ఉందా? లిక్కర్ స్కామ్‌లో వేల కోట్లు దోచిన అంతిమ లబ్ధిదారు కూడా నువ్వేనని అన్ని వేళ్లూ నీ వైపే చూపిస్తున్నాయి. సమాధానం చెప్పగలవా?" అని నిలదీశారు"ఏపీపీఎస్సీ గ్రూప్-1 పరీక్షల్లో అక్రమాలు చేసి యువత జీవితాలతో ఆడుకున్నారు. ఇసుకను దోచుకున్నారు. మేము అధికారంలోకి వచ్చాక ఉచిత ఇసుక విధానం తెచ్చాం. మద్యం ధరల విషయంలోనూ పారదర్శకంగా ఉన్నాం. కానీ, వాళ్లు నేరాలు చేసి, ఆ నెపాన్ని ఎదుటివారిపై రుద్దడమే పనిగా పెట్టుకున్నారు. అదే వారి డీఎన్ఏ. వారికి అభివృద్ధి సిద్ధాంతం కాదు, కుట్రలు, హింసా రాజకీయాలే వారి సిద్ధాంతం" అని దుయ్యబట్టారు.

ప్రొద్దుటూరుకు వరాలు.. స్థానిక సమస్యలకు పరిష్కారం

స్థానిక ఎమ్మెల్యే వరదరాజులు రెడ్డి కోరిక మేరకు ప్రొద్దుటూరు అభివృద్ధికి పలు వరాలు ప్రకటించారు. డ్రైనేజీల నిర్మాణం కోసం రూ.35 కోట్లు, కొర్రపాడు రోడ్డు విస్తరణకు రూ.8 కోట్లు తక్షణమే మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. పెండింగ్‌లో ఉన్న మున్సిపల్ మార్కెట్ రీమోడలింగ్ పనులను త్వరలోనే పరిష్కరిస్తామని, ఇంజినీరింగ్, పాలిటెక్నిక్ కాలేజీల భవన నిర్మాణాలను పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. రాజోలి, అలగనూరు రిజర్వాయర్ల పనులను కూడా పూర్తి చేసి సాగునీటి సమస్యను తీరుస్తామని చంద్రబాబు భరోసా ఇచ్చారు.చివరగా, ప్రజల మద్దతును కోరుతూ, "కేంద్రంలో మోదీ గారి నాయకత్వంలో, రాష్ట్రంలో ఎన్డీఏ కూటమి పాలనతో డబుల్ ఇంజన్ సర్కార్ బుల్లెట్ వేగంతో దూసుకెళ్తోంది. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కూడా కూటమి అభ్యర్థులను గెలిపిస్తే, ట్రిపుల్ ఇంజన్ సర్కార్ వస్తుంది. అప్పుడు అభివృద్ధి మరింత వేగవంతం అవుతుంది. కుట్ర రాజకీయాలను తిప్పికొట్టి, అభివృద్ధికి పట్టం కట్టండి," అని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

# వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో 'స్థితప్రజ్ఞుడు' పుస్తకావిష్కరణ

సమగ్రంగా సంకలనం చేస్తూ డాక్టర్ కొత్తపల్లి శ్రీనివాస వర్మ ఈ పుస్తకాన్ని రచించారు.ఈ సందర్భంగా శ్రీ సజ్జల రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ, శ్రీ వైయస్ జగన్ రాజకీయ ప్రస్థానాన్ని సమగ్రంగా అధ్యయనం చేసి 'స్థితప్రజ్ఞుడు' పేరుతో పుస్తక రూపంలో తీసుకురావడం అభినందనీయమన్నారు. ఒక రాజకీయ నాయకుడి ప్రయాణాన్ని, ఆయన ఎదుర్కొన్న పరిస్థితులను, తీసుకున్న నిర్ణయాలను, ప్రజలతో ఏర్పరచుకున్న అనుబంధాన్ని పుస్తక రూపంలో భద్రపరచడం భవిష్యత్ తరాలకు ఉపయోగపడుతుందని పేర్కొన్నారు."శ్రీ వైయస్ జగన్ గారి రాజకీయ జీవితంలో ఎన్నో ఒడిదుడుకులు, సవాళ్లు ఎదురైనా స్థిరచిత్తంతో ముందుకు సాగిన తీరు ఈ పుస్తకం శీర్షికలోనే ప్రతిబింబిస్తోంది" అని సజ్జల అన్నారు. ఆయన రాజకీయ ప్రస్థానంలోని ముఖ్య ఘట్టాలను ఒకేచోట చేర్చి పాఠకులకు అందించడం రచయిత చేసిన మంచి ప్రయత్నమని అభినందించారు."రాజకీయ చరిత్రను కేవలం సంఘటనలుగా కాకుండా, వాటి వెనుక ఉన్న పరిస్థితులు, నాయకత్వ ధోరణి, ప్రజలతో ఉన్న సంబంధాన్ని కూడా నమోదు చేయాల్సిన అవసరం ఉంది. ఆ దిశగా 'స్థితప్రజ్ఞుడు' ఒక మంచి ప్రయత్నం" అని పేర్కొన్నారు.పుస్తక రచయిత డాక్టర్ కొత్తపల్లి శ్రీనివాస వర్మను అభినందించిన సజ్జల రామకృష్ణారెడ్డి, ఈ పుస్తకం పాఠకుల ఆదరణ పొందాలని ఆకాంక్షించారు.పుస్తకావిష్కరణ కార్యక్రమంలో రచయిత డాక్టర్ కొత్తపల్లి శ్రీనివాస వర్మ, వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి లేళ్ల అప్పిరెడ్డి, ఎమ్మెల్సీ కల్పలత, ఎంవీఎస్ నాగిరెడ్డి, కొవ్వూరి త్రినాథరెడ్డి, చల్లా మధుసూదన్ రెడ్డి, షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో 'స్థితప్రజ్ఞుడు' పుస్తకావిష్కరణ వేడుక ఘనంగా జరిగింది. పార్టీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి రాజకీయ ప్రయాణం, ఆయన ఎదుర్కొన్న సవాళ్లను ఆధారంగా చేసుకుని సీనియర్ రచయిత కొత్తపల్లి శ్రీనివాస వర్మ ఈ పుస్తకాన్ని రూపొందించారు. ఈ పుస్తకాన్ని వైఎస్సార్‌సీపీ స్టేట్ కోఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డి ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా సజ్జల రామకృష్ణారెడ్డి మాట్లాడారు. 'స్థితప్రజ్ఞుడు' పేరుతో వైఎస్ జగన్ రాజకీయ ప్రయాణాన్ని పుస్తక రూపంలో తీసుకురావడం ఎంతో అభినందనీయం. రాజకీయ నాయకుడిగా ఆయన ఎదుర్కొన్న క్లిష్ట పరిస్థితులు, తీసుకున్న సాహసోపేత నిర్ణయాలు, ప్రజలతో ఏర్పరచుకున్న విడదీయరాని అనుబంధాన్ని భావితరాలకు అందించేందుకు ఈ పుస్తకం దోహదపడుతుంది.రాజకీయ జీవితంలో ఎన్నో ఒడిదుడుకులు, సవాళ్లు ఎదురైనప్పటికీ, వాటన్నింటిని ఎదుర్కొంటూ వైఎస్ జగన్ స్థిర చిత్తంతో ముందుకు సాగిన తీరు అద్భుతం. ఆయన రాజకీయ ప్రస్థానంలోని ముఖ్య ఘట్టాలను ఒకేచోట చేర్చి పాఠకులకు అందించిన రచయిత ప్రయత్నం ప్రశంసనీయమని సజ్జల కొనియాడారు. వైఎస్సార్‌సీపీ లీగల్ సెల్ రాష్ట్ర, జిల్లా ప్రతినిధులతో నిర్వహించిన జూమ్ కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడుతూ.. గత రెండున్నరేళ్లుగా పార్టీ నాయకులు, కార్యకర్తలు, సోషల్ మీడియా ప్రతినిధులకు లీగల్ సెల్ గట్టిగా అండగా నిలిచిందని అభినందించారు.స్థానిక సంస్థల ఎన్నికల్లో అభ్యర్థులకు అవసరమైన కుల ధ్రువీకరణ పత్రాలు, నో డ్యూస్ సర్టిఫికెట్లు, ఇతర పత్రాలను ముందుగానే సిద్ధం చేసుకునేలా సహకరించాలని సూచించారు. నామినేషన్ల దాఖలు, స్క్రూటినీ, పోలింగ్ సందర్భంగా ఎదురయ్యే సమస్యలపై వెంటనే స్పందించే వ్యవస్థ ఉండాలన్నారు.

# రాయలసీమ పౌరుషమంటే గొడ్డలి పోట్లు కాదు.. అభివృద్ధి

రాయలసీమ అభివృద్ధికి అవసరమైన విధంగా మాట్లాడుతున్నా. గొడవలు, కొట్లాటలు, గొడ్డలి పోట్లు కాకుండా అభివృద్ధి లక్ష్యంగా ముందుకు వెళ్దాం" అంటూ ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కల్యాణ్ రాయలసీమ పౌరుషాన్ని ప్రస్తావిస్తూ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. గొడవలకు, పౌరుషానికి ప్రతీకగా నిలిచిన ఈ నేల రూపురేఖలను అభివృద్ధి పథంలో మార్చాలని ఆయన పిలుపునిచ్చారు. కడప జిల్లా ప్రొద్దుటూరులో ముఖ్యమంత్రి చంద్రబాబుతో కలిసి రూ.30,156 కోట్ల విలువైన 'అమరజీవి జలధార' పథకానికి శంకుస్థాపన చేసిన సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో పవన్ కల్యాణ్ తనదైన శైలిలో ప్రసంగించారు.ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సాధన కోసం ప్రాణత్యాగం చేసిన అమరజీవి పొట్టి శ్రీరాములు పేరు మీద ఈ బృహత్తర తాగునీటి పథకాన్ని ప్రారంభించడం సంతోషంగా ఉందని పవన్ అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 3.27 కోట్ల మంది ప్రజలకు సురక్షితమైన తాగునీరు అందించే లక్ష్యంతో 24,601 ఆవాసాల్లో 50,315 పనులను ఈ పథకం కింద చేపట్టనున్నట్లు వివరించారు. ఈ సందర్భంగా గత ప్రభుత్వంపై ఆయన తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. "ప్రధాని నరేంద్ర మోదీ ప్రారంభించిన 'హర్ ఘర్ జల్ - జలజీవన్ మిషన్'కు 2019-24 మధ్య అధికారంలో ఉన్న ప్రభుత్వం తూట్లు పొడిచింది. రూ.26,000 కోట్ల విలువైన పనులకు ప్రతిపాదనలు పంపి, ఐదేళ్లలో కేవలం రూ.2,700 కోట్లు మాత్రమే ఖర్చు చేసి ఏ ఒక్క ప్రాజెక్టునూ పూర్తి చేయలేదు. ప్రజల తాగునీటి కష్టాలను ఏమాత్రం పట్టించుకోలేదు" అని దుయ్యబట్టారు.2024లో ఈ పథకం ముగిసిపోవాల్సిన తరుణంలో, కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే తాను, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కలిసి ప్రధాని మోదీ, కేంద్ర మంత్రులు సి.ఆర్. పాటిల్, నిర్మలా సీతారామన్‌లను కలిసి విజ్ఞప్తి చేశామని గుర్తుచేశారు. వారి సహకారంతో ఈ పథకాన్ని 2028 వరకు పొడిగించుకుని, పనులను వేగవంతం చేశామని తెలిపారు. "గత ప్రభుత్వం ఖర్చు చేయగా మిగిలిన పనులతో పాటు, ఇప్పటికే మేము రూ.4,500 కోట్ల విలువైన పనులను పూర్తి చేశాం. మీరు మాపై ఉంచిన నమ్మకమే మాకు శ్రీరామరక్ష" అని పవన్ పేర్కొన్నారు.తమది కక్షసాధింపుల ప్రభుత్వం కాదని, ప్రజాభివృద్ధిని మాత్రమే లక్ష్యంగా పెట్టుకుందని పవన్ స్పష్టం చేశారు. "దశాబ్దాలుగా తాగునీటి సమస్యతో అల్లాడుతున్న పులివెందుల నియోజకవర్గంలో అసంపూర్తిగా నిలిచిపోయిన పథకాలకు రూ.280 కోట్లు కేటాయించి 7 మండలాల్లోని 299 గ్రామాలకు నీరందిస్తున్నాం. అలాగే, వైసీపీ ఎంపీ ఉన్నప్పటికీ అల్లూరి సీతారామరాజు జిల్లాలోని అరకు, పాడేరు నియోజకవర్గాల్లో రూ.2,500 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టాం. మాకు పార్టీలు కాదు, ప్రజల సమస్యలే ముఖ్యం" అని ఉద్ఘాటించారు.గత ప్రభుత్వ హయాంలో తమ పార్టీకి మద్దతిచ్చారనే కారణంతో ప్రొద్దుటూరు నియోజకవర్గంలోని తాళ్లమాపురం గ్రామ ప్రజలను నాటి శాసనసభ్యుడు తీవ్రంగా అవమానించారని, వారి వినతిపత్రాన్ని కళ్లెదుటే నలిపి పడేశారని పవన్ ఆవేదన వ్యక్తం చేశారు. ఆ గ్రామాల అభివృద్ధి కోసం తక్షణమే రూ.3.5 కోట్లతో సీసీ రోడ్లు, తాగునీటి పథకాలను మంజూరు చేస్తున్నట్లు ముఖ్యమంత్రి సమక్షంలో ప్రకటించారు.రాష్ట్ర చరిత్రలో మునుపెన్నడూ లేని విధంగా మౌలిక వసతులను కల్పిస్తున్నామని గణాంకాలతో వివరించారు. "రాష్ట్రం ఏర్పడిన నాటి నుంచి 2024 వరకు నిర్మించిన వాటర్ ట్రీట్మెంట్ ప్లాంట్లు, రిజర్వాయర్ల సామర్థ్యానికి అదనంగా 50 శాతం నుంచి 175 శాతం వరకు కేవలం ఈ ఐదేళ్లలోనే నిర్మించబోతున్నాం" అని తెలిపారు. నీటిని అందించడం ప్రభుత్వ బాధ్యత అయితే, దాన్ని కాపాడుకోవడం మనందరి బాధ్యత అని ప్రజలకు పిలుపునిచ్చారు.

# రామప్ప సమీపంలో ఓపెన్‌కాస్ట్.. ఆపకుంటే ఉద్యమమే

ఆలయం పరిసరాల్లో బొగ్గుగని ప్రతిపాదన వెంటనే వెనక్కు తీసుకోవాలన్నారు. లేకపోతే రామప్ప వారసత్వ సంపదకు ముప్పు వాటిల్లే అవకాశం ఉందన్నారు. ఒకవేళ ప్రభుత్వం ఈ మాటలు పట్టించుకోకుండా ఆలయానికి హాని చేసే ప్రయత్నాలు చేస్తే పెద్దఎత్తున ఉద్యమం చేపడతామని కేటీఆర్ ప్రభుత్వానికి హెచ్చరికలు జారీ చేశారు.కాగా ములుగు జిల్లా, వెంకటాపూర్ గ్రామ పరిధిలో ఓపెన్ కాస్ట్‌ఏర్పాటు చేయడానికి సింగరేణి సంస్థ ప్రణాళికలు సిద్ధం చేసింది. ఈ గని ద్వారా దాదాపు 300 మీటర్ల లోతు వరకు తవ్వకాలు జరపాలని నిర్ణయించారు. దీనివల్ల రామప్ప దేవాలయం ప్రత్యేకమైన 'శాండ్‌బాక్స్' (ఇసుక) ఫౌండేషన్‌కు, రామప్ప చెరువు నీటి నిల్వలకు తీవ్ర ముప్పు వాటిల్లుతుందని నిపుణులు, కాకతీయ హెరిటేజ్ ట్రస్ట్ ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి.సుమారు 5 కిలోమీటర్ల దిగువన ఉండే ఈ మైనింగ్ కారణంగా భూగర్భ జలాల ప్రవాహం మారి, చెరువు నుంచి నీరు కారే ప్రమాదం ఉందని జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా (+ూ×) నివేదికలు హెచ్చరించాయి. ఈ ప్రాజెక్టును నిలిపివేయాలని కోరుతూ కాకతీయ హెరిటేజ్ ట్రస్ట్ సభ్యులు కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. అలాగే స్థానిక గ్రామాల ప్రజలతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళనలకు సన్నాహాలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో దీనిపై కేటీఆర్ స్పందించారు. సీఎం రేవంత్‌రెడ్డి సర్కార్‌పై మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. భూములు దోచుకోవడం అయిపోయిందని.. ఇప్పుడు భూముల లోపల ఉన్న సంపద దోచుకొని, వారసత్వ కట్టడాలను కూల్చడానికి రేవంత్ సర్కార్ కుట్రలు పన్నుతుందని ధ్వజమెత్తారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా కేటీఆర్ పోస్టు పెట్టారు.

రామప్పకు తీవ్ర ముప్పు..

రామప్ప దేవాలయానికి అతి సమీపంలో ఓపెన్ కాస్ట్ బొగ్గు గని ఏర్పాటు చేయడానికి కాంగ్రెస్ ప్రభుత్వం సిద్ధమవడం దారుణమని కేటీఆర్ మండిపడ్డారు. మీటర్ల కొద్ది లోతులో తవ్వకాలు, బ్లాస్టింగ్స్ చేయడం వల్ల తెలంగాణ శిల్పకళకు ప్రతిరూపం, యునెస్కో ద్వారా ప్రపంచ వారసత్వ సంపదగా గుర్తింపు పొందిన రామప్ప దేవాలయానికి, రామప్ప చెరువుకు తీవ్ర ముప్పు వాటిల్లనుందని హెచ్చరించారు. వారసత్వ సంపదను ధ్వంసం చేసే ఈ కుట్రలను బీఆర్ఎస్ పార్టీ వ్యతిరేకిస్తుందని పేర్కొన్నారు. ప్రఖ్యాత రామప్ప దేవాలయానికి హాని చేసే ఓపెన్ కాస్ట్ బొగ్గు గని ప్రతిపాదనను వెంటనే వెనక్కి తీసుకోకుంటే పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని కేటీఆర్ హెచ్చరించారుముగిసిందని అన్నారు. సాధారణంగా ప్రతిపక్షం నుంచి అధికార పక్షంలోకి వలసలు ఉంటాయని, కానీ ఎన్నికలకు ఇంకా రెండేళ్ల సమయం ఉన్నప్పటికీ అధికార కాంగ్రెస్ నుంచి నేతలు ప్రతిపక్షమైన బీఆర్ఎస్‌లోకి రావడం అసాధారణమని వ్యాఖ్యానించారు.

శ్రీ వార్త
జాతీయ తెలుగు దినపత్రిక


## వర్ధన్నపేటలో దళిత యువతిని మోసం చేసిన మున్సిపల్ చైర్మన్ కొడుకు పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలి

తెలంగాణ అంబేద్కర్ సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షులు జన్ను నరసయ్య



వరంగల్ జిల్లా వర్ధన్నపేట మండలం అక్టోబర్ 6 :వర్ధన్నపేట పట్టణానికి చెందిన దళిత యువతిని ప్రేమ పేరుతో మోసం చేసిన వర్ధన్నపేట మున్సిపల్ చైర్మన్ కుమారూడి పై చట్టపరమైన చర్యలు ప్రభుత్వ అధికారులు తీసుకోవాలని తెలంగాణ అంబేద్కర్ సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షులు జన్ను నరసయ్య డిమాండ్ చేశారు మంగళవారం రోజున వర్ధన్నపేటలో సారంగపాణి ఇంటి ముందు మోసపోయిన యువతి రెండవ రోజు దీక్ష చేపట్టిన సందర్భంగా,తెలంగాణ అంబేద్కర్ సంఘం తరపున దళిత మహిళల కు సంఘీభావం ప్రకటించి అండగా ఉంటామని స్పష్టం చేశారు. వర్ధన్నపేట శాసనసభ్యులు కూడా దళిత వర్గానికి చెందిన వ్యక్తి కనుక మున్సిపల్ చైర్మన్ కూడా అధికార పార్టీకి చెందిన వ్యక్తి కావున ఎమ్మెల్యే చొరవ తీసుకొని మోసపోయిన దళిత యువతిని చైర్మన్ కుమారుడు వివాహం చేసుకునే విధంగా చర్యలు తీసుకోవాలని పత్రికా ముఖంగా కోరుతున్నామని .అలా జరగని పక్షంలో దీక్షను ఉధృతం చేసి నిరసన కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరించారు. ఈ సమావేశంలో మాదిగ ఐక్య సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు జన్ను రాములు,అంబేద్కర్ సంఘం వరంగల్ జిల్లా ఇన్చార్జి తాటికాయల వివేకనంద ,వరంగల్ జిల్లా కో కన్వీనర్ జంగిలి భాస్కర్లతో పాటు వర్ధన్నపేట పట్టణానికి చెందిన పలువురు మహిళలు పలు సంఘాల నాయకులు పాల్గొని సంఘీభావం ప్రకటించారు

## 10:30 దాటినా ఎంపీడీవో కార్యాలయం బందే.. విలేకరులు ఫొటోలు తీయడంతో తెరిచిన గేట్లు

రామడుగు, అక్టోబర్ 6::రామడుగు మండల పరిషత్ అభివృద్ధి అధికారి (ఎంపీడీవో) కార్యాలయంలో




ఉద్యోగుల సమయపాలనపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. మంగళవారం ఉదయం 10:30 గంటలు దాటినా కార్యాలయ ప్రధాన గేటుకు తాళం వేసి ఉండటంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు.వివిధ పనుల నిమిత్తం కార్యాలయానికి వచ్చిన ప్రజలు గేటు వద్దే వేచి ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. విధులకు హాజరు కావాల్సిన ఉద్యోగులు సైతం అందుబాటులో



లేకపోవడంపై ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రభుత్వ కార్యాలయాలు నిర్ణీత సమయానికి తెరుచుకుని ప్రజలకు సేవలు అందించాల్సి ఉండగా, ఇక్కడ మాత్రం ఉదయం 10:30 గంటలైనా కార్యాలయం తెరుచుకోకపోవడం చర్చనీయాంశంగా మారింది.విలేకరులు కార్యాలయం వద్దకు చేరుకుని ఫొటోలు తీస్తుండగా గేట్లు తెరుచుకున్నాయి. దీంతో కార్యాలయం తెరవడానికి కూడా మీడియా రాక అవసరమా అంటూ పలువురు ప్రశ్నిస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి సిబ్బంది హాజరు, సమయపాలనపై చర్యలు తీసుకుని ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని స్థానికులు కోరుతున్నారు.

## మూడోసారి ప్రథమ స్థానంలో భద్రాద్రి కొత్తగూడెం కబడ్డీ జట్టు విజేతలను అభినందించిన ఎమ్మెల్యే జారే...

అశ్వరావుపేట ఆర్సి / అక్టోబర్ 6 తెలంగాణ రాష్ట్ర కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో రాజన్న సిరిసిల్ల జిల్లాలో నిర్వహించిన 36వ అంతర్ జిల్లాల కబడ్డీ ఛాంపియన్‌షిప్‌లో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా జట్టు సత్తా



చాటింది. రాష్ట్రంలోని 34 జిల్లాల నుంచి జట్లు పాల్గొన్న ఈ ప్రతిష్ఠాత్మక పోటీల్లో భద్రాద్రి కొత్తగూడెం జట్టు ప్రథమ స్థానం సాధించి మూడోసారి అగ్రస్థానంలో నిలిచింది.ఈ సందర్భంగా జిల్లా కబడ్డీ అసోసియేషన్



అధ్యక్షుడు, అశ్వారావుపేట ఎమ్మెల్యే జారె ఆదినారాయణ విజేతలను అభినందించారు. క్రీడాకారులు, కోచ్‌లు, అసోసియేషన్ ప్రతినిధులను ప్రత్యేకంగా అభినందించారు. జిల్లా క్రీడాకారుల విజయం ఇతర యువ క్రీడాకారులకు స్ఫూర్తిదాయకమని, క్రీడాకారులకు ఎలాంటి సమస్యలు ఉన్నా పరిష్కారానికి పూర్తి సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు.జిల్లాలో కబడ్డీకి మంచి ఆదరణ ఉందని, గ్రామీణ యువతకు మెరుగైన శిక్షణ ఇస్తే జాతీయ స్థాయిలో రాణిస్తారని జిల్లా కబడ్డీ అసోసియేషన్ కార్యదర్శి కె. స్వాతి ముత్యం తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా కోశాధికారి కూరాకుల నరేష్, సంయుక్త కార్యదర్శి ఏ. యేసు, కోచ్ సిహెచ్. రాంబాబు, సీనియర్ క్రీడాకారుడు బి. శ్రీరామ్ గాంధీ తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు గద్వాల విద్యార్థుల ఎంపిక

జిల్లా స్థాయిలో సత్తా చాటిన ముగ్గురు విద్యార్థులు

వివిధ పరుగు పందెం విభాగాల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులు

కొమురం భీం ఆసిఫాబాద్‌లో జరిగే రాష్ట్ర పోటీలకు సిద్ధమైన విద్యార్థులు

గద్వాల గద్వాల శ్రీ సరస్వతీ టాలెంట్ ఉన్నత పాఠశాలకు చెందిన ముగ్గురు విద్యార్థులు రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికయ్యారు. 2026 అక్టోబర్ 4 న జోగులాంబ గద్వాల జిల్లాలో నిర్వహించిన జిల్లా



స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో 9వ తరగతి విద్యార్థి అరవింద్ పద్నాలుగేళ్ల లోపు విభాగంలో 300 మీటర్ల పరుగు పందెంలో, 7వ తరగతి విద్యార్థి రోహిత్ నాయక్ పన్నెండేళ్ల లోపు విభాగంలో 60, 200 మీటర్ల పరుగు పందెంలో, సేవా నాయక్ పదేళ్ల లోపు




విభాగంలో 60 మీటర్ల పరుగు పందెంలో పాల్గొని ప్రతిభ కనబరిచారు. జిల్లా స్థాయి పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన వీరు 2026 అక్టోబర్ 8, 9 తేదీల్లో కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లాలో జరిగే రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో పాల్గొననున్నారు. విద్యార్థుల ప్రతిభను అభినందిస్తూ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఆర్. వెంకటయ్య గౌడ్, బాధ్యతలు నిర్వహిస్తున్న కృష్ణారెడ్డి, వ్యాయామ ఉపాధ్యాయులు వేణు, ఆనంద్ ప్రశంసా పత్రాలు అందజేసి అభినందనలు తెలిపారు.

## బుజ్జి కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న మాజీ ఏఎంసీ చైర్మన్ కడవకొల్లు

బచ్చు నాగమల్లేశ్వరరావు కుటుంబాన్ని పరామర్శించిన మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ కడవకొల్లు



అవనిగడ్డ అక్టోబర్ 6 శ్రీవార్త మండల పరిధిలోని దక్షిణ చిరువోలు లంక గ్రామ కాపురస్తులు వైయస్సార్సీపి సీనియర్ నాయకులు, కాంట్రాక్టర్ మరియు డిఎస్పి బచ్చు మెహర్ ప్రసాద్ సోదరుడు బచ్చు నాగమల్లేశ్వరరావు ( బుజ్జి ) మరణించిన సందర్భములో వారి కుటుంబ సభ్యులను మంగళవారం పరామర్శించి ధైర్యం చెప్పిన మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ కడవకొల్లు నరసింహారావు .ఈ కార్యక్రమంలో వారి వెంట దక్షిణ చిరుగోళ్ళంక గ్రామ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బచ్చు వెంకట రాయుడు , బచ్చు ఆంజనేయులు , బాడిగ నాంచారయ్య, అరవ హరిప్రసాద్ , పర్చూరు సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

## నిరసన తెలుపుతున్న ఆశా అంగనవాడి వర్కర్లు ఆశ అంగన్వాడీలకు కనీస వేతనాలు చెల్లించాలి



అవనిగడ్డ అక్టోబర్ 6 శ్రీవార్త ఆశ వర్కర్లకు అంగన్వాడీలకు కనీస వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం ఆంధ్ర ప్రదేశ్ ఆశ వర్కర్స్ యూనియన్, ఆంధ్రప్రదేశ్ అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో అవనిగడ్డలో నిరసన ర్యాలీ నిర్వహించారు. అవనిగడ్డ టీటీడీ కళ్యాణ మండపం వద్ద నుండి నియోజకవర్గం నలుమూలల నుండి వచ్చిన ఆశ వర్కర్లు, అంగన్వాడి కార్యకర్తలతో ర్యాలీగా ఎమ్మెల్యే కార్యాలయం వరకు వెళ్లి అక్కడ సమస్యలతో కూడిన మెమోరాండం అందజేశారు. ఎమ్మెల్యే కార్యాలయం వద్ద ఎమ్మెల్యే, కార్యాలయానికి సంబంధించి న సిబ్బంది ఎవరు లేకపోవడంతో బుద్ధ ప్రసాద్ సతీమణి విజయలక్ష్మి కి మెమోరాండం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆశ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి పి .ధనశ్రీ, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఎం. డి. కరిముల్లా, జిల్లా కార్యవర్గ సభ్యులు సిహెచ్. రాజశేఖర్, విక్టోరియా, శివ శంకరమ్మ, ఎల్. కమల వాణి, ఎం. పణి శ్రీ, డి. మరియమ్మ, ఎస్. రమ్యశ్రీ, అంగన్వాడి నాయకులు ఎం. కాశీ హంస, జి. అఖిల, పీజీ. లక్ష్మి, కె. అఖిల, డీఎస్ కళ్యాణి తదితరులు పాల్గొన్నారు.

## జ్యోతి ప్రజ్జాలన చేస్తున్న ఇన్చార్జి నాగలక్ష్మి ఉపాధ్యాయ బృందం

విద్యార్థులను ప్రోత్సహించడమే మా లక్ష్యం



అవనిగడ్డ అక్టోబర్ 6 శ్రీవార్త విద్యార్థులను ప్రోత్సహించడమే మా లక్ష్యం అని ప్రిన్సిపాల్ సిహెచ్ బాబురావు అన్నారు.అవనిగడ్డ లోని నారాయణ టెక్నో స్కూల్లో 1,2 తరగతుల విద్యార్థులకు స్టూడెంట్స్ లెడ్ కాన్ఫరెన్స్ కార్యక్రమం మంగళవారం ఉదయం నిర్వహించారు. ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థులు తమ తల్లి, దండ్రుల సమక్షంలో మొదటి టర్మ్‌లో వారు నేర్చుకున్న అంశాలను వివిధ రకాల మోడల్స్, ప్రాజెక్టుల రూపంలో పేరెంట్స్ కు వివరించారు. దీనితో తల్లిదండ్రులు తమ ఆనందాన్ని వ్యక్తపరిచారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ సిహెచ్. బాబురావు మాట్లాడుతూ తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రోత్సహించడం ద్వారా వారు మరింత రాణించగలుగుతారని తెలుపుతూ ఈ కార్యక్రమానికి హాజరైనందుకు తల్లిదండ్రులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్ ప్రిన్సిపాల్ శ్రీనివాస్, ఈ ఛాన్స్ కోఆర్డినేటర్ లియో నీ, ఏవో సుబ్రహ్మణ్యం, ఇంచార్జ్ తలుపుల నాగలక్ష్మి, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

## నాగమల్లేశ్వరరావు కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే సింహాద్రి

కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి



అవనిగడ్డ అక్టోబర్ 6 శ్రీవార్త మండల పరిధిలోని దక్షిణ చిరువోలు లంక గ్రామానికి చెందిన కాంట్రాక్టర్ సింహాద్రి రమేష్ బాబు కి బంధువులు అత్యంత సన్నిహితులు బచ్చు నాగమల్లేశ్వరరావు(బుజ్జి) , ఇటీవల అనారోగ్యం కారణంగా మరణించారు. మంగళవారం ఉదయం వారి స్వగృహం నందు బుజ్జి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలియజేసిన అవనిగడ్డ నియోజకవర్గం మాజీ శాసనసభ్యులు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త మరియు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర రైతు విభాగం రీజనల్ వర్కింగ్ ప్రెసిడెంట్ సింహాద్రి రమేష్ బాబు పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గరికపాటి వెంకట కృష్ణారావు మరియు పార్టీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక గ్రామస్థులు, తదితరులు పాల్గొన్నారు,

## గీతా పారాయణం చేస్తున్న భక్తులు సామూహిక గీతా పారాయణం



అవనిగడ్డ అక్టోబర్ 6 శ్రీవార్త గీతా మందిరంలో భక్తులు సామూహికంగా గీతా పారాయణం చేశారు. బాంద్రపద బహుళ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని మంగళవారం సామూహికంగా భగవద్గీత పారాయణం చేశారు. పెద్ద సంఖ్యలో మహిళా భక్తులు పాల్గొనగా ముందుగా విష్ణు సహస్రనామ స్తోత్ర పారాయణం సామూహికంగా నిర్వహించి గీతలోని 18 పద్యాలు పట్టణం చేయగా లక్ష్మీ తాయారమ్మ అన్నపూర్ణ అరుణకుమారి తదితరుల ఆధ్వర్యంలో పారాయణం నిర్వహించారు. అనంతరం అర్చక స్వాములు భక్తులకు మంత్రపుష్పం తీర్థప్రసాదాలను వితరణ చేశారు. ఆలయ ధర్మకర్త ఎర్రంశెట్టి శ్రీహరిబాబు ఏర్పాట్లను పర్యవేక్షించారు,

## రోగులతో మాట్లాడుతున్న వైసిపి యువ నేత గౌతమ్ నిద్రావస్థలో అవనిగడ్డ ప్రభుత్వ ఆసుపత్రి సిబ్బంది



అవనిగడ్డ అక్టోబర్ 6 శ్రీ వార్తగత మూడు రోజులుగా ఆసుపత్రిలో తాగునీరు సక్రమంగా అందడం లేదని, అలాగే రోగులకు అందించాల్సిన ఆహారం కూడా సక్రమంగా సరఫరా కావడం లేదని వైసీపీ నేత గౌతమ్ దృష్టికి తీసుకురాగా మంగళవారం అవనిగడ్డ ప్రభుత్వ ఆసుపత్రిని సందర్శించి, అక్కడ చికిత్స పొందుతున్న రోగులను స్వయంగా కలిసి వారి సమస్యలను తెలుసుకొని పలు రోగులను విచారించగా మూడు రోజులుగా తాగునీరు, ఆహారం అందక రోగులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు.ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే రోగుల్లో చాలామంది పేద, మధ్యతరగతి కుటుంబాలకు చెందినవారని, అనారోగ్యంతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వారికి కనీసం స్వచ్ఛమైన తాగునీరు, నాణ్యమైన ఆహారం అందించలేని పరిస్థితి ఉండటం ఆందోళన కలిగించే విషయమని గౌతమ్ అన్నారు.మూడు రోజులుగా సమస్య కొనసాగుతున్నప్పటికీ సంబంధిత అధికారులు ఎందుకు స్పందించలేదో ప్రజలకు సమాధానం చెప్పాలని, రోగుల ఆరోగ్యంతో నిర్లక్ష్యంగా వ్యవహరించడం సరికాదని,అధికారులు తక్షణమే అవనిగడ్డ ప్రభుత్వ ఆసుపత్రిని పరిశీలించి, తాగునీరు మరియు రోగులకు అందించే ఆహార సరఫరాలో ఏర్పడిన సవ

## కూచిపూడికి యునెస్కో గుర్తింపు దిశగా కార్యాచరణ వేగవంతం జిల్లా కలెక్టర్ డీకే బాలాజి



పామర్రు శ్రీ వార్త న్యూస్:కూచిపూడి నాట్యకళకు యునెస్కో అమూర్త సాంస్కృతిక వారసత్వ (ఇంటంజిబుల్ కల్చరల్ హెరిటేజ్) గుర్తింపు తీసుకురావడానికి అవసరమైన డాక్యుమెంటేషన్ ప్రక్రియను సమగ్రంగా ముందుకు తీసుకెళ్లాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజి అన్నారు. పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం, కృష్ణా జిల్లా పరిపాలనా యంత్రాంగం ఆధ్వర్యంలో, రాష్ట్ర యువజనాభివృద్ధి, పర్యాటక, సాంస్కృతిక శాఖల సహకారంతో కూచిపూడి సిద్ధేంద్ర కళాక్షేత్రంలో నిర్వహిస్తున్న జాతీయ కార్యశాలలో మంగళవారం కలెక్టర్ పాల్గొని ప్రసంగించారు.కూచిపూడి గ్రామం పేరుతో ప్రపంచానికి పరిచయమైన ఏకైక భారతీయ శాస్త్రీయ నృత్యరీతిగా ప్రత్యేకతను కలిగి ఉందని కలెక్టర్ పేర్కొన్నారు. కూచిపూడి కళను మరింత అభివృద్ధి చేయడంతో పాటు భావితరాలకు అందించేందుకు బలమైన సంస్థాగత వ్యవస్థ అవసరమని అన్నారు. తెలుగు



విశ్వవిద్యాలయం విభజన అనంతరం కూచిపూడి అభివృద్ధిపై మరింత దృష్టి సారించే అవకాశం ఏర్పడిందని, సంస్థాగతంగా ఉన్న అడ్డంకులు తొలగిపోయాయని చెప్పారు.కూచిపూడిని మరింత మందికి చేరువ చేయడానికి స్వల్పకాలిక కోర్సులు, వేసవి శిబిరాలు, నివాస శిక్షణ కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించాలని సూచించారు. దేశ, విదేశాల నుంచి ఆసక్తి ఉన్న వారు రెండు, మూడు వారాలు కూచిపూడిలో ఉండి నాట్యకళపై అవగాహన పొందేలా రెసిడెన్షియల్ కార్యక్రమాలను రూపొందిస్తే కళను ఆదరించే వారి సంఖ్య మరింత పెరుగుతుందని అన్నారు.కూచిపూడి కళను పర్యాటకంతో అనుసంధానం చేయాల్సిన అవసరం ఉందని కలెక్టర్ తెలిపారు. కూచిపూడి నాట్యకళ చరిత్ర, నాట్యరూపాలు, నాటక సంప్రదాయం, కళాకారుల వివరాలను సందర్శకులకు పరిచయం చేసేలా ప్రదర్శనశాలలను ఏర్పాటు చేయాలని సూచించారు. పర్యాటక శాఖ ద్వారా సుమారు రూ.3 కోట్లతో పుష్కరిణి అభివృద్ధి, వేదిక నిర్మాణం వంటి కార్యక్రమాలను చేపట్టే ఆలోచన ఉందన్నారు.కూచిపూడిపై పరిశోధన, డాక్యుమెంటేషన్‌ను మరింత విస్తృతం చేసి శాస్త్రీయంగా సమాచారాన్ని భద్రపరచాల్సిన అవసరం ఉందన్నారు. సంగీత నాటక అకాడమీ గుర్తింపు ప్రక్రియతో పాటు యునెస్కో అమూర్త సాంస్కృతిక వారసత్వ జాబితాలో కూచిపూడికి స్థానం కల్పించేందుకు సమష్టి కృషి చేయాలని పిలుపునిచ్చారు.కూచిపూడి కేవలం కొద్దిమంది కళాకారులకో, ఒక గ్రామానికో పరిమితమైన కళ కాదని,కోట్లాది మంది తెలుగు ప్రజల సాంస్కృతిక వారసత్వమని కలెక్టర్ అన్నారు. కూచిపూడి కంటే మనం గొప్పవాళ్లం కాదనే వినయ భావనతో కళను ముందుకు తీసుకెళ్లాలని సూచించారు. కూచిపూడి కళాభివృద్ధే అందరి ప్రధాన లక్ష్యంగా ఉండాలని కోరారు.ఈ సందర్భంగా జాతీయ కార్యశాల నిర్వహణకు కృషి చేసిన పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సర్ తో పాటు సహాయ కలెక్టర్ నమ్రత అగర్వాల్ ను కలెక్టర్ అభినందించారు.కార్యక్రమంలో పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సర్ మునిరత్నం నాయుడు, వైస్ ప్రిన్సిపల్ చింతా రవి బాలకృష్ణ, వైస్ ఛాన్సర్ జొన్నలగడ్డ రమాదేవి, జిల్లా పర్యాటక శాఖ అధికారి జి రామలక్ష్మణరావు, ప్రముఖ గురువులు రామలింగ శాస్త్రి, డాక్టర్ తాడేపల్లి, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# భూ సమస్యలపై ఆర్డీవో క్షేత్రస్థాయి పరిశీలన దేవాదాయ--రెవెన్యూ భూముల పరిశీలన..

### సోమూర్‌లో రీ సర్వే పనుల తనిఖీ..





జుక్కల్ అక్టోబర్ 06 బాన్సువాడ ఆర్డీవో రవీందర్ రెడ్డి మంగళవారం మద్నూర్ మండలంలో పర్యటించి పలు భూ సమస్యలు, రీ సర్వే పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ముందుగా మద్నూర్ మండల కేంద్రం, కొట్చిర గ్రామాల్లో దేవాదాయ--రెవెన్యూ శాఖల మధ్య ఉన్న భూ సమస్యలను పరిశీలించారు. సంబంధిత భూముల రికార్డులు, హద్దులు, ఆక్రమణలకు సంబంధించిన వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. సమస్య పరిష్కారానికి సంబంధిత శాఖల సమన్వయంతో చర్యలు తీసుకుని త్వరగా నివేదిక సమర్పించాలని అధికారులను ఆదేశించారు.అనంతరం సోమూర్ గ్రామంలో కొనసాగుతున్న రీ సర్వే పనులను పరిశీలించారు. గ్రామస్థులతో మాట్లాడి సర్వే ప్రక్రియలో ఎదురవుతున్న ఇబ్బందులు, వారి సూచనలను తెలుసుకున్నారు. రైతులకు ఎలాంటి సందేహాలు లేకుండా పారదర్శకంగా సర్వే నిర్వహించాలని, ప్రతి పట్టాదారు భూమికి సరైన హద్దులను గుర్తించాలని సర్వే సిబ్బందికి సూచించారు. భూ రికార్డుల క్రమబద్ధీకరణతో పాటు గ్రామాల్లో భూ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నట్లు ఆర్డీవో తెలిపారు. ఈ పర్యటనలో మద్నూర్ తహసీల్దార్ ఎం.డి. ముజీబ్, మండల గిర్దావర్ మురళీధర్, సర్వేయర్ వెంకట్, ఎండోమెంట్, రెవెన్యూ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# కాంట్రాక్టు ఉద్యోగుల సేవల బహిష్కరణ, కలెక్టరేట్ వద్ద నిరసన



మచిలీపట్నం శ్రీ వార్త న్యూస్:వైద్య, ఆరోగ్యశాఖలో పనిచేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులు డిమాండ్ల సాధన కోసం మంగళవారం నుంచి విధులను బహిష్కరించి నిరసన చేపట్టారు. ఏపీ మెడికల్ అండ్ హెల్త్ కాంట్రాక్ట్ ఎంప్లాయీస్ జాయింట్ యాక్షన్ కమిటీ (ఏపీ ఎంహెచ్‌సీజేఏసీ) ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. సీఐటీయూ జిల్లా కమిటీ సంఘీభావం తెలిపింది.ఈ సందర్భంగా ఏపీ ఎంహెచ్‌సీజేఏసీ చైర్మన్ పులి ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ జిల్లాలో సుమారు 500 మంది కాంట్రాక్టు ఉద్యోగులు సేవలకు దూరం కావడంతో వైద్య సేవలపై ప్రభావం పడే అవకాశం ఉందన్నారు. దీర్ఘకాలంగా సేవలందిస్తున్న అర్హులైన కాంట్రాక్టు ఉద్యోగులను క్రమబద్ధీకరించి, 100 శాతం గ్రాస్ జీతాన్ని పునరుద్ధరించాలని, పారామెడికల్ కేడర్లలో రెగ్యులర్ నియామకాలు చేపట్టాలని డిమాండ్ చేశారు. కన్వీనర్ కే. బాలసుబ్రహ్మణ్యం మాట్లాడుతూ స్టాఫ్ నర్సులు, ల్యాబ్ టెక్నీషియన్లు, ఫార్మసిస్టులు, డయాలసిస్, రేడియాలజీ, ఈసీజీ తదితర విభాగాల సిబ్బంది నిరసనలో పాల్గొన్నారని తెలిపారు.



అత్యవసర సేవలను కొనసాగిస్తూ మిగిలిన సేవలను బహిష్కరిస్తున్నట్లు చెప్పారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి సమస్యలను పరిష్కరించకపోతే నిరసనను కొనసాగిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జీసీఎన్ఏ వైస్ ప్రెసిడెంట్ సౌమ్యరేఖ బోకినాల, జిల్లా జేఏసీ కోఆర్డినేటర్ లోకేష్ కుమార్, సిఐటియు జిల్లా అధ్యక్షులు కె.వెంకటేశ్వరరావు,కార్యదర్శి బూర సుబ్రమణ్యం, మండల కన్వీనర్ సిహెచ్. జయరావు, ఏపీ ఎన్జీఓస్ జిల్లా అధ్యక్షుడు ఆకూరి శ్రీనివాస్‌రావు, వైద్య, ఆరోగ్యశాఖకు చెందిన కాంట్రాక్టు ఉద్యోగులు, సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# నేడు హజ్ సహాయకుల ముఖాముఖి




విజయవాడ, అక్టోబర్ 6, శ్రీ వార్త న్యూస్:హజ్ 2027 కు సంబంధించి ఆంధ్రప్రదేశ్ నుండి తాత్కాలికంగా ఎంపికైన సేవా సహాయకులకు ముఖాముఖి పరీక్షల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తయ్యాయని రాష్ట్ర హజ్ సంఘం అధ్యక్షుడు హాజీ షేక్ హసన్ భాష తెలిపారు.ముంబైలోని భారత హజ్ సంఘం తుది నిర్ణయానికి లోబడి ఈ ఎంపిక ఉంటుందని ఆయన పేర్కొన్నారు.భారత హజ్ సంఘం ఆదేశాల మేరకు ముఖాముఖి పరీక్షలు నేడు(అక్టోబర్ 7) నిర్వహించనున్నారు. ఉదయం 9 గంటలకు హాజరు నమోదు, 9:30 నుండి మధ్యాహ్నం 12:30 గంటల వరకు పత్రాల పరిశీలన, ఉదయం 10:30 నుండి సాయంత్రం వరకు ముఖాముఖి పరీక్షలు జరుగుతాయని తెలిపారు.మంగళగిరి వద్దేశ్వరం గ్రామం ఆర్ ఆర్ నగర్ లోని ప్రధాన కొండ శిఖరం మూడవ అంతస్తులో, రాష్ట్ర పోలీసు ఉన్నతాధికారి కార్యాలయం పక్కన ఉన్న అల్పసంఖ్యాక వర్గాల విద్యాభివృద్ధి కేంద్రంలో ఈ పరీక్షలు జరుగుతాయని వెల్లడించారు. వివరాలకు 08645-297535, 70132 23765, 98857 01859 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.అభ్యర్థులు తమ చదువు, వయసు, ఉద్యోగ వివరాలు, నిర్ణీత ఉద్యోగ నియమాలకు సంబంధించిన పత్రాలు, అవసరమైన చోట యజమాని అనుమతి పత్రం అసలు ప్రతులను తప్పనిసరిగా తీసుకురావాలని కోరారు. పూర్తి వివరాలకు భారత హజ్ సంఘం 15వ ప్రకటనను చూడాలని తెలిపారు.మంగళగిరిలోని హజ్ భవనంలో జరుగుతున్న ఏర్పాట్లను రాష్ట్ర హజ్ సంఘం అధ్యక్షుడు హాజీ షేక్ హసన్ భాష స్వయంగా పర్యవేక్షిస్తున్నారు ఆయన వెంట రాష్ట్ర హజ్ సంఘం కార్యనిర్వహణాధికారి అబ్దుల్ ఖాదర్ మరియు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.




# అత్యంత వైభవంగా దసరా మహోత్సవాలు

- సామాన్య భక్తులకు పెద్దపీట వేస్తూ పటిష్ఠ ఏర్పాట్లులి
- 25 లక్షల మందికిపైగా భక్తులు వస్తారని అంచనాలి
- గౌరవ రాష్ట్రపతి పర్యటన నేపథ్యంలో ప్రత్యేక ఏర్పాట్లు
- వివిధ రాష్ట్రాల ముఖ్యమంత్రులూ వచ్చేందుకు అవకాశంలి
- మూడు క్యూలైన్లలోనూ భక్తులకు ఉచితంగా దర్శన ఏర్పాట్లు
- రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డిలి




విజయవాడ శ్రీ వార్త న్యూస్:ఈ నెల 11 నుంచి 20వ తేదీ వరకు అత్యంత వైభవంగా దసరా మహోత్సవాల నిర్వహణకు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నామని రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి తెలిపారు. ఈ ఏడాది దసరా ఉత్సవాలకు 25 లక్షల మందికిపైగా భక్తులు తరలివచ్చే అవకాశం ఉందని.. అందుకు తగ్గట్లు సౌకర్యాల కల్పనపై దృష్టిపెట్టామని



వెల్లడించారు.మంగళవారం శ్రీ దుర్గామల్లేశ్వర స్వామివార్ల దేవస్థానం సమావేశ మందిరంలో దసరా ఉత్సవాలపై మంత్రి ఆనం రామనారాయణరెడ్డి అధ్యక్షతన మంత్రుల బృందం (జీవోఎం).. అధికారులతో సమావేశమైంది. మంత్రులు సత్యకుమార్ యాదవ్, వంగలపూడి అనిత, కొల్లు రవీంద్రతో పాటు స్థానిక శాసనసభ్యులు యలమంచిలి సుజనా చౌదరి, దేవాదాయ శాఖ కార్యదర్శి కె.కన్నబాబు, కమిషనర్ కె.రామచంద్రమోహన్, జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ, పోలీస్ కమిషనర్ ఎస్వీ రాజశేఖరబాబు, ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ బొర్రా రాధాకృష్ణ, సభ్యులతో పాటు ఈవో వీకే శీనా నాయక్ తదితరులు హాజరైన సమావేశంలో ఉత్సవాలను విజయవంతంగా నిర్వహించేందుకు చేసిన ఏర్పాట్లపై సుదీర్ఘంగా చర్చించారు. సామాన్య భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా, వారి భద్రత, సౌకర్యాలు, సులభ దర్శనానికి అత్యంత ప్రాధాన్యతనిస్తూ అన్ని శాఖల సమన్వయంతో చేసిన ఏర్పాట్లతో పాటు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో చేపట్టిన వినూత్న కార్యాచరణను కలెక్టర్, పోలీస్ కమిషనర్ వివరించారు. భక్తుల రాకపోకలు, దర్శన క్యూలైన్లలో సౌకర్యాలు, పార్కింగ్ ఏర్పాట్లు, వైద్య సేవలు, పారిశుద్ధ్యం, కమాండ్ కంట్రోల్ కేంద్రం తదితర అంశాలపై రూపొందించిన సమగ్ర ప్రణాళికను వివరించారు. ప్రణాళికల విజయవంతానికి ప్రజాప్రతినిధులు, అధికారులు, ధర్మకర్తలమండలి సమన్వయంతో పనిచేయాలని మంత్రి ఆనం రామనారాయణరెడ్డి స్పష్టం చేశారు.సమావేశం అనంతరం మంత్రి ఆనం రామనారాయణరెడ్డి మీడియాతో మాట్లాడారు. సామాన్య భక్తులకు పెద్దపీట వేస్తూ వారికి ఎలాంటి అసౌకర్యం కలగకుండా అత్యంత సంతృప్తికర దర్శనం లభించేలా, తాగునీరు, పారిశుద్ధ్యం, వైద్య సదుపాయాలు, రవాణా తదితర అంశాల్లో పటిష్ఠ ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. భక్తుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన మూడు క్యూలైన్లలోనూ అన్ని రోజులపాటు ఉచిత దర్శనానికి అవకాశం కల్పిస్తున్నట్లు మంత్రి వెల్లడించారు. ఈసారి రైల్వే సహకారంతో ఏడువేల మంది సామర్థ్యంతో మూడో హోల్డింగ్ ఏరియాను కూడా ఏర్పాటు చేశామని.. హోల్డింగ్ ఏరియాల్లో అన్న ప్రసాదాన్ని కూడా పంపిణీ చేయనున్నట్లు వెల్లడించారు. 24 గంటలూ సేవలందించే సమీకృత కమాండ్ కంట్రోల్ కేంద్రం (ఐసీసీసీ)అందుబాటులో ఉంటుందన్నారు. దసరా ఉత్సవాలతో పాటు సరస్ మేళా, విజయవాడ ఉత్సవ్ జరగనున్న నేపథ్యంలో ఎక్కడా ఎలాంటి ఇబ్బందీ లేకుండా ఏర్పాట్లు చేసినట్లు పేర్కొన్నారు. ఈ నెల 14న గౌరవ రాష్ట్రపతి పర్యటన నేపథ్యంలో భద్రత, ఇతర అంశాల పరంగా ప్రత్యేక ఏర్పాట్లు చేపడుతున్నామని, అలాగే వివిధ రాష్ట్రాల ముఖ్యమంత్రులు కూడా దసరా ఉత్సవాలకు వచ్చే అవకాశం ఉన్నందున, వారి పర్యటనలకు అనుగుణంగా ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. గౌరవ ముఖ్యమంత్రి కుటుంబంతో కలిసి మూలా నక్షత్రం రోజున అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పిస్తారని మంత్రి ఆనం రామనారాయణరెడ్డి వెల్లడించారు. ఉత్సవాల నిర్వహణకు సమష్టిగా కృషిచేయనున్నట్లు పేర్కొన్నారు.

# కూటమి పాలనలో నెల్లిమర్లకు అభివృద్ధి జోరు

### 13, 14వ వార్డుల్లో రూ.12.56 లక్షలతో బోర్లకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే లోకం మాధవి

### ప్రజా సమస్యలకు పరిష్కారం.. మౌలిక వసతుల అభివృద్ధే లక్ష్యం

నెల్లిమర్ల నియోజకవర్గం అక్టోబర్ 06స్)నెల్లిమర్ల: ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని, వాటికి



ప్రాధాన్యతా క్రమంలో పరిష్కారాలు చూపించడమే లక్ష్యంగా నెల్లిమర్ల నియోజకవర్గంలో అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు ఎమ్మెల్యే లోకం మాధవి తెలిపారు.నెల్లిమర్ల నగర పంచాయతీ పరిధిలోని 13, 14వ వార్డుల్లో నెలకొన్న తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా రూ.12.56 లక్షల నిధులతో బోర్ల ఏర్పాటుకు శంకుస్థాపన చేశారు.స్థానిక అవసరాలు, పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని బోర్లతో పాటు వాటర్ ట్యాంకులు ఏర్పాటు చేసి, వాటి ద్వారా ప్రజలకు నీటి సరఫరా అందించేలా పనులు చేపట్టనున్నారు. దీంతో తాగునీటి కోసం ఇబ్బందులు పడుతున్న స్థానిక ప్రజలకు ఉపశమనం కలగనుంది.ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను కేవలం తెలుసుకోవడంతోనే కాకుండా, వాటి పరిష్కారానికి అవసరమైన నిధులు సమకూర్చి, పనులు మంజూరు చేయించి క్షేత్రస్థాయిలో అమలు చేసేలా చర్యలు తీసుకుంటున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. ప్రజల నుంచి వచ్చే ప్రతి సమస్యను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి, సాధ్యమైనంత త్వరగా పరిష్కరించేలా సమన్వయంతో పనిచేస్తున్నామని పేర్కొన్నారు.కూటమి ప్రభుత్వం ప్రజల మౌలిక అవసరాలకు ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. తాగునీరు, రహదారులు, డ్రైనేజీ, పారిశుధ్యం తదితర స్థానిక సమస్యల పరిష్కారానికి అవసరమైన చర్యలను ప్రాధాన్యతా క్రమంలో చేపడుతున్నామని అన్నారు.నెల్లిమర్ల నగర పంచాయతీలోని ప్రతి వార్డులో ప్రజలకు అవసరమైన మౌలిక వసతులను గుర్తించి, అందుబాటులో ఉన్న నిధులను సద్వినియోగం చేస్తూ అభివృద్ధి పనులు చేపడతామని ఎమ్మెల్యే లోకం మాధవి తెలిపారు. ప్రజలకు ఇబ్బంది కలిగించే సమస్యలకు శాశ్వత పరిష్కారాలు చూపించడమే తమ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు.తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టడంపై స్థానిక ప్రజలు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో నగర పంచాయతీ అధికారులు, జనసేన నాయకులు, కార్యకర్తలు, వార్డు ప్రతినిధులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# కస్తూర్బా పాఠశాల లో మౌలిక వ సతులు, విద్యార్థుల సౌకర్యాలపై కలెక్టర్ పరిశీలన.

### --దామరగిద్ద కస్తూర్బా పాఠశాల ను ఆకస్మికంగా తనిఖీ చేసిన కలె క్టర్ ప్రియాంక.......

నారాయణపేట జిల్లా ప్రతినిధి 0 ారాయణపేట జిల్లా, దామరగి ద్దమండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాల/ కళా శాలను జిల్లా కలెక్టర్ ప్రియాంక మంగళవారం ఆకస్మికంగా సంద ర్శించారు. పాఠశాల ఆవరణలో నూతనంగా నిర్మిస్తున్న అదనపు గదుల భవనాన్ని పరిశీలించిన ఆమె, నిర్మాణ పనులు తుది ద శలో ఉన్నందున పనులను త్వర గా పూర్తి చేసి విద్యార్థులకు అం దు బాటులోకి తీసుకురావాలని జిల్లా విద్యాశాఖ అధికారి గోవిం దరాజులను ఫోన్ ద్వారా ఆదేశిం చారు.పాఠశాల ఆవరణలో ఫర్ని చర్ నిరుపయోగంగ ఉండటాన్ని గమనించిన కలెక్టర్ సంబంధిత అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. పాత భవనం లో పాఠశాల, కళాశాల తరగతు ల నిర్వహణ లో ఇబ్బందులు ఎ దురవుతున్నాయని ఎస్ ఓ స్వా తి కలెక్టర్ దృష్టికి తీసుకు రాగా, నూతన భవనంలోని కింది అంత స్తులో ఉన్న అదనపు గదులను తరగతుల నిర్వహణకు వినియో గించుకోవాలని సూచించారు. అ నంతరం ఇంటర్మీడియట్ ద్వితీ య సంవత్సరం తరగతి గదిని సందర్శించిన కలెక్టర్ విద్యార్థిను లతో మాట్లాడి వారి విద్యాభ్యా సం, భవిష్యత్ లక్ష్యాలను తెలు సుకున్నారు. ఉన్నత విద్యలో ఏ కోర్సులు చదవాలనుకుంటున్నా రని ప్రశ్నించగా, విద్యార్థినులు న్యాయ విద్యను అభ్యసించాల ని ఉందని తెలిపారు.విద్యార్థిను లు పట్టుదలతో చదివి కనీసం డి గ్రీ వరకు విద్యను కొనసాగించాల ని, ఉన్నత విద్య తో పాటు భవి ష్యత్ లో ప్రభుత్వ ఉద్యోగాలు సాధించేలా కృషి చేయాలని కలె క్టర్ సూచించారు.వొకేషనల్ తర గతి గదిని సందర్శించి విద్యార్థి నులతో మాట్లాడిన కలెక్టర్, వారి భవిష్యత్ విద్యా ప్రణాళికలను అడిగి తెలుసుకున్నారు. బీఎస్సీ నర్సింగ్ చదవాలనుకుంటున్నా మని విద్యార్థినులు తెలపగా, జి ల్లా కేంద్రం లో నర్సింగ్ కళాశాల అందుబాటులోకి రానుందని, వి ద్యార్థినులు కష్టపడి చదివి ఉన్న త స్థాయికి ఎదగాలని సూచించా రు. విద్యార్థులు చదువుతోపాటు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించా లని, పోషకాహారం తీసుకోవాలని తెలిపారు.

# చాందిని గుంజకు భూమి పూజ చేస్తున్న ఆలయ చైర్మన్ సిబ్బంది

## 11వ తేదీ నుండి శ్రీదేవి శరన్నవరాత్రులు ప్రారంభం



అవనిగడ్డ అక్టోబర్ 6 శ్రీవార్త దివిసీమలో పురాతన ప్రసిద్ధ దేవాలయంగా పేరొందిన శ్రీ రాజరాజేశ్వరి సహిత రాజశేఖర్ స్వామి వారి ఆలయంలో ఈనెల 11వ తేదీ ఆదివారం నుండి శ్రీదేవి నవరాత్రులు ప్రారంభిస్తున్నట్లు ఆలయ చైర్మన్ ఘంటసాల రాజమోహన్రావు చెప్పారు. మంగళవారం ఉదయం నవరాత్రుల మహోత్సవాన్ని పురస్కరించుకొని చాందిని గుంజకు భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ పాలకవర్గ సభ్యులు ఏఎంసి వైస్ చైర్మన్ రాజనాల వీరబాబు ఆలయ కార్య నిర్వహణ అధికారి యార్లగడ్డ శ్రీనివాసరావు (వాసు) ఆలయ అర్చకులు ఆలయ సిబ్బంది భక్తులు తదితరులు పాల్గొన్నారు,

# హామీ ఇచ్చా.. ప్రతి గ్రామాన్నీ అభివృద్ధి చేస్తా

### ప్రత్యేక ప్రణాళికతో తాగునీరు, రోడ్లు, డ్రైనేజీలు అభివృద్ధి

### అభివృద్ధిలో రాష్ట్రానికి ఆదర్శంగా బందరుని తీర్చిదిద్దుతా

### మచిలీపట్నం రూరల్ మండలం పర్యటనలో మంత్రి కొల్లు రవీంద్ర



కృష్ణాజిల్లా శ్రీ వార్త న్యూస్:ఓట్లు అడిగినపుడు హామీ ఇచ్చాను. మచిలీపట్నం నియోజకవర్గంలోని ప్రతి గ్రామాన్నీ అభివృద్ధికి కేంద్రంగా మారుస్తానని. ఆ మేరకు వీబీజీ రాం జీ, సాస్కీ, 15వ ఆర్థిక సంఘం నిధులతో చేపట్టిన పనులకు శంకుస్థాపనలు చేశారు. మచిలీపట్నం రూరల్ మండలం పెదపట్నం గ్రామంలో 1వ నెంబర్ బ్రాంచ్ కెనాల్ పైన రూ.12.50 లక్షల వంతెన నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. రూ.36 లక్షల వ్యయంతో నిర్మించిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ప్రారంబించారు. కానూరు గ్రామంలో ఆర్ అండ్ బి రోడ్డు నుండి సారంగపాలెం వరకు రూ.1.56 కోట్ల వ్యయంతో



చేపట్టిన రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. తాళ్లపాలెం గ్రామంలో పెదపట్నం రోడ్డు నుండి జొన్నలవారిమోది వరకు రూ.2.49 కోట్ల వ్యయంతో రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. బొర్రపోతుపాలెం గ్రామంలో ఏలూరు రోడ్డు నుండి బొర్రపోతుపాలెం వరకు రూ.1.04కోట్ల ఎస్ ఎ ఎస్ సీ ఐ నిధులతో చేపట్టిన తారు రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. కరగ్రహారం గ్రామపంచాయతీ పరిధిలోని క్యాంబెల్ పేట నుండి బందరు పోర్టు వరకు రూ.2.73 కోట్ల వ్యయంతో తారు రోడ్డు నిర్మాణ పనులకు శంకస్థాపన చేశారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లో మెరుగైన సదుపాయాల కల్పనకు, ప్రజారోగ్యానికి ప్రభుత్వం చిత్తశుద్ధితో పని చేస్తోందని పేర్కొన్నారు. గత ఐదు సంవత్సరాలు మురికి కాలువల్లో పారతో మట్టి తీసే పరిస్థితి కూడా లేదు. కానీ నేడు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గ్రామీణ ప్రాంతాల్లో రూ.164 కోట్ల వ్యయంతో అభివృద్ధి పనులు చేశాం. రూ.54 కోట్ల ఆర్ అండ్ బి నిధులు, రూ.80 కోట్లఆర్ డబ్లయిస్ నిధులు కలిపి మొత్తంగా రూ.330 కోట్ల పనులు చేశాం. ఇవే రోడ్లు గతంలో కూటమి ప్రభుత్వం అధికారంలో ఉన్నపుడు వేశాం. మళ్లీ ఇప్పుడు మనం అధికారంలోకి వచ్చాక వేస్తున్నాం.ఇంటింటికీ మంచి నీళ్లు ఇవ్వడానికి మనకి 'జల్ జీవన్ మిషన్' ద్వారా రూ.80 కోట్లు ఖర్చు చేసి ప్రతి ఇంటికీ తాగునీటి కనెక్షన్ ఇస్తున్నాం. సంవత్సర కాలంలో ప్రతి ఇంటికీ స్వచ్ఛమైన మంచి నీరు ఇచ్చే బాధ్యత ఈ కూటమి ప్రభుత్వం కూడా తీసుకుంది. ప్రతి గ్రామానికి మౌలిక వసతులు కల్పించాలనేది గౌరవ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గారి ఆలోచన. కేంద్ర ప్రభుత్వం ఇచ్చే 'జీ రామ్‌జీ నిధుల నుండి 50% రాష్ట్ర ప్రభుత్వం 50% ఖర్చు చేస్తున్నాం. తాజాగా రూ. 11 వేల కోట్లతో రాష్ట్ర వ్యాప్తంగా పనులు ప్రారంభించారు. సిమెంట్ రోడ్లన్నీ కూడా అభివృద్ధి చేసుకుంటున్నాం.మరోవైపు సంక్షేమ పథకాలను కూడా పకడ్బందీగా అమలు చేస్తున్నాం. హామీ మేరకు ప్రతి విద్యార్థికి తల్లికి వందనం అందిస్తున్నాం. పెన్షన్లు, ఉచిత గ్యాస్, ఉచిత బస్సు, అన్నదాత సుఖీభవ లాంటి పథకాలన్నీ పకడ్బందీగా అమలు చేస్తున్నాం. వీటికి తోడుగా మత్స్యకారుల సేవలో, ఆటో డ్రైవర్ల సేవలో, చేనేతల సేవలో వంటి పథకాలు అమలు చేస్తున్నాం. మత్స్యకార సేవలో కార్యక్రమం ద్వారా బోటులో ఎంతమంది కళాసీలు ఉంటే అంతమందికి 20 వేల రూపాయల చొప్పున అందిస్తున్నాం.కానూరు గ్రామంలో తల్లికి వందనం పథకం ద్వారా 55 లక్షల 51 వేలు, 29 మంది ఆటో డ్రైవర్లకు, ఫీజు రీయింబర్స్‌మెంట్ కింద 15 లక్షలు అందించాం. 427 పెన్షన్లు ఇస్తున్నాం. ప్రతి నెల పెన్షన్ల రూపంలో ఈ గ్రామంలో 20 లక్షలు అందిస్తున్నాం. 2014 లో నియోజకవర్గంలో 20 వేల పెన్షన్లు ఉన్నాయి, ఇప్పుడు 30 వేల పెన్షన్లు దాటాయి. అప్పుడు ఇచ్చే పెన్షన్ల కోసం రూ.34 లక్షలు ఇస్తే.. ఇప్పుడు ఏకంగా రూ.13 కోట్లు చెల్లిస్తున్నాం. 34 లక్షలు ఎక్కడ, 13 కోట్లు ఎక్కడ. రాష్ట్రం మొత్తం 64 లక్షల మందికి పెన్షన్లు ఇస్తున్నాం. ప్రతి నెలా రూ.2,770 కోట్లు చొప్పున సంవత్సరానికి రూ.35 వేల కోట్లుపెన్షన్ కే ఇస్తున్నాం.

గత ఐదేళ్లు ఇళ్ల నిర్మాణ పథకాన్ని గాలికి వదిలేశారు. కేంద్రం ఇచ్చే రూ.1,80,000 మాత్రమే ఇచ్చారు. కూటమి ప్రభుత్వంలో.?50,000 పెంచి ?2,30,000 ఇస్తున్నాం. గత రెండు సంవత్సరాల్లో రాష్ట్ర వ్యాప్తంగా ఇళ్ల నిర్మాణాలు, వాటి స్థితిగతులన్నీ తెలుసుకున్నాం. త్వరలోనే కొత్తగా ఇళ్లు మంజూరు చేస్తాం. నిన్ననే ముఖ్యమంత్రి గారు త్రీడీ టెక్నాలజీతో ఇళ్ల నిర్మాణాన్ని ప్రారంబించారు. అదే మోడల్లో రాష్ట్ర వ్యాప్తంగా ఇళ్ల నిర్మాణాలు చేపడతాం.దశాబ్దాల పోరాటాల ఫలితంగా బందరు పోర్టు పూర్తవుతోంది. కొత్తగా పరిశ్రమలు కూడా వస్తున్నాయి. రూ.8000 కోట్ల పెట్టుబడితో 'గోవా షిప్‌యార్డ్' సంస్థ బందరు వస్తోంది. 10,000 మందికి ఉద్యోగాలు వస్తాయి. అది పూర్తయితే మన పిల్లలు ఉద్యోగాల కోసం ఎక్కడికో వెళ్లాల్సిన పని లేదు. ఇక్కడే ఉద్యోగాలు వచ్చేలా స్కిల్ నేర్పిస్తాం. రెండు సంవత్సరాల్లో గోవా షిప్ యార్డ్ కంపెనీ నిర్మాణం పూర్తవుతుంది. బందరు నుండి కృత్తివెన్నును కలుపుతూ ఓడపల్లి వరకు ఒక నేషనల్ హైవే కోసం ప్రయత్నం చేస్తున్నాం. అది వస్తే మన ఏరియా అంతా బంగారమవుతుందని మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి గోపు సత్యన్నారాయణ, మార్కెట్ యార్డు చైర్మన్ కుంచె దుర్గాప్రసాద్, రూరల్ పార్టీ అధ్యక్షులు కాగిత వెంకటేశ్వరరావు తదితర కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఫైబర్ అధికంగా లభించే ధాన్యాలు ఇవే.. వీటిని తీసుకుంటే ఎంతో మేలు..



ఆహారంలో ఉండే ఫైబర్ (ణఱవ్ముతీఎ ఖీఱఎతీవ) శరీరానికి ఎంతో అవసరమైన పోషక పదార్థం. పండ్లు, కూరగాయలు, సంపూర్ణ ధాన్యాలు, పప్పుధాన్యాల్లో ఇది సమృద్ధిగా లభిస్తుంది. జీర్ణక్రియ మెరుగుపరచడం, వ్యర్థాల తొలగింపు, రక్తంలో చక్కెర స్థాయిల నియంత్రణ, కొలెస్ట్రాల్ తగ్గించడం, ఎక్కువసేపు తృప్తిగా ఉంచడం వంటి అనేక ప్రయోజనాలు ఫైబర్ వల్ల లభిస్తాయి. అయితే ఫైబర్ ను చాలా మంది తక్కువగా అంచనా వేస్తారని నిపుణులు చెబుతున్నారు. ధాన్యాలను ఫైబర్ పరిమాణం ఆధారంగా ర్యాంక్ చేస్తూ సరైన ఆహార ఎంపికలు చేసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. ఫైబర్ పరంగా ధాన్యాలు ఏయే స్థానాల్లో ఉన్నాయో ఇప్పుడు తెలుసుకుందాం.

## బల్గర్, స్టీల్-కట్ ఓట్స్, పర్ల్ బార్లీ..

ఫైబర్ ఎక్కువగా ఉన్న ఆహారాల్లో మొదటి స్థానంలో బల్గర్ ఉంది. ఇది అధిక ఫైబర్ కలిగిన సంపూర్ణ ధాన్యం. జీర్ణక్రియకు సహాయపడటంతో పాటు, జీర్ణ వ్యవస్థలో మంచి బ్యాక్టీరియాను పెంచుతుంది. తక్కువ క్యాలరీలతో ఎక్కువసేపు తృప్తిగా ఉంచి బరువు నియంత్రణకు దోహదపడుతుంది. సాధారణంగా ఉడికించి తింటారు, అయితే వేయించడం, బేక్ చేయడం లేదా రోస్ట్ చేయడం కూడా చేస్తారు. రెండో స్థానంలో స్టీల్-కట్ ఓట్స్ ఉన్నాయి. వీటిని ఐరిష్ ఓట్స్ అని కూడా అంటారు. ఇవి ఫైబర్, స్టార్చ్ అధికంగా ఉండటంతో బరువు తగ్గేందుకు అనుకూలం. వీటిని వండడానికి 15-20 నిమిషాలు పడుతుంది. పాయసం వంటి వంటకాలకు ఎక్కువగా ఉపయోగిస్తారు. అలాగే మూడో స్థానంలో పర్ల్ బార్లీ ఉంది. ఇది బార్లీ గింజలపై ఉన్న బయటి పొరను తొలగించిన రూపం. సూపులు, స్ట్యూలు, రిసొట్టో వంటి వంటల్లో దీన్ని ఉపయోగిస్తారు. దీని టెక్చర్ మృదువుగా ఉండటంతోపాటు ద్రవాలను గట్టిపరిచే గుణం ఉంది.

## క్వినోవా, వైల్డ్ రైస్, బ్రౌన్ రైస్..

తర్వాత స్థానంలో క్వినోవా ఉంది. ఇది గ్లూటెన్ లేని ప్సూడో-సిరియల్. చాలా ధాన్యాలతో పోలిస్తే దాదాపు రెట్టింపు ఫైబర్ కలిగి ఉంటుంది. జీర్ణక్రియకు మేలు చేయడంతోపాటు, పూర్తి ప్రోటీన్‌గా పనిచేసి ఆకలి నియంత్రణ, రక్త చక్కెర నియంత్రణలో సహాయపడుతుంది. ఆ తరువాత స్థానంలో వైల్డ్ రైస్ ఉంది. ఇది వాస్తవానికి ఒక గడ్డి విత్తనం. సాధారణ తెల్ల బియ్యంతో పోలిస్తే అధిక ఫైబర్, ప్రోటీన్ కలిగి ఉండటంతో పోషకంగా మెరుగైన ఎంపికగా పరిగణిస్తారు. బ్రౌన్ రైస్ కూడా మంచి ఫైబర్ ఉన్న సంపూర్ణ ధాన్యం. ఇది బరువు నియంత్రణ, గుండె ఆరోగ్యం, రక్త చక్కెర నియంత్రణకు సహాయపడుతుంది. పొట్ట చుట్టూ కొవ్వు పేరుకుపోవడం తగ్గించడంలో కూడా ఇది ఉపయోగపడుతుంది. అలాగే పారా బాయిల్డ్ రైస్ అనేది ప్రాసెసింగ్‌కు ముందు గింజను కొంతవరకు మరిగించడం ద్వారా తయారు చేసే బియ్యం. ఈ ప్రక్రియ వల్ల దాని పోషక విలువలు కొంత మెరుగవుతాయి.

## వైట్ రైస్..

ఇక అన్నింటికంటే చివరగా వైట్ రైస్ ఉంది. జాస్మిన్, బాస్మతి వంటి తెల్ల బియ్యాలు ఫైబర్ పరంగా తక్కువగా ఉంటాయని నిపుణులు చెబుతున్నారు. ఫైబర్ తీసుకునే పరిమాణాన్ని ఒక్కసారిగా పెంచకుండా క్రమంగా పెంచాలని నిపుణులు సూచిస్తున్నారు. ప్రతి వారం సుమారు 5 గ్రాముల చొప్పున పెంచడం, తగినంత నీరు తాగడం, భోజనం తరువాత తేలికపాటి శారీరక కదలికలు చేయడం అవసరమని చెప్పారు. ఫైబర్ కేవలం జీర్ణక్రియకే కాదు, మొత్తం మెటబాలిజం ఆరోగ్యానికి మద్దతు ఇస్తుందని నిపుణులు స్పష్టం చేస్తున్నారు.

# కోవిడ్ నుంచి కోలుకున్న వారిలో పెరుగుతున్న లంగ్ క్యాన్సర్ కేసులు.. అప్రమత్తంగా ఉండాలని నిపుణుల సూచన..



కోవిడ్-19 దీర్ఘకాలిక ప్రభావాల గురించి ఇప్పటికే అనేక అధ్యయనాలు వెలుగులోకి వచ్చాయి. తీవ్ర అలసట, బ్రెయిన్ ఫాగ్, శ్వాసకోశ సమస్యలు, గుండె సంబంధిత ఇబ్బందులు వంటి సమస్యలు దీని తరువాత కనిపిస్తున్నాయి. తాజాగా జరిగిన ఒక అధ్యయనం ప్రకారం, తీవ్రమైన కోవిడ్-19 లేదా ఇన్‌ఫ్లుయెంజా వంటి వైరల్ ఇన్ఫెక్షన్లు భవిష్యత్తులో ఊపిరితిత్తుల క్యాన్సర్ ప్రమాదాన్ని పెంచే అవకాశం ఉందని శాస్త్రవేత్తలు గుర్తించారు. ఈ పరిశోధనను యూనివర్సిటీ ఆఫ్ వర్జీనియా హెల్త్ సిస్టమ్ శాస్త్రవేత్తలు నిర్వహించి, సెల్ అనే జర్నల్‌లో ప్రచురించారు. ఈ అధ్యయనంలో భాగంగా శాస్త్రవేత్తలు ఒక ముఖ్యమైన విషయాన్ని గుర్తించారు. తీవ్రమైన వైరల్ ఇన్ఫెక్షన్లు శరీరంలోని ఇమ్యూన్ కణాలను రీప్రోగ్రామ్ చేస్తాయి. దీని వల్ల ఊపిరితిత్తుల్లో దీర్ఘకాలిక వాపు ఏర్పడి, ట్యూమర్ పెరుగుదలకు అనుకూల వాతావరణం ఏర్పడుతుంది. ఈ పరిస్థితి సంవత్సరాల పాటు కొనసాగవచ్చని పరిశోధకులు వెల్లడించారు.

## ఊపిరితిత్తుల్లో వాపు..

కోవిడ్ లేదా ఫ్లూ తీవ్రంగా వచ్చిన వారికి తరువాత కాలంలో ఊపిరితిత్తుల్లో వాపు కొనసాగుతుందని నిపుణులు చెబుతున్నారు. ఈ పరిస్థితి భవిష్యత్తులో క్యాన్సర్ వచ్చేందుకు దారి తీస్తుందని పేర్కొన్నారు. అయితే టీకాలు తీసుకోవడం వల్ల ఈ ప్రమాదాన్ని గణనీయంగా తగ్గించవచ్చని నిపుణులు స్పష్టం చేశారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ (ఔనూ) ప్రకారం ఊపిరితిత్తుల క్యాన్సర్ ప్రపంచవ్యాప్తంగా క్యాన్సర్ మరణాల్లో అగ్రస్థానంలో ఉంది. పురుషులు, మహిళలు ఇద్దరిలోనూ ఇది అధిక మరణాలకు కారణమవుతోంది. ఎక్కువ సందర్భాల్లో ఈ వ్యాధి ఆలస్య దశల్లో గుర్తించబడటం వల్ల చికిత్స అవకాశాలు పరిమితం అవుతున్నాయి. అయితే ప్రమాదంలో ఉన్న వ్యక్తులను ముందుగానే స్క్రీనింగ్ చేయడం ద్వారా జీవనావకాశాలను మెరుగుపరచవచ్చని ఔనూ సూచిస్తోంది. ఈ అధ్యయనంలో భాగంగా చేసిన ప్రయోగాల్లో తీవ్రమైన ఊపిరితిత్తుల ఇన్ఫెక్షన్ల నుంచి కోలుకున్న జంతువుల్లో క్యాన్సర్ కేసులు గణనీయంగా పెరిగినట్లు కనిపించింది. అలాగే మనుషులపై సేకరించిన డేటాలో కూడా ఆసుపత్రిలో చికిత్స పొందిన కోవిడ్ రోగుల్లో ఊపిరితిత్తుల క్యాన్సర్ నిర్ధారణ 1.24 రెట్లు ఎక్కువగా ఉన్నట్లు తేలింది. అయితే స్వల్ప ఇన్ఫెక్షన్లు ఈ ప్రమాదాన్ని పెంచలేదని పరిశోధకులు వెల్లడించారు.

## మారుతున్న ఊపిరితిత్తుల కణజాలం..

మరో కీలక అంశంగా తీవ్రమైన వైరల్ న్యుమోనియా ఊపిరితిత్తుల కణజాలాన్ని మారుస్తుందని శాస్త్రవేత్తలు గుర్తించారు. ఇది ప్రో-ట్యూమర్ వాతావరణాన్ని సృష్టించి ట్యూమర్ పెరుగుదలను వేగవంతం చేస్తుంది. ఈ మార్పులు నెలలు లేదా సంవత్సరాల పాటు కొనసాగవచ్చని అధ్యయనం సూచిస్తోంది. ఇప్పటి వరకు పొగ తాగడం వంటి కారణాలు మాత్రమే ఊపిరితిత్తుల క్యాన్సర్‌కు ప్రమాదంగా భావించారు. అయితే ఈ తాజా ఫలితాల ప్రకారం తీవ్రమైన శ్వాసకోశ వైరల్ ఇన్ఫెక్షన్లను కూడా అదే విధంగా పరిగణించాల్సిన అవసరం ఉందని నిపుణులు వెల్లడించారు. భవిష్యత్తులో ఇలాంటి రోగులకు సిటి స్కాన్ల ద్వారా క్రమం తప్పకుండా పర్యవేక్షణ అవసరం కావచ్చని నిపుణులు సూచించారు.

## టీకాలతో తగ్గుతున్న ప్రమాదం..

జీవశాస్త్ర పరంగా పరిశీలిస్తే తీవ్రమైన ఇన్ఫెక్షన్ల తర్వాత న్యూట్రోఫిల్స్, మాక్రోఫేజ్‌లు వంటి ఇమ్యూన్ కణాలు అసాధారణ స్థితిలోకి మారుతున్నాయి. ఇవి క్యాన్సర్‌ను నిరోధించే శక్తిని తగ్గించి వాపును పెంచుతాయి. అలాగే ఊపిరితిత్తుల కణజాలం కూడా మార్పులకు లోనై, మ్యూటేషన్లకు అనుకూల పరిస్థితులు ఏర్పడతాయి. ఇదిలా ఉంటే టీకాలు ఈ ప్రమాదాన్ని తగ్గించడంలో కీలక పాత్ర పోషిస్తున్నాయని అధ్యయనం వెల్లడించింది. ముందుగా వ్యాక్సిన్ తీసుకున్నవారిలో తీవ్రమైన ఇన్ఫెక్షన్లు తగ్గడంతోపాటు ఊపిరితిత్తుల్లో జరిగే హానికర మార్పులు కూడా తగ్గినట్లు గుర్తించారు. తీవ్రమైన కోవిడ్-19 లేదా ఇతర వైరల్ న్యూమోనియా నుంచి కోలుకున్నవారు తమ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలి. ముఖ్యంగా పొగ తాగే అలవాటు ఉన్నవారు లేదా ఇతర ప్రమాద కారకాలు ఉన్నవారు వైద్యుల పర్యవేక్షణలో క్రమం తప్పకుండా పరీక్షలు చేయించుకోవడం అవసరం. టీకాలు తీసుకోవడం ద్వారా కేవలం తక్షణ రక్షణ మాత్రమే కాకుండా, దీర్ఘకాలిక ఆరోగ్య ప్రమాదాలను కూడా తగ్గించుకోవచ్చని నిపుణులు సూచిస్తున్నారు.

# జీర్ణ వ్యవస్థను ఆరోగ్యంగా ఉంచే పానీయాలు ఇవి.. ఎలా తయారు చేయాలంటే..?



ఆహార జీర్ణక్రియలో కీలక పాత్ర పోషించే జీర్ణాశయం లేదా గ్యాస్ట్రోఇంటెస్టినల్ (+×) ట్రాక్ట్ ప్రధానంగా ఆహారాన్ని జీర్ణం చేయడం, పోషకాలను శోషించడం, వ్యర్థాలను బయటకు పంపించడం వంటి పనులు నిర్వహిస్తుంది. అయితే దీని పాత్ర కేవలం జీర్ణక్రియకు మాత్రమే పరిమితం కాదు. నిపుణుల అభిప్రాయం ప్రకారం జీర్ణ వ్యవస్థ ఆరోగ్యం రోగనిరోధక శక్తి, మెటబాలిజం, మానసిక ఆరోగ్యంపై కూడా గణనీయమైన ప్రభావం చూపిస్తుంది. జీర్ణ వ్యవస్థలో లక్షల కోట్ల సూక్ష్మజీవులు నివసిస్తాయి, వీటిని కలిపి గట్ మైక్రోబియోమ్ అని పిలుస్తారు. వీటినే మంచి బ్యాక్టీరియా అని కూడా అంటారు. ఈ సూక్ష్మజీవులు ఆహారాన్ని విచ్ఛిన్నం చేయడంలో సహాయపడటమే కాకుండా, శరీరానికి రక్షణ వ్యవస్థగా కూడా పనిచేస్తాయి. అందుకే జీర్ణ వ్యవస్థ ఆరోగ్యం దెబ్బ తింటే, వ్యక్తి మొత్తం ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం చూపిస్తుంది.

## జీర్ణక్రియ వల్లనే రావు..

అయితే పోషకాహార నిపుణులు తెలిపిన ప్రకారం అనేక జీర్ణ వ్యవస్థ సమస్యలు కేవలం జీర్ణక్రియ కారణంగానే రావాల్సిన అవసరం లేదు. చాలా జీర్ణ వ్యవస్థ లక్షణాలు కేవలం తప్పు జీర్ణక్రియ వల్ల మాత్రమే రావు అని నిపుణులు చెబుతున్నారు. హైడ్రేషన్, మ్యూకోసల్ రక్షణ, కొన్ని ఫైటోకెమికల్స్ వంటి అంశాలు కూడా కీలక పాత్ర పోషిస్తాయి. ఈ అంశాలు ఆంత్రం గోడ సమగ్రతను, జీర్ణ వ్యవస్థ పనితీరును మెరుగుపరచడంలో సహాయపడతాయి. ఆంత్రం గోడను బలపరచడం, జీర్ణ వ్యవస్థ పనితీరును మెరుగుపరచడం కోసం ఆ వ్యవస్థకు మద్దతు ఇచ్చే గుణాలు కలిగిన పదార్థాలతో తయారయ్యే రెండు ఫంక్షనల్ డ్రింక్స్ రెసిపీలు ఇలా ఉన్నాయి.

## కలబంద, కొబ్బరి నీళ్ల పానీయం..

మొదటి పానీయం విషయానికి వస్తే.. అలో-కోకోనట్ గట్ సూతింగ్ డ్రింక్ గా దీన్ని చెప్పవచ్చు. దీనికి 200 మిల్లీలీటర్ల కొబ్బరి నీరు, 2 టేబుల్ స్పూన్ల తాజా అలోవెరా జెల్, 5-6 తాజా పుదీనా ఆకులు తీసుకోవాలి. ఈ పదార్థాలను 10 నుంచి 15 సెకన్ల పాటు బ్లెండ్ చేసి తాజాగా ఉన్నప్పుడే తాగాలి. అలోవెరాలో ఉండే ఆసెమానన్ వంటి పాలిశాకరైడ్లు ఆంత్రం మ్యూకోసల్ సమగ్రతను కాపాడడంలో సహాయపడతాయి. అలాగే దానిలో యాంటీ-ఇన్‌ఫ్లమేటరీ లక్షణాలు ఉంటాయి. అదనంగా కొబ్బరి నీరు ఎలక్ట్రోలైట్స్, తగిన హైడ్రేషన్‌ను అందిస్తాయి. ఇవి సాధారణ గ్యాస్ట్రోఇంటెస్టినల్ పనితీరుకు ముఖ్యం. మరోవైపు పుదీనా ఆకుల్లో ఉండే మెంథాల్ గ్యాస్ట్రోఇంటెస్టినల్ స్మూత్ మజిల్స్‌ను సడలించడంలో సహాయపడుతుంది.

## అతి మధురం, సోంపు గింజల టీ..

రెండవ పానీయంగా లికోరైస్-ఫెన్నెల్ గట్ సపోర్ట్ టీ ని చెప్పవచ్చు. దీనికి ఒక కప్పు నీరు, పావు టీ స్పూన్ లికోరైస్ రూట్ పొడి (అతి మధురం), అర టీ స్పూన్ సోంపు గింజలు, అర టీ స్పూన్ తురిమిన అల్లం తీసుకోవాలి. ఈ పదార్థాలను 5 నుంచి 7 నిమిషాల పాటు మరిగించి వడకట్టి గోరువెచ్చగా తాగాలి. లికోరైస్ రూట్‌లో గ్లైసిరిజిన్, ఫ్లేవనాయిడ్లు ఉండి ఇవి గ్యాస్ట్రిక్, ఆంత్రం మ్యూకోసల్ రక్షణకు సహాయపడతాయి. అదనంగా సోంపు గింజల్లో ఉండే అనెథోల్ ఆంత్రం కండరాల సంకోచాలను తగ్గించి గ్యాస్ ఏర్పడటాన్ని తగ్గించడంలో సహాయపడుతుంది. అలాగే,అల్లంలో ఉండే జింజరాల్స్ గ్యాస్ట్రిక్ మొటిలిటీని మెరుగుపరచడంలో, జీర్ణక్రియను సౌకర్యవంతంగా మార్చడంలో సహాయపడతాయి. ఈ రెండు పానీయాలను సులభంగా తయారు చేసుకోవచ్చు. జీర్ణ వ్యవస్థ ఆరోగ్యాన్ని మెరుగుపరచడానికి ఈ పానీయాలు ఎంతో మేలు చేస్తాయని వైద్య నిపుణులు చెబుతున్నారు

# మొలకలను మీరు ఎలా తింటున్నారు..? నేరుగా తినకూడదు, ఎందుకంటే..?

మొలకలు (స్ప్రౌట్స్) ఆరోగ్యకరమైన ఆహారంగా చాలా కాలంగా మంచి పేరు సంపాదించుకున్నాయి. సలాడ్లు, చాట్స్, బ్రేక్‌ఫాస్ట్ బౌల్స్‌లో వీటిని ఎక్కువగా ఉపయోగిస్తారు. ఎక్కువగా ముడిగా తింటేనే ఆరోగ్యానికి మంచిదని చాలా మంది భావిస్తారు. బరువు తగ్గేందుకు, క్లీన్ ఈటింగ్ డైట్‌లో కూడా స్ప్రౌట్స్‌ను విస్తృతంగా సూచిస్తారు. అయితే ఆహారం ఎంత ముఖ్యమో దాన్ని ఎలా తీసుకుంటామన్నది కూడా అంతే ముఖ్యమని నిపుణులు చెబుతున్నారు. స్ప్రౌట్స్ పోషకాలను కలిగి ఉన్నప్పటికీ, ప్రతిరోజూ ముడిగా తినడం మంచిది కాకపోవచ్చునని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ముడి మొలకలు తినడంలో ఒక ముఖ్యమైన సమస్య బ్యాక్టీరియా ప్రమాదం. మొలకలు వేడి, తేమ ఉన్న వాతావరణంలో పెరుగుతాయి. ఇదే పరిస్థితులు ఈ.కోలి, సాల్మొనెల్లా వంటి హానికర బ్యాక్టీరియా పెరగడానికి అనుకూలంగా ఉంటాయి. భారతీయ వంటకాలు

## ప్రోటీన్‌కు ప్రధాన వనరు కాదు..

మొలకలు తయారీ సమయంలో కలుషితం అయితే ఈ బ్యాక్టీరియా వేగంగా పెరిగే అవకాశం ఉంటుంది. కేవలం నీటితో కడగడం వల్ల ఇవి పూర్తిగా తొలగిపోవని నిపుణులు హెచ్చరిస్తున్నారు. అందుకే మొలకలను తేలికగా ఆవిరి పట్టించడం లేదా వేయించడం ద్వారా తినడం సురక్షితమైన మార్గంగా భావిస్తున్నారు. స్ప్రౌట్స్‌ను ప్రోటీన్ అధికంగా ఉండే ఆహారంగా చాలా మంది భావిస్తారు. అయితే ఇది పూర్తిగా నిజం కాదని కూడా నిపుణులు చెబుతున్నారు. 100 గ్రాముల స్ప్రౌట్స్‌లో కేవలం 3-4 గ్రాముల ప్రోటీన్ మాత్రమే ఉంటుంది. ఇది ఇతర ప్రోటీన్ వనరులతో పోలిస్తే తక్కువ. అందువల్ల స్ప్రౌట్స్‌ను ప్రధాన ప్రోటీన్ వనరుగా కాకుండా, ఉపాహారంగా మాత్రమే తీసుకోవడం మంచిది. సరైన ప్రోటీన్ కోసం పప్పులు, పనీర్, గుడ్లు, టోఫు, శనగలు వంటి ఆహారాలను తీసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. ఆరోగ్యకరమైన ఆహారం

## సున్నితమైన జీర్ణ వ్యవస్థ ఉంటే..

అంతేకాకుండా ముడి మొలకలు జీర్ణక్రియపై కూడా ప్రభావం చూపవచ్చు. వీటిలో అధికంగా ఫైబర్, ఫెర్మెంటబుల్ కార్బోహైడ్రేట్లు ఉండటం వల్ల కొందరికి జీర్ణ సమస్యలు రావచ్చు. ముఖ్యంగా సున్నితమైన జీర్ణ వ్యవస్థ ఉన్నవారికి లేదా ×దీూ వంటి సమస్యలు ఉన్నవారికి ఉబ్బరం, గ్యాస్, కడుపు నొప్పి వంటి సమస్యలు తలెత్తే అవకాశం ఉంది. కనుక మొలకలను తేలికగా వండి తీసుకోవడం వల్ల సులభంగా జీర్ణమవుతాయి.

## ఎలా తినాలి..?

మొలకలను నిల్వ చేయడం కూడా చాలా ముఖ్యమైన విషయం.



ఫ్రిజ్‌లో ఉంచడం వల్ల బ్యాక్టీరియా పెరుగుదల కొంత వరకు తగ్గుతుంది, కానీ పూర్తిగా ఆగదు. అందుకే మొలకలను ఫ్రిజ్‌లో ఉంచి 24 నుంచి 48 గంటల్లోపే ఉపయోగించడం మంచిది. ఎక్కువ రోజుల పాటు నిల్వ ఉంచితే అవి చెడిపోయే ప్రమాదం ఉంటుంది. స్ప్రౌట్స్ పోషకాలు ఉన్న ఆహారం అయినప్పటికీ, వాటిని ఎలా తింటామన్నది చాలా ముఖ్యం. ముడిగా కాకుండా తేలికగా వండి తినడం, సరైన విధంగా నిల్వ చేయడం ద్వారా వాటి ప్రయోజనాలను సురక్షితంగా పొందవచ్చని పోషకాహార నిపుణులు తెలియజేస్తున్నారు.

# మెదడుకు అసలైన విశ్రాంతి ఇవ్వడం అంటే ఏంటి.. ఏం చేయాలి..?

ఇప్పటి వేగవంతమైన జీవనశైలిలో చాలామంది మానసికంగా అలసిపోయాం అని చెబుతుంటారు. అయితే ఈ అనుభూతి నిజమైన అలసట కాకపోవచ్చు. ఎక్కువ సందర్భాల్లో అది జ్ఞానాత్మక ఒత్తిడి (కాగ్నిటివ్ ఓవర్లోడ్) అయి ఉండవచ్చు. ఉదయం లేవగానే మెదడు సమాచారం ప్రాసెస్ చేయడం ప్రారంభిస్తుంది. నోటిఫికేషన్లు, మెసేజ్‌లు, సంభాషణలు, పనుల గడువులు, చుట్టూ ఉండే శబ్దం, డిజిటల్ కంటెంట్ వంటివన్నీ దృష్టిని ఆకర్షిస్తాయి. శారీరక అలసటలా ఇది స్పష్టంగా కనిపించదు. మెదడు ఇప్పటికే తీసుకున్న సమాచారాన్ని ప్రాసెస్ చేయకముందే మరిన్ని ఇన్‌పుట్‌లను స్వీకరిస్తూనే ఉంటుంది. ఈ నిరంతర ఉద్దీపన ప్రభావం కాలక్రమేణా బయటపడుతుంది. దృష్టి లోపించడం, నిర్ణయాలు తీసుకోవడంలో ఆలస్యం, చిరాకు, సృజనాత్మకత తగ్గడం వంటి లక్షణాలు కనిపిస్తాయి. చాలా మంది దీనిని మెంటల్ డ్రెయిన్ గా భావించినా, అసలు కారణం మెదడుపై అధిక సమాచారం భారం పడటమే.

## నిరంతరం పనిచేయదు..

మనిషి మెదడు నిరంతరం పని చేయడానికి రూపొందించబడలేదు. శరీర కండరాలకు విశ్రాంతి అవసరమైనట్లే, మెదడుకూ విరామం అవసరం. ఈ విరామాలు సమాచారాన్ని సరిచేయడానికి, భావోద్వేగాలను నియంత్రించడానికి, ఆలోచనలను క్రమబద్ధం చేయడానికి సహాయపడతాయి. అయితే చాలామంది



సోషల్ మీడియా స్క్రోలింగ్ లేదా టీవీ చూడడాన్ని విశ్రాంతిగా భావిస్తారు. కానీ ఇవి కూడా మెదడును ఉద్దీపన చేస్తాయి. చిత్రాలు, శబ్దాలు, సమాచారం వంటివి మెదడును పనిచేయించే కారణంగా, ఇది నిజమైన విశ్రాంతి కాదని నిపుణులు చెబుతున్నారు.

## ఏం చేయాలి..

మెదడుకు నిజమైన విశ్రాంతి ఇవ్వాలంటే ఉద్దేశపూర్వకంగా నిశ్శబ్ద సమయాన్ని కేటాయించాలి. నిశ్శబ్దంగా కూర్చోవడం, శ్వాసపై దృష్టి పెట్టడం, ధ్యానం చేయడం, ప్రకృతిలో గడపడం, లేదా ఎలాంటి అంతరాయం లేకుండా ఆలోచనలను స్వేచ్ఛగా ప్రవహించనివ్వడం వంటి చర్యలు మెదడును రీసెట్ చేయడంలో సహాయపడతాయి. అదేవిధంగా నాణ్యమైన నిద్ర కూడా మానసిక శక్తిని పునరుద్ధరించడంలో కీలక పాత్ర పోషిస్తుంది. మెదడుకు సరైన విశ్రాంతి లేకుండా నిరంతరం పని చేయిస్తే శరీరం స్ట్రెస్ హార్మోన్లను విడుదల చేస్తూనే ఉంటుంది. దీని వల్ల నర వ్యవస్థ ఎప్పుడూ అప్రమత్త స్థితిలో ఉంటుంది. ఈ ఒత్తిడి తక్కువగా అనిపించినా, దీర్ఘకాలంలో మానసిక, శారీరక ఆరోగ్యంపై ప్రభావం చూపుతుంది. ఇలాంటి పరిస్థితుల్లో చిరాకు, మతిమరుపు, భావోద్వేగ అలసట వంటి సమస్యలు పెరుగుతాయి. మరోవైపు సమయానుకూలంగా విరామాలు తీసుకుంటే దృష్టి పెరుగుతుంది, భావోద్వేగ స్థిరత్వం మెరుగుపడుతుంది, సవాళ్లను సమర్థంగా ఎదుర్కోగల సామర్థ్యం పెరుగుతుంది.

## అలా చేయడం సోమరితనం కాదు..

ఎప్పుడూ బిజీగా ఉండడాన్ని గొప్పగా భావించే సమాజంలో కొంతసేపు ఆగడం చాలా మందికి అసౌకర్యంగా అనిపిస్తుంది. విశ్రాంతి తీసుకుంటే పనితీరు తగ్గుతుందని భావిస్తారు. కానీ నిజానికి ఇది తప్పు అభిప్రాయమని నిపుణులు చెబుతున్నారు. లోతైన విశ్రాంతి సోమరితనం కాదు, అది మెదడుకు అవసరమైన మద్దతు. శారీరక శ్రమ తర్వాత కండరాలు ఎలా పునరుద్ధరించబడతాయో, అలాగే మెదడుకూ విశ్రాంతి అవసరం. సరైన విశ్రాంతి తీసుకున్నప్పుడు, మనుషులు మరింత ఉత్సాహంతో, స్పష్టమైన ఆలోచనలతో, మెరుగైన పనితీరుతో తిరిగి పనిలోకి ప్రవేశిస్తారని నిపుణులు సూచిస్తున్నారు.

# ప్రోటీన్లను అధికంగా తీసుకుంటే కిడ్నీలకు నష్టమే.. ఏం జరుగుతుందంటే..?



ప్రోటీన్ శరీర నిర్మాణానికి అత్యంత అవసరమైన పోషక పదార్థం. ఇది కండరాల పెరుగుదల, కణజాలాల పునరుద్ధరణ, అలాగే శరీరంలోని అనేక కీలక విధులను సక్రమంగా నిర్వహించడంలో ముఖ్య పాత్ర పోషిస్తుంది. ఇటీవలి కాలంలో బరువు తగ్గడం, కండరాలను పెంచుకోవడం లేదా ఫిట్‌నెస్ లక్ష్యాల కోసం హై-ప్రోటీన్ డైట్‌లు విస్తృతంగా ప్రాచుర్యం పొందాయి. అయితే, అవసరానికి మించి ప్రోటీన్‌ను దీర్ఘకాలం తీసుకోవడం వల్ల కిడ్నీలపై ఒత్తిడిని పెంచే ప్రమాదం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. కిడ్నీలు రక్తాన్ని శుద్ధి చేసి వ్యర్థాలను బయటకు పంపే ముఖ్య అవయవాలు. శరీరం ప్రోటీన్‌ను విభజించే సమయంలో నైట్రోజన్, యూరియా, క్రియాటినిన్ వంటి వ్యర్థ పదార్థాలు ఉత్పత్తి అవుతాయి. ఈ పదార్థాలను తొలగించేందుకు కిడ్నీలు ఎక్కువగా పనిచేయాల్సి వస్తుంది. ప్రోటీన్ తీసుకునే పరిమాణం పెరిగితే కిడ్నీలపై పడే పని కూడా పెరుగుతుంది. ఆరోగ్యవంతమైన కిడ్నీలు కొంతవరకు దీనిని తట్టుకోగలిగినా, దీర్ఘకాలంలో అధిక ప్రోటీన్ వినియోగం కిడ్నీ నష్టం కలిగించే అవకాశం ఉంది.

## దీర్ఘకాలిక కిడ్నీ వ్యాధి వచ్చే అవకాశం..

ఇప్పటికే కిడ్నీ సంబంధిత సమస్యలు ఉన్నవారికి హై-ప్రోటీన్ ఆహారం మరింత ప్రమాదకరం. ఎక్కువ ప్రోటీన్ తీసుకోవడం వల్ల కిడ్నీలు శుద్ధి చేయాల్సిన వ్యర్థాలు పెరుగుతాయి. ఇది కిడ్నీ పనితీరును మరింత దెబ్బతీసే అవకాశం ఉంటుంది. అందుకే దీర్ఘకాలిక కిడ్నీ వ్యాధి (జఖణ) ఉన్నవారికి వైద్యులు సాధారణంగా మితమైన ప్రోటీన్ తీసుకోవాలని సూచిస్తారు. ప్రస్తుతం ప్రోటీన్ పౌడర్లు, సప్లిమెంట్ల వాడకం పెరిగింది. ముఖ్యంగా బాడీ బిల్డింగ్ చేసే వారు వీటిని అధికంగా తీసుకునే సందర్భాలు కనిపిస్తున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో ప్రోటీన్ అధికంగా తీసుకోవడం వల్ల కిడ్నీ పనితీరు తగ్గిపోవడం, మూత్రంలో ప్రోటీన్ వెలువడటం (ప్రోటీన్యూరియా) వంటి సమస్యలు తలెత్తవచ్చు. అదనంగా డీహైడ్రేషన్, కిడ్నీ రాళ్లు, ఎలక్ట్రోలైట్ అసమతుల్యత వంటి సమస్యలు కూడా వచ్చే ప్రమాదం ఉంది.

## వైద్యుల సలహా అవసరం..

కనుక హై-ప్రోటీన్ డైట్ విషయంలో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలి. ముఖ్యంగా కిడ్నీ వ్యాధిగ్రస్తులు, మధుమేహం లేదా అధిక రక్తపోటు ఉన్నవారు, వృద్ధులు, అలాగే ప్రోటీన్ సప్లిమెంట్లు వాడేవారు తప్పనిసరిగా వైద్యుల సలహా తీసుకోవాలి. ప్రోటీన్ శరీరానికి అవసరమైనప్పటికీ, దాన్ని సమతుల్యంగా తీసుకోవడం అత్యంత ముఖ్యం. వ్యక్తి బరువు, జీవనశైలి, శారీరక శ్రమను బట్టి రోజువారీ ప్రోటీన్ అవసరం మారుతుంది. కూరగాయలు, పండ్లు, ధాన్యాలు, మంచి కొవ్వులు వంటి ఇతర పోషకాలతో కూడిన సమతుల ఆహారం తీసుకోవడం ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చు. కిడ్నీ ఆరోగ్యాన్ని కాపాడేందుకు పరీక్షలు చేయించుకోవడం కూడా అవసరం. ముఖ్యంగా క్రియాటినిన్, వ+ఖీ=, మూత్ర పరీక్షలు చేయించుకోవడం ద్వారా కిడ్నీ పనితీరును అంచనా వేయవచ్చు. హై-ప్రోటీన్ డైట్ తీసుకునే వారు ఈ పరీక్షలను తప్పనిసరిగా చేయించుకోవడం మంచిది. మొత్తానికి ప్రోటీన్ అవసరం ఉన్నప్పటికీ అధికంగా తీసుకోవడం కిడ్నీలకు హానికరం కావచ్చని వైద్యులు సూచిస్తున్నారు.

## బారికేడ్లు ఎక్కిన రాహుల్ గాంధీ



న్యూఢిల్లీ: ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) ప్రక్రియపై ఎన్నికల సంఘాన్ని ప్రశ్నిస్తూ ప్రతిపక్ష ఇండి కూటమి ఎంపీలు చేపట్టిన నిరసనలో మంగళవారం తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ పార్లమెంట్ నుంచి ఎన్నికల సంఘం కార్యాలయం వైపు ర్యాలీగా వెళ్లిన లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ సహా పలువురు ఎంపీలను పోలీసులు అడ్డుకున్నారు. పార్లమెంట్ నుంచి ప్రారంభమైన ర్యాలీలో కాంగ్రెస్ ఎంపీ ప్రియాంక గాంధీ వాద్రా, ఎన్సీపీ-ఎస్పీ ఎంపీ సుప్రియా సూలే సహా పలువురు ప్రతిపక్ష నేతలు పాల్గొన్నారు. ఎంపీలు చేతుల్లో జ్ఞానేశ్ కుమార్ చిత్రాలతో కూడిన ప్లకార్డులు పట్టుకుని నినాదాలు చేశారు. "ఓటు దొంగలారా.. పదవి వదిలేయండి" అంటూ నినాదాలు చేశారు. నితి ఆయోగ్ కార్యాలయం సమీపంలో భారీ ఇనుప బారికేడ్లను ఏర్పాటు చేసి పోలీసులు ర్యాలీని అడ్డుకున్నారు.

### బారికేడ్‌పైకి ఎక్కి త్రివర్ణ పతాకాన్ని ఊపి..

ఈ సమయంలో రాహుల్ గాంధీ బారికేడ్‌పైకి ఎక్కి త్రివర్ణ పతాకాన్ని ఊపారు. అనంతరం తృణమూల్ కాంగ్రెస్ ఎంపీ అభిషేక్ బెనర్జీ కూడా పోలీసులు ఏర్పాటు చేసిన బారికేడ్లపైకి ఎక్కారు. పోలీసులు ప్రియాంక గాంధీని నిర్బంధించేందుకు బస్సులోకి తీసుకెళ్లగా, ఆమె కొద్దిసేపటికే బస్సు నుంచి దిగి రాహుల్ గాంధీతో కలిసి ఆకాశవాణి భవన్ గేటు వద్దకు చేరుకున్నారు. రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ, కాంగ్రెస్ ఎంపీ దీపేందర్ హుడా మరికొందరితో కలిసి ఆకాశవాణి భవన్ స్వాగత ద్వారం నుంచి ప్రాంగణంలోకి ప్రవేశించారు. అనంతరం వారు అక్కడ చెట్టు కింద కూర్చున్నారు. మరోవైపు ప్రియాంక గాంధీ, కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ సహా పలువురు ప్రతిపక్ష నేతలను ఢిల్లీ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఎస్ఐఆర్ ప్రక్రియలో అక్రమాలు జరిగాయని ఆరోపిస్తూ జ్ఞానేశ్ కుమార్‌ను తొలగించాలని ప్రతిపక్షాలు డిమాండ్ చేస్తున్నాయి. ఎస్ఐఆర్‌లో తొలగించిన ఓటర్ల పేర్లను తిరిగి చేర్చాలని, ప్రక్రియను రద్దు చేయాలని కూడా కోరుతున్నాయి. ఫారమ్-6లో మార్పులపై సుప్రీంకోర్టు చేసిన వ్యాఖ్యలు ఈ రాజకీయ వివాదాన్ని మరింత తీవ్రం చేశాయి. ఎన్నికల సంఘం మాత్రం ఎస్ఐఆర్‌కు సంబంధించిన నిర్ణయాలు ఏకగ్రీవంగానే తీసుకున్నామని చెబుతోంది. రాహుల్ గాంధీ ఈ సందర్భంగా మాట్లాడుతూ.. "నరేంద్ర మోదీ, అమిత్ షా, మోహన్ భగవత్ 'ఓటు చోరీ' ద్వారా దేశాన్ని హైజాక్ చేశారు. జ్ఞానేశ్ కుమార్ వారికి సహకరించారు. ఇది దేశద్రోహం. ఎవరూ తప్పించుకోలేరు. సుమారు 300 మంది ఎంపీలు ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్, మరో ఇద్దరు ఎన్నికల కమిషనర్లను కలవాలనుకున్నారు. కానీ, పోలీసులు మమ్మల్ని ఇక్కడే ఆపేశారు. మేము ఎన్నికైన ప్రజా ప్రతినిధులం. అయినా మమ్మల్ని ఎందుకు ఆపారో తెలియడం లేదు. ఎన్నికల కమిషన్ కేవలం 50 మీటర్ల దూరంలో ఉండగా ఏమైందో అర్థం కావడం లేదు. దేశంలో ఏమి జరుగుతోంది? ఎన్నికల కమిషన్ ఎన్నికైన ప్రజా ప్రతినిధులను కలవకపోతే ప్రజాస్వామ్యం అంటే ఏమిటి?" అని అన్నారు.

## గణేశుడు చెడు పనులకు సాయం చేయడు: జయా బచ్చన్



న్యూఢిల్లీ: సీఈసీ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలంటూ మంగళవారం విపక్షాల ఆందోళన కొనసాగుతోంది. ఢిల్లీలో ఇండియా కూటమి ఎంపీలు పార్లమెంట్ మకర ద్వారం నుంచి ఎన్నికల సంఘం కార్యాలయం వరకు నిరసన మార్చ్ చేపట్టారు. అయితే పోలీసుల బ్యారికేడ్ల కారణంగా మార్చ్ నీతి ఆయోగ్ కార్యాలయం వద్ద నిలిచిపోయింది. దీంతో రాహుల్ గాంధీ సహా పలువురు విపక్ష నేతలు రోడ్డుపైనే బైఠాయించారు. అనంతరం రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ, అఖిలేశ్ యాదవ్ తదితరులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ నిరసనపై బీజేపీ చేసిన విమర్శలకు సమాజ్‌వాదీ పార్టీ ఎంపీ జయా బచ్చన్ స్పందించారు. బీజేపీ అధికారంలో ఉన్నందున ఆరోపణలు చేయడం ఆ పార్టీ పని అని అన్నారు. తాము తమ పని చేసుకుంటున్నామని, పార్టీ నాయకత్వం ఏ ఆదేశాలు ఇస్తే వాటిని అనుసరిస్తామని చెప్పారు. బీజేపీపై వ్యాఖ్యల సందర్భంగా జయా బచ్చన్ గణేశుడిని ప్రస్తావించారు. 'గణేశ్‌జీ చెడు విషయాలకు సాయం చేయరు' అని అన్నారు. తాము ఏదైనా శుభకార్యాన్ని ప్రారంభించే ముందు గణేశుడిని ప్రార్థిస్తామని చెప్పారు. తమ కార్యక్రమాన్ని కూడా ఆయన ఆశీస్సులతో ప్రారంభించామని, ఆయనే తమను చూసుకుంటారని పేర్కొన్నారు. ఎన్నికల ప్రక్రియలో అవకతవకలు జరిగాయంటూ ఆరోపిస్తూ విపక్షాలు సీఈసీ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తున్నాయి. ఈ అంశంపై ఇండియా కూటమి ఎంపీలు నిరసనలు చేపడుతున్నారు. మంగళవారం చేపట్టిన మార్చ్‌లోనూ ఇదే ప్రధాన డిమాండ్‌గా నిలిచింది. జ్ఞానేశ్ కుమార్ రాజీనామా డిమాండ్ తప్ప మరో మార్గం లేదా అని ప్రశ్నించగా జయా బచ్చన్ నేరుగా సమాధానం ఇవ్వలేదు. ఈ అంశంపై తాను ఏమీ చెప్పదలుచుకోలేదని తెలిపారు. తమ పార్టీ నాయకత్వం ఏ నిర్ణయం తీసుకుంటే దానినే తాము అనుసరిస్తామని స్పష్టం చేశారు. సీఈసీకి వ్యతిరేకంగా విపక్షాల నిరసన నేపథ్యంలో అధికార, ప్రతిపక్షాల మధ్య రాజకీయ విమర్శలు మరింత పెరిగాయి. ఇండియా కూటమి ఎంపీల మార్చ్‌ను పోలీసులు అడ్డుకోవడం, అనంతరం పలువురు నేతలను అదుపులోకి తీసుకోవడంతో ఢిల్లీలో రాజకీయ ఉద్రిక్తత నెలకొంది. ఈ క్రమంలో జయా బచ్చన్ చేసిన గణేశుడి వ్యాఖ్యలు రాజకీయంగా చర్చనీయాంశంగా మారాయి.

## ఏఐ వీడియోతో పోలీసులపై నిందలు.. యూట్యూబర్ అరెస్ట్



న్యూఢిల్లీ: ఢిల్లీ పోలీసులపై సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారానికి కారణమైన ఓ ఫేక్ వీడియో వ్యవహారం వెలుగులోకి వచ్చింది. మహిళా నిరసనకారులను యూనిఫాంలో ఉన్న పోలీసు అధికారి అనుచితంగా తాకుతున్నట్లు కనిపించే వీడియోను ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) సాయంతో రూపొందించి సోషల్ మీడియాలో ప్రచారం చేసినట్లు పోలీసులు గుర్తించారు. ఈ కేసులో హర్యానాలోని పల్వాల్‌కు చెందిన 24 ఏళ్ల నదీమ్ అహ్మద్‌ను అరెస్టు చేసినట్లు ఢిల్లీ పోలీసులు తెలిపారు. ఢిల్లీ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నదీమ్ అహ్మద్ తనను తాను 'స్వతంత్ర జర్నలిస్టు'గా పేర్కొంటూ 'న్యూస్ ఐనా' పేరుతో యూట్యూబ్ ఛానల్ నిర్వహిస్తున్నాడు. పోలీసుల ప్రతిష్ఠను దెబ్బతీసే ఉద్దేశంతో ఏఐ టూల్స్ ఉపయోగించి వీడియోను రూపొందించినట్లు దర్యాప్తులో వెల్లడైందని అధికారులు తెలిపారు. ఈ వీడియోను ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్ వంటి సామాజిక మాధ్యమాల్లో రీల్స్ రూపంలో ప్రచారం చేసినట్లు పేర్కొన్నారు. జంతర్‌మంతర్ వద్ద మహిళా నిరసనకారులతో పోలీసులు అనుచితంగా ప్రవర్తించినట్లు చూపించే కొన్ని వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న విషయాన్ని అక్టోబర్ 3న గుర్తించినట్లు అదనపు డీసీపీ మన్‌జీత్ తెలిపారు. అవి సీసీటీవీ దృశ్యాలుగా ప్రచారం అవుతున్నాయని, అయితే పరిశీలనలో అవి నిజమైనవి కావని గుర్తించినట్లు చెప్పారు. వీడియోలను ఏఐ ద్వారా రూపొందించినట్లు దర్యాప్తులో తేలిందని వెల్లడించారు. వైరల్ అవుతున్న వీడియోపై ఢిల్లీ పోలీసుల సోషల్ మీడియా యూనిట్ దృష్టి సారించింది. యూనిఫాంలో ఉన్న పోలీసు సిబ్బంది మహిళతో అనుచితంగా ప్రవర్తిస్తున్నట్లు చూపించిన వీడియోకు సంబంధించిన ఛానల్‌ను పరిశీలించగా నదీమ్ అహ్మద్ గురించి సమాచారం లభించిందని అధికారులు తెలిపారు. అనంతరం అతడిని అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టినట్లు వెల్లడించారు. వీడియోను తయారు చేయడం వెనుక పోలీసులపై ప్రజల్లో, ముఖ్యంగా నిరసనకారుల్లో వ్యతిరేక భావన పెంచే ఉద్దేశం ఉందని పోలీసులు ఆరోపిస్తున్నారు. తన వద్ద అనేక ఏఐ టూల్స్ ఉన్నాయని నదీమ్ విచారణలో చెప్పినట్లు అదనపు డీసీపీ మన్‌జీత్ పేర్కొన్నారు. అయితే ఈ ఆరోపణలకు సంబంధించిన పూర్తి వివరాలు దర్యాప్తులోనే తేలాల్సి ఉంది. నదీమ్ అహ్మద్‌ను అరెస్టు చేసిన పోలీసులు అతడి కార్యకలాపాలకు సంబంధించిన నిధుల మూలాన్ని కూడా పరిశీలిస్తున్నారు. అతడికి మరెవరైనా ఆర్థిక సహాయం చేశారా? వీడియో తయారీ, ప్రచారంలో ఇతరులు ఉన్నారా? అనే అంశాలపై దర్యాప్తు కొనసాగుతున్నట్లు అధికారులు తెలిపారు.

## నాన్న తోడుగా... నాన్న కోసం...

### ఆర్చర్ చికిత ప్రస్థానం స్ఫూర్తిదాయకం
### ఆసియా క్రీడల్లో రెండు స్వర్ణాలతో సంచలనం
### పక్కా ప్రణాళికతో మంచి ఫలితాలు



'మా అమ్మాయి ఆటలోకి అడుగు పెట్టినప్పుడు ఆమె ఎంత వరకు ముందుకు వెళుతుందో, ఎలాంటి ఫలితాలు సాధిస్తుందో అని భయపడలేదు. అసలు ఆర్చరీ గురించి అవగాహనే లేని నాకు వైఫల్యాల గురించి ఆలోచనే రాలేదు. నాకు తెలిసిందల్లా ఆమె ఆర్చరీని ఇష్టపడింది. దానికి తగినట్లుగా కష్టపడేందుకు సిద్ధంగా ఉంది. నేను ఎలా సహకరించగలననే విషయంపై మాత్రమే ఒక తండ్రిగా దృష్టి పెట్టాను'... ఆసియా క్రీడల్లో రెండు స్వర్ణ పతకాలు సాధించి సంచలనం సృష్టించిన తెలంగాణ ఆర్చర్ తానిపర్తి చికిత తండ్రి శ్రీనివాస రావు మనసులో మాట ఇది. ఆర్చరీలో తొలి అడుగు వేయడం మొదలు ఏషియాడ్‌లో స్వర్ణాల వరకు అన్నింటా చికితకు తండ్రి అండగా ఉన్నాడు. ఈ క్రమంలో వచ్చిన అడ్డంకులు, ఆర్థిక అవరోధాలు అన్నింటినీ వారు అధిగమించారు. కాంపౌండ్ ఈవెంట్‌లో తక్కువ వ్యవధిలో వరుస విజయాలు సాధించి ఒక్కసారిగా తన స్థాయిని పెంచుకున్న చికిత, ఆమె తండ్రి వారి ప్రయాణాన్ని 'సాక్షి' క్రీడా ప్రతినిధితో ప్రత్యేకంగా పంచుకున్నారు.

హైదరాబాద్: కరాటే సర్టిఫికెట్‌కు పెద్దగా విలువ లేదు, ఆటల్లో గుర్తింపు రావాలంటే మరో క్రీడను ఎంచుకోవాల్సిందే... చికిత తండ్రితో అక్కడి పీఈటీ మాస్టర్ ఈ మాట చెప్పినప్పుడు ఆశ్చర్యపోవడం ఆయన వంతైంది. ఎంతో ఇష్టంతో నేర్చుకున్న కరాటేలో బ్లాక్‌బెల్ట్ వచ్చిన తర్వాత అది పనికిరాదంటే ఇలాంటి స్పందన సహజమే. దాంతో మరొకరి సూచనతో బ్యాడ్మింటన్ గురించి చర్చ జరిగింది. కానీ అప్పటికే ఈ ఆట కూడా ఖరీదైనదిగా మారిపోయింది. పెద్దపల్లి జిల్లా ఎలిగేడు మండలం సుల్తాన్‌పూర్ నుంచి కనీస శిక్షణకు హైదరాబాద్‌కు రావడంతో పాటు ఇతర ఖర్చుల గురించి ఆలోచించాల్సిన పరిస్థితి. 'ఎప్పుడో చాలా ఏళ్ల క్రితం నేను స్థానికంగా వాలీబాల్ ఆడా. ఆపై అన్ని క్రీడా వార్తలు, వాటి ఫలితాలపై ఆసక్తిగా చూసేవాడిని. ఆ రకంగా నాకున్న అవగాహన మేరకు ఏదైనా సరే టీమ్ గేమ్ కాకుండా వ్యక్తిగత క్రీడను ఆడించాలని మాత్రం గట్టిగా నిర్ణయించుకున్నాను. అలాంటప్పుడు జరిగిన చర్చ తర్వాత ఆర్చరీ వైపు అడుగు పడ్డాయి' అని శ్రీనివాస రావు అన్నారు. ప్రాథమికాంశాలు తెలుసుకున్న తర్వాత స్థానికంగా కొని తెచ్చిన విల్లుతో చికిత ఆట మొదలైంది. 'ఆ సమయంలో కాంపౌండ్, రికర్వ్‌లాంటి పదాలు కూడా నాకు తెలీదు. స్కోరింగ్, పాయింట్ల గురించి కూడా అవగాహన లేదు. ఎదురుగా లక్ష్యం ఉంటుంది. దానిని ఎంత బాగా ఛేదించాలి, ఎంత పర్‌ఫెక్ట్‌గా బాణం తగలాలి అన్నది ఒక్కటే నాకు తెలుసు. నేను చేసిన పని కూడా అదే' అని చికిత చెప్పింది. సొంతంగానే గంటలకొద్దీ సాధన చేస్తూ శ్రమించిన చికిత బాణం నిజంగానే గురి తప్పలేదు. స్కూల్ గేమ్స్‌లో అసలు పోటీ అన్నదే లేకుండా తక్కువ వ్యవధిలో వరుస విజయాలు సాధించింది.

### అదే అసలు మలుపు...

ఆటలో ఒక అంకం పూర్తయింది. కానీ ఇంకా ముందుకు వెళ్లాలంటే ఎలా! నాన్న మదిని తొలచిన ప్రశ్న ఇది. ఈసారి కాస్త సీరియస్‌గా ఆయన కూతురి కెరీర్‌పై దృష్టి పెట్టాడు. 'రాష్ట్ర అసోసియేషన్‌లు నిర్వహించే టోర?నల ద్వారా సరైన గుర్తింపు లభిస్తుందని కొందరు సన్నిహితులు చెప్పారు. దాంతో రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్ నుంచి సీనియర్ వరకు అన్ని టోర?నల్లో ఆడటం మొదలైంది. ఫలితాలు కూడా వస్తుండటంతో ధైర్యం పెరిగింది. ఈ టోర్నీలలో ఆడే క్రమంలో మరింత మెరుగైన ఎక్విప్‌మెంట్‌ను ఎంచుకునే క్రమంలో జరిగిన ఒక సంభాషణ చికితకు మేలు చేసింది' అని శ్రీనివాస రావు గుర్తు చేసుకున్నారు. ఆన్‌లైన్‌లో 'మై చాయిస్ ఆర్చరీ' పేరుతో ఆర్చర్ ఎక్విప్‌మెంట్ స్టోర్ ఉంది. ప్రముఖ అంతర్జాతీయ ఆర్చర్, అర్జున అవార్డీ అభిషేక్ వర్మ భార్య సొనాలీ వర్మ దానిని నిర్వహిస్తుంది. 'కెరీర్‌పై స్పష్టత వచ్చిన తర్వాత కాంపౌండ్ ఈవెంట్‌ను పూర్తి స్థాయిలో ఎంచుకున్నాను. నా ఎక్విప్‌మెంట్ గురించి అడిగే క్రమంలో నా ఆట, పెర్ఫార్మెన్స్ గురించి కూడా సొనాలీకి వివరించా. ముందుగా ఆమె పట్టించుకోలేదు. కానీ నాలుగైదుసార్లు నేనే వెంటపడి సరైన మార్గనిర్దేశనం కోసం అడిగా. చివరకు ఆమె అభిషేక్‌కు చెబుతానని, ఢిల్లీకి రమ్మని ఒప్పుకుంది. అక్కడే నా కెరీర్ మారింది. నాకు అభిషేక్ రూపంలో మంచి కోచ్ దొరికారు' అని చికిత వెల్లడించింది. ఢిల్లీలోని యమున స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో వారం రోజుల పాటు తన ఆట గురించి ట్రయల్స్ ఇచ్చిన తర్వాత అభిషేక్‌కు ఆమెపై నమ్మకం పెరిగింది. కోచ్‌గా ఒక యువ క్రీడాకారిణిని తీర్చిదిద్దేందుకు సిద్ధమయ్యాడు. అయితే అక్కడే శిక్షణ తీసుకునే ఆర్థిక స్థాయి లేకపోవడంతో అది వారానికే పరిమితమైంది. తండ్రితో పాటు తిరిగి సొంతూరుకు వచ్చిన చికిత మళ్లీ తన ఆటను కొనసాగించింది. ఇంతలో కోవిడ్ రావడం, అన్ని ఆగిపోవడంతో ప్రాక్టీస్ మాత్రమే చికిత రోజూవారీ కార్యక్రమంగా మారిపోయింది. వీడియో కాల్, ఆడియో మెసేజ్‌ల ద్వారా అభిషేక్ తగిన సలహాలు, సూచనలు ఇస్తుండటంతో చికిత ఆర్చరీ మరింత మెరుగైంది.

### 'సాయ్' శిక్షణలో చేరికతో...

ఈ ఆసియా క్రీడలకు కొన్నాళ్ల ముందునుంచి చికిత నిలకడగా విజయాలు సాధిస్తూ తనకంటూ గుర్తింపు తెచ్చుకుంది. కానీ కోవిడ్ రోజులనుంచి రెండేళ్ల క్రితం వరకు ఈ తండ్రీ కూతుళ్ల ప్రయాణం అంత సులువుగా సాగలేదు. ఎక్విప్‌మెంట్ మాత్రమే కాకుండా డైట్,ప్రయాణాలు, ఇతర ఖర్చులు సమస్యగా మారాయి. రైతు అయిన శ్రీనివాస రావు తన శక్తిమేర ఖర్చు చేశారు. మధ్యలో కొందరు స్వల్ప మొత్తాలతో సహకరించారు. 'మరోవైపు నేను ఆమెకు లక్ష్యాలను నిర్దేశించాను. కాంపౌండ్‌లో రాష్ట్ర, జాతీయ అత్యుత్తమ రికార్డుల గురించి తెలుసుకుంటూ దానికంటే మెరుగైన స్కోరింగ్ లక్ష్యంగా పెట్టుకునేలా చికితను ప్రోత్సహించాను' అని ఆయన చెప్పారు. సీనియర్ నేషనల్స్‌లో రాణించడంతో చికిత గురించి అందరికీ తెలిసింది. ఆపై సోనేపట్‌లోని స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (సాయ్) సెంటర్ లో సీటు కోసం నిర్వహించిన సెలక్షన్స్‌లో ఆమె ఎంపికైంది. 'నా కెరీర్ కోసం సరైన చోటికి చేరుకున్నానని అర్థమైంది. దాదాపు పదేళ్ల నాన్న కష్టాన్ని అసలైన ఫలితాల రూపంలో చూపించేందుకు ఇక్కడ అవకాశం లభించింది. ఇప్పుడు వచ్చిన మెడల్స్‌తో నాన్నపై భారం దిగినట్లుగా అనిపించింది' చికిత ఉద్వేగంగా చెప్పింది. కూతురి ప్రస్థానాన్ని నడిపించిన నాన్న ఇప్పుడు కొడుకు యశ్వంత్‌నూ ఆర్చర్‌గా తీర్చిదిద్దేందుకు సిద్ధమవుతున్నాడు. ఇప్పటికే జూనియర్ నేషనల్స్ ఆడిన అతను ప్రొఫెషనల్ కోచింగ్ తీసుకుంటున్నాడు.

## బెట్టుచేయొద్దు సర్!



'అయ్యవారు ఏం చేస్తున్నారంటే... చేసిన తప్పులు దిద్దుకుంటున్నార'ని నానుడి. ఇప్పుడు ఎన్నికల సంఘం(ఈసీ) వాలకం అలాగే ఉంది. ఓటర్ల జాబితాల్లో చాటుమాటుగా, ఏకపక్షంగా తీసివేతలు, కూడికలు చేసిన వైనం బట్టబయలయ్యాక నిరసనలు వేయినాల్కలు చాచి దహిస్తుంటే ఈసీకి కాళ్లూ చేతులూ ఆడటం లేదు. అందుకే కావొచ్చు... స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్(సర్) పేరిట ఇంతవరకూ ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ పూర్తయిన 20 రాష్ట్రాలూ, కేంద్రపాలిత ప్రాంతాల్లో 'మినహాయించిన' ఓటర్లను తిరిగి చేర్చుకోవటానికి 'ప్రత్యేక చొరవ' మొదలెట్టాలని ఆయా ప్రాంతాల ప్రధాన ఎన్నికల అధికారులకు(సీఈఓ) గుట్టుచప్పుడు కాకుండా ఆదేశాలిచ్చింది. ఈ 'ప్రత్యేక చొరవ' కోసం ఫామ్--6ను ఉపయోగించాలని కోరింది. నిజానికిది సాంకేతికంగా చెల్లదు. తొలిసారి ఓటర్ల కోసం నిర్దేశించిన ఫామ్‌ను తొలగించిన ఓటర్లకు ఎలా వినియోగిస్తారు? వారిని చేర్చదల్చుకుంటే అందుకు మరో నిబంధనేమైనా ఉందేమో అన్వేషించాలి. లేదా 'సర్'కు ముందున్న ఓటర్ల జాబితాను యథాతథంగా ఆమోదించాలి. మరో ఆసక్తికరమైన విషయమేమంటే... 2002నాటి 'సర్'లో ఉన్న తండ్రి/తల్లి/ తాత వగైరాలతో అనుసంధానం అయితేనే ఓటు ఉంటుందన్న ఫామ్--6 సవరణకు పూర్తిగా స్వస్తి చెప్పారు. అంతేకాదు... ఇంటింటికీ వెళ్లి ఓట్లను విచారణ చేసుకుంటారట. ఎంత వినయం! ఎంత రాజ్యాంగ విధేయత!! ఇదంతా ఇన్నేళ్లుగా ఎటు పోయినట్టు? 'చూస్తూ ఊరుకుంటే మేస్తూ పోయింద'న్నట్టు ఈసీ సాగించిన ఈ తెరచాటు వ్యవహారాలు తెలియక 13 కోట్లకుపైగా జనం మౌనంగా ఈతిబాధలు అనుభవిస్తుంటే ఈసీ దాన్ని చేతగానితనంగా తీసుకుంది. అసలు ఈసీ రాజ్యాంగాతీత శక్తి కాదనీ, నిబంధనలు బేఖాతరుచేసి దానికదే ఏ నిర్ణయమూ తీసుకోవటం అసాధ్యమని నిపుణులు చెబుతున్నారు. ఫామ్--6 సవరణపై తాజాగా సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ చేసిన వ్యాఖ్యానం దిగ్భ్రాంతిలో పడేసింది. ఆ మార్పును సర్వోన్నత న్యాయస్థానం అంగీకరించిందంటూ ఈసీ చెప్పడాన్ని ప్రస్తావించి, తాము ఏ సవరణకూ ఆమోదం తెలపలేదని ఒక కేసు విచారణ సందర్భంగా జస్టిస్ సూర్యకాంత్ వివరణనిచ్చారు. ఇదే వ్యవహారంపై ఆ ముందురోజే సుప్రీంకోర్టు ప్రస్తుత న్యాయమూర్తి ఉజ్జల్ భూయాన్ వ్యాఖ్యానిస్తూ 'ఓటు హక్కు పౌరసత్వానికి అసలైన ప్రాణం. దాన్ని తొలగించటం రాజ్యాంగద్రోహం' అనటం గమనించదగింది. ఇవి చాలు...ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్‌కుమార్ తక్షణం నిష్క్రమించడానికి! ఆ పదవిలో ఉండే నైతిక హక్కు ఆయన కోల్పోయారు. గాంధీ జయంతినుంచి ఢిల్లీ, ముంబైవంటి నగరాల్లో జ్ఞానేశ్ తప్పుకోవాలంటూ యువత రోడ్లపైకొస్తున్నారు. పోలీసులు రోజూ యాతన పడుతున్నారు. ఆడ, మగ తేడా పాటించకుండా పోలీసు వ్యాన్లలోకి ఈడ్చుకెడుతున్నారు. ఒక మహిళా జర్నలిస్టుపట్ల ఏసీపీ స్థాయి వ్యక్తి అసభ్యంగా ప్రవర్తించిన వైనం వీడియో సాక్షిగా బయటికొచ్చింది. తప్పు మీద తప్పు చేస్తూ కోట్లాదిమంది ఓటుకు ఎగనామం పెట్టిన పెద్దమనిషి మాత్రం తనను కానట్టు వ్యవహరిస్తున్నారు. నేరం బయటపడ్డాక స్వచ్ఛందంగా తప్పుకోవాల్సింది పోయి, యువఘోష మిన్నంటుతున్నా బధిరాంధత్వం సంప్రాప్తించినట్టు ఆయన ఉండటం మన ప్రజాస్వామ్య వ్యవస్థకే సిగ్గుచేటు. 'సర్' ప్రక్రియలో ఓట్ల తొలగింపు అక్రమాలేమిటో ఇప్పుడు కర్ణాటక, తెలంగాణల్లో బయటపడిన వ్యవహారాలు చెబుతున్నాయి. ఫలానా ఓటు తొలగించమని దరఖాస్తులు అందిందే తడవుగా అడ్డగోలుగా తీసేశారని వెల్లడైంది. దేశవ్యాప్తంగా ప్రస్తుతం 'సర్' ప్రక్రియలో చోటుచేసుకున్న చట్టవిరుద్ధతలు, వాటి పర్యవసానాలపై ఆందోళన సాగుతోంది. మరి 2024నాటి ఎన్నికలనుంచీ చోటుచేసుకున్న అక్రమాల మాటేమిటి? చట్టం ఆసరావున్నా మిగతా ఇద్దరు కమిషనర్లూ ఎందుకు అడ్డుకోలేకపోయారు? ఆంధ్రప్రదేశ్ వరకూ తీసుకుంటే అప్పట్లో 3,500 పైగా పోలింగ్ కేంద్రాల్లో అర్ధరాత్రి దాటాక లక్షలమంది ఎలా ఓట్లెలావేశారు? ఆ ప్రక్రియకు సంబంధించిన వీవీప్యాట్‌లూ, సీసీటీవీ ఫుటేజ్‌లూ నిబంధనల్ని కాదని ముందే ఎందుకు తొలగించారు? ఎవరి ఆదేశాల పర్యవసానమిది? ఇవన్నీ తేలాలిప్పుడు. దానికి ముందు, బెట్టుచేయటానికి ఇక స్వస్తిపలికి జ్ఞానేశ్ తక్షణం వైదొలగాలి.

## స్విస్‌తో 'పంచ' తంత్రం

### ఐదు కీలక రంగాల్లో ఒప్పందాలు కుదుర్చుకున్న భారత్, స్విట్జర్లాండ్
### సమున్నత స్థాయికి ద్వైపాక్షిక సంబంధాలు
### స్విట్జర్లాండ్ అధ్యక్షుడు పార్మెలిన్‌తో ప్రధాని మోదీ భేటీ



న్యూఢిల్లీ: స్విట్జర్లాండ్‌తో వాణిజ్య సంబంధాలను మరింత బలోపేతం చేసుకోవడమే లక్ష్యంగా భారత్ ఐదు కీలక ఒప్పందాలను కుదుర్చుకుంది. తద్వారా ఇరుదేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధాలను సమున్నత స్థాయికి తీసుకెళ్లేందుకు కృషిచేస్తున్నట్లు ప్రధాని మోదీ ప్రకటించారు. మూడ్రోజుల పర్యటనలో భాగంగా భారత్‌కు విచ్చేసిన స్విట్జర్లాండ్ అధ్యక్షుడు గై పార్మెలిన్ సోమవారం ఢిల్లీలోని హైదరాబాద్ హౌస్‌లో ప్రధాని మోదీతో ద్వైపాక్షిక చర్చలు జరిపారు. వాణిజ్యం మొదలు పెట్టుబడుల దాకా పలు అంశాలపై విస్తృతస్థాయిలో చర్చలు జరిపి ఐదు కీలక ఒప్పందాలపై సంతకాలుచేశారు. సమానత్వ సూత్రాలను గౌరవిస్తూ వలసలు, రాకపోకల్లో సహకారాన్ని మరింత పెంపొందించుకోవడం కోసం ఒప్పందం చేసుకున్నారు. అక్రమ వలసలు, మానవుల శ్రమ దోపిడీ, అక్రమ రవాణాను అడ్డుకునేందుకు ఈ ఒప్పందం కుదుర్చుకున్నారు. ఈ మొబిలిటీ, మైగ్రేషన్ ఒప్పందంలోభాగంగా పర్యటించినప్పుడల్లా గరిష్టంగా ఆరు నెలలు సందర్శనకాలం ఉండేలా ఐదేళ్లపాటు పలు మార్లు అనుమతించే మల్టీపుల్ ఎంట్రీ వీసాలను అందజేయనున్నారు. ఇరు దేశాల యువ నిపుణులు తమ రంగాల్లో తాత్కాలిక ఉపాధిని పొందుతూ వృత్తిపరమైన, భాషా నైపుణ్యాలను పెంపొందించుకునేందుకు అవకాశం కల్పిస్తూ యంగ్ ప్రొఫెషనల్స్ ఎక్చ?ేంజ్ ఒప్పందం కుదుర్చుకున్నారు. ఈ ఒప్పదం ప్రకారం ఇరుదేశాలు ఏటా 300 మంది నిపుణుల పరస్పర పర్యటనలకు అవకాశం కల్పిస్తారు. రవాణా, ఎలక్ట్రిక్ వాహనాలు, పునరుత్పాదక ఆర్థిక వ్యవస్థ తదితర రంగాల్లో సాంకేతికతలను, మౌలిక వసతుల పరస్పర సహకారం, ప్రోత్సాహం కోసం మరో ఒప్పందం చేసుకున్నారు. భారత్, స్విట్జర్లాండ్ పరిశోధనా రంగాల్లో దీర్ఘకాలిక సహకారం, శాస్త్రీయ పరిశోధనల్లో పరస్పర ప్రోత్సాహం లక్ష్యంగా మరో ఒప్పందం చేసుకున్నారు. కృత్రిమమేధ ఆవిష్కరణలు, సాంకేతిక పరిజ్ఞాన బదిలీ అంశాల్లో ద్వైపాక్షిక సహకారం మరింత పెంపొందటం కోసం మరో ఒప్పందం కుదుర్చుకున్నారు. ఈ సందర్భంగా సంయుక్త మీడియా సమావేశంలో ప్రధాని మోదీ మాట్లాడారు.

### భారతీయ ఉత్పత్తులకు స్విస్‌లో సింహద్వారం

"భారతీయ ఎగుమతులకు స్విస్ విపణిలో మరింత అవకాశాలు మెరుగుపరిచేందుకు తగు చర్యలు తీసుకుంటున్నాం. రెండు దేశాల మధ్య ఉమ్మడి పెట్టుబడుల వరద పారనుంది. యూరప్‌లో భారత్‌కు స్విట్జర్లాండ్ ప్రధాన భాగస్వామి. ఇంజనీరింగ్, సేవలు, కీలక పరికరాలు, రసాయనాలు, ఫార్మ ఇలా కీలక రంగాల్లో 330కిపైగా స్విస్ కంపెనీలు ఇప్పుడు భారత్‌లో క్రియాశీలకంగా పనిచేస్తున్నాయి. అటు స్విస్‌లోనూ భారత ఐటీ, ఫార్మా, మెషినరీల కంపెనీలు విస్తరిస్తున్నాయి"అని మోదీ చెప్పారు. యూరోపియన్ స్వేచ్ఛా వాణిజ్య సంఘం(ఈఎఫ్‌టీఏ)లో భాగస్వాములైన ఐస్‌ల్యాండ్, లీచెస్టెన్, నార్వే, స్విస్ మధ్య వాణిజ్య, ఆర్థిక భాగస్వామ్య ఒప్పందం(టీఈపీఏ) ఈ నెల నుంచి అమల్లోకి వచి?చన వేళ స్విస్‌లో విడిగా ఐదు కీలక ఒప్పందాలు కుదుర్చుకోవడం విశేషం. టీఈపీఏ అనేది పెట్టుబడులు, ఆవిష్కరణలు, ఉపాధి, ఉమ్మడి శ్రేయస్సుకు సాధనకు బలమైన బ్లూప్రింట్‌లా పనిచేస్తోంది. దీని ద్వారా వచ్చే ఐదేళ్లలో భారత్ 100 బిలియన్ డాలర్ల పెట్టుబడులను, పది లక్షల నూతన ఉద్యోగాలను ఆశిస్తోంది అని మోదీ చెప్పారు.

## కేంద్రప్రభుత్వం దేశవ్యాప్తంగా న్యాయవాదుల రక్షణ చట్టం అమలుచేయాలి.

బంటుమిల్లి బార్ అసోసియేషన్ అధ్యక్షులు యాళ్ళ సోమశేఖర్ (శ్యాంబాబు) డిమాండ్

(ఎస్. ఎస్. ఆర్. ఆంజనేయులు)





ఆంధ్ర,తెలంగాణ శ్రీ వార్తప్రత్యేక ప్రతినిధి)తెలంగాణా ప్రభుత్వం జూన్ 2, 2026 నుండి అమలుచేస్తున్న న్యాయవాదుల రక్షణ చట్టం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కూడా అమలుచేయాలని కృష్ణాజిల్లా బంటుమిల్లి బార్ అసోసియేషన్ అధ్యక్షులు యాళ్ళ సోమశేఖర్ (శ్యాంబాబు) డిమాండ్ చేశారు. మంగళవారం బంటుమిల్లి కోర్టు న్యాయవాదులు కోర్టు బహిష్కరించి నిరసనలు, ప్రదర్శనలు నిర్వహించారు. రిలే నిరాహార దీక్షలు చేపట్టారు.ఈ సందర్భంగా బంటుమిల్లి బార్ అసోసియేషన్ అధ్యక్షులు యాళ్ళ సోమశేఖర్ (శ్యాంబాబు ) మాట్లాడుతూ,దేశవ్యాప్తంగా కేంద్ర ప్రభుత్వం తరుపున ఒకే చట్టం తీసుకొనిరావాలని చాలాకాలంగా డిమాండ్ చేస్తున్నారని, రాజస్థాన్, కర్ణాటక వంటి రాష్ట్రాలు కూడా ఈ తరహా చట్టాలను ఆమోదించాయని తెలిపారు. న్యాయవాదులపై దాడులు, బెదిరింపులు, తప్పుడు కేసులను న్యాయవాదుల రక్షణ చట్టం అరికడుతుందన్నారు. ఈ చట్టం ప్రకారం న్యాయవాదిని అరెస్టు చేయాలంటే చీఫ్ జ్యూడిషల్ మేజిస్ట్రేట్ ప్రత్యేక ఆదేశాలు తప్పనిసరని ఈ చట్టం గురించి యాళ్ళ సోమశేఖర్ (శ్యాంబాబు ) వివరించారు. బంటుమిల్లి న్యాయవాదులు ఇల్లూరి వెంకట సుబ్బారాయుడు, కూనపురెడ్డి రాంబాబు, పళ్లెం వీర వెంకటేశ్వర రావు మరియూ బంటుమిల్లి బార్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

## మచిలీపట్నానికి శ్రీ సత్యసాయి ప్రేమ రథం భక్తులకు దర్శన భాగ్యం



మచిలీపట్నం,శ్రీ వార్త న్యూస్:భగవాన్ శ్రీ సత్యసాయి బాబా వారి శతవర్ష జన్మదినోత్సవ ముగింపు వేడుకల సందర్భంగా దేశవ్యాప్తంగా పర్యటిస్తున్న "శ్రీ సత్యసాయి ప్రేమ ప్రవాహిని" ప్రేమ రథం మచిలీపట్నానికి రానుంది.ఈ విషయాన్ని సమితి కన్వీనర్ పోతుకూచి ఆంజనేయ కుమార్ తెలిపారు. శుక్రవారం రాత్రికి మచిలీపట్నం సత్యసాయి సేవా సమితికి ప్రేమ రథం చేరుకుంటుందని, శనివారం ఉదయం 6 గంటలకు ప్రేమరథ పూజ అనంతరం వేద మంత్రాలు, మంగళ వాయిద్యాలతో రథయాత్ర ప్రారంభమవుతుందని చెప్పారు.ఎస్.ఎన్. గొల్లపాలెం, బీవీ తోట, సీతారామపురం, ఆకుమర్రు లాకులు, మల్లవోలు గ్రామాల్లో పర్యటించి, మధ్యాహ్నం 4 గంటల నుంచి చిలకలపూడి చలరస్తా సెంటర్ మీదుగా ఈడేపల్లి రామాలయం, పంచాయతీ కాలనీ, బైపాస్ రోడ్డు ద్వారా గుడివాడ చేరుకుంటుందని వివరించారు.భక్తులందరూ ఆయా సమయాల్లో స్వామివారికి మంగళ హారతులు అందించి అనుగ్రహ ఆశీస్సులు పొందాలని కోరారు. ఈ సందర్భంగా రథయాత్ర వివరాల కరపత్రాన్ని ఆవిష్కరించారు.సమన్వయకర్త అనుమకొండ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ప్రశాంతి నిలయానికి వెళ్లి స్వామివారిని చూడలేని వారి కోసం స్వామివారే స్వయంగా ముందుకు వస్తున్నారని, భక్తులందరూ దర్శించి తరించాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో మల్లంపల్లి శ్రీనివాస్, పి. వరప్రసాద్, వై. రాజమోహన్, ఎం.బీ. రామ్మూర్తి, ఎస్. వెంకట చెన్నయ్య గుప్తా, ధారా సూర్య చంద్రరావు, కాళికాదేవి, పి. కళ్యాణి, కె. నాగమణి, పోతుకూచి నాగమణి, నాగ గాయత్రి తదితరులు పాల్గొన్నారు.

## 24 జిల్లాల్లో 264 హెల్త్ క్లినిక్‌లకు ప్రారంభోత్సవం చేసిన మంత్రి సత్యకుమార్ యాదవ్



గుడివాడ శ్రీ వార్త న్యూస్:కృష్ణాజిల్లా గుడివాడ నియోజకవర్గం రుద్రపాక పి హెచ్ సీ పరిధిలోని జనార్దనపురం గ్రామంలో నూతన విలేజ్ హెల్త్ క్లినిక్ (ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్) భవనాన్ని ఆంధ్రప్రదేశ్ ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ప్రారంభించారు.రాష్ట్రవ్యాప్తంగా 24 జిల్లాల్లో రూ. 103 కోట్ల వ్యయంతో నూతనంగా నిర్మించిన 264 విలేజ్ హెల్త్ క్లినిక్ భవనాల ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని మంత్రి జనార్దనపురం నుంచే లాంఛనంగా ప్రారంభించారు .జనార్దనపురంలోని క్లినిక్ ను ప్రత్యక్షంగా ప్రారంభించి, అక్కడి నుంచే డిజిటల్/వర్చువల్ విధానంలో మిగిలిన జిల్లాల్లోని హెల్త్ క్లినిక్ లను ప్రారంభించారు.ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పంతం వెంకట గజేంద్రరావు, నాయకులు వడ్డీ బాలకృష్ణ మంత్రి సత్యకుమార్ యాదవ్ ను మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి అభినందనలు తెలియజేశారు.



## విజయవాడ ఉత్సవ్ కు రండి. వెస్ట్ బెంగాల్ ముఖ్యమంత్రి సువేందు అధికారికి ఆహ్వానం పలికిన కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు.




విజయవాడ శ్రీ వార్త న్యూస్:విజయవాడలో అక్టోబర్ 11 నుంచి 20వ తేదీ వరకు ఘనంగా నిర్వహించనున్న విజయవాడ ఉత్సవ్--2.0కు హాజరు కావాలని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు పశ్చిమ బెంగాల్ బీజేపీ శాసనసభాపక్ష నేత సువేందు అధికారిని ఆహ్వానించారు.సోమవారం కలకత్తా లోని సచివాలయ భవనం నబన్నా సభాఘర్ లో సువేందు అధికారిని కలిసిన కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు.. విజయవాడలో నిర్వహించనున్న దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు, విజయవాడ ఉత్సవ్--2.0కు సంబంధించిన ఆహ్వాన పత్రికను అందజేశారు.అక్టోబర్ 11 నుంచి 20 వరకు పది రోజుల పాటు జరిగే విజయవాడ ఉత్సవ్‌లో ఆధ్యాత్మిక, సాంస్కృతిక, కళా, వినోద కార్యక్రమాలతో పాటు ప్రత్యేక ఆకర్షణగా మెగా కార్నివాల్, వివిధ రాష్ట్రాల సాంస్కృతిక ప్రదర్శనలు, కళా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు రామ్మోహన్ నాయుడు వివరించారు.విజయవాడ నగర ఆధ్యాత్మిక, సాంస్కృతిక వైభవాన్ని దేశవ్యాప్తంగా చాటిచెప్పేలా "వన్ సిటీ -- వన్ సెలబ్రేషన్" భావనతో ఉత్సవ్--2.0ను నిర్వహిస్తున్నట్లు తెలిపారు.విజయవాడ ఉత్సవ్--2.0లో సువేందు అధికారి పాల్గొని, విజయవాడ ఆధ్యాత్మిక, సాంస్కృతిక వైభవాన్ని వీక్షించాలని కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు కోరారు. ఆహ్వానాన్ని స్వీకరించిన ముఖ్యమంత్రి సువేందు అధికారి.తప్పక హాజరవుతానని స్పష్టం చేశారు.

# కేసుల సత్వర పరిష్కారం కోసమే మీడియేషన్ సెంటర్లు

కృష్ణాజిల్లా జడ్జి డాక్టర్ సి.యామిని.




మచిలీపట్నం శ్రీ వార్త న్యూస్:దేశవ్యాప్తంగా పెరిగిపోతున్న సివిల్ క్రిమినల్ కేసులను పరిష్కరించి కక్షిదారులకు సత్వర న్యాయం అందించడానికి కృష్ణా జిల్లా ఎన్టీఆర్ జిల్లా వ్యాప్తంగా ప్రతిరోజు మీడియేషన్ సెంటర్లు పనిచేస్తున్నాయని కృష్ణా జిల్లా ప్రధాన న్యాయమూర్తి డాక్టర్ సి.యామిని అన్నారు. మంగళవారం కృష్ణ జిల్లా,ఎన్టీఆర్ జిల్లాలోని 13 బార్ అసోసియేషన్ లు కి చెందిన 98 మంది సుప్రీంకోర్టు శిక్షణ పొందిన మీడియేటర్లకు ఒకరోజు ట్రైనింగ్ ప్రోగ్రామ్ జిల్లా కోర్టు ప్రాంగణంలో జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన జిల్లా జడ్జి యామిని మాట్లాడుతూ ఎంతో అనుభవం కలిగిన న్యాయవాదులు కూడా మీడియేటర్స్ గా పనిచేయటం సంతోషదాయకమని అన్నారు. కేసులు పరిష్కారం మీడియేషన్ ద్వారా పరిష్కారం చేసుకుంటే ఇరువర్గాలకు సమయము, డబ్బు ఆదా అవుతుందని, భవిష్యత్తులో ఏ విధమైన లి?టిగేషన్ ఉండదని అన్నారు. శాంతియుత వాతావరణంలో శిక్షణ పొందిన మీడియేటర్లు రెండు జిల్లాలలో కేసులు పరిష్కారం చేస్తున్నారని ఆమె తెలియజేశారు. పెండింగ్ లో ఉన్న అన్ని సివిల్ కేసులు, రాజీ పడదగ్గ క్రిమినల్ కేసులను మీడియేషన్ ద్వారా పరిష్కారం చేసుకోవచ్చని ఆమె తెలియజేశారు.కృష్ణా జిల్లా 9వ అదనపు జిల్లా జడ్జి టి.రాజా వెంకటాద్రి మాట్లాడుతూ 1976లో ఉన్న న్యాయ వ్యవస్థ వేరని,ప్రస్తుతం భారత న్యాయవ్యవస్థలో మార్పులు చేర్పులు వలన కేసులు పరిష్కారానికి ఈ సమయం పడుతుందని అన్నారు. జనాభాతో పాటు లిటిగేషన్ కూడా పెరుగుతుందని అన్నారు. కాబట్టి మీడియేషన్ పై కక్షిదారులు దృష్టి సారించాలని న్యాయవాదులు సహకరించినట్లయితే అనేక కేసులు పరిష్కారం అవుతాయని తెలియజేశారు. ప్రజలకు రాజ్యాంగంపై నమ్మకం పెరుగుతుందని న్యాయ వ్యవస్థ పై దేశ ప్రజలు పూర్తి నమ్మకంతో ఉన్నారని ఆ నమ్మకాన్ని పెంచవలసిన బాధ్యత న్యాయమూర్తులు న్యాయవాదులపై ఉందని అన్నారు. మీడియేషన్ ద్వారా కేసులు ఎక్కువ సంఖ్యలో పరిష్కరిస్తే న్యాయ వ్యవస్థ పై ఒత్తిడి తగ్గుతుందని అన్నారు. తమిళనాడు చెందిన ప్రముఖ సీనియర్ మీడియేటర్ శ్రీమతి సుదర్శన్ సుందర్ ఈ ఒకరోజు శిక్షణ శిబిరాన్ని నిర్వహించి మీడియేషన్ లోని మెలకువలను తెలియజేశారు. ఈ కార్యక్రమానికి విజయవాడ బార్ అసోసియేషన్ నుండి 48 మంది మిడియేటర్లు న్యాయవాదులు ఇతర బార్ అసోసియేషన్ నుండి 50 మంది హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో కృష్ణాజిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి టి. వరలక్ష్మి,అదనపు జిల్లా అధ్యక్షులు గాజుల వెంకటేశ్వర్లు,పెర్మనెంట్ లోక్ అదాలత్ చైర్మన్ ఓ. వి. నాగేశ్వరరావు,,సీనియర్ సివిల్ జడ్జి కె.వి.సి.హిమబిందు జూనియర్ సివిల్ జడ్జిలు మహమ్మద్ రహమతుల్లా, పి. సాయి సుధా, జే.బీ.టీ.సుందరి దేవి,మచిలీపట్నం బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షులు లంకిశెట్టి బాలాజీ మాజీ అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ అడపా మురళి, విజయవాడ బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షులు హజ్రతయ్య గుప్తా, గుడివాడ బార్ అసోసియేషన్ మాజీ కార్యదర్శి చెన్నూరి వెంకటరమణ, విజయవాడ బార్ అసోసియేషన్ మహిళ కార్యదర్శి ఇసంశెట్టి ఉషా జ్యోతి పలువురు న్యాయవాదులు పాల్గొన్నారు.



## యు.పి.ఎస్.సి. సివిల్స్ సర్వీసెస్ ప్రిలిమ్స్ పరీక్షలకు ఉచిత కోచింగ్

ఎన్టీఆర్ జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమశాఖ అధికారి ఇ.జగ్గయ్య



విజయవాడ శ్రీ వార్త న్యూస్:రాష్ట్ర వెనుకబడిన తరగతుల సంక్షేమశాఖ సంచాలకులు ఆదేశాల మేరకు యు.పి.ఎస్.సి. సివిల్స్ సర్వీసెస్ ప్రిలిమ్స్ పరీక్షలకు ఉచిత శిక్షణ అందించేందుకు అర్హులైన అభ్యర్థుల నుండి దరఖాస్తులు కోరుతున్నట్లు ఎన్టీఆర్ జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమశాఖ అధికారి ఇ.జగ్గయ్య ఒక ప్రకటనలో తెలిపారు.ఎన్టీఆర్ జిల్లాకు చెందిన డిగ్రీ పూర్తి చేసిన బి.సి., ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు ఈ ఉచిత శిక్షణకు అర్హులని తెలిపారు. అర్హత కలిగిన అభ్యర్థులు తమ దరఖాస్తులను పూర్తి చేసి, బయోడేటాతో పాటు 2 పాస్‌పోర్ట్ సైజు ఫోటోలు, విద్యార్హత, కుల, ఆదాయ ధృవీకరణ పత్రాలు లేదా తెల్ల రేషన్ కార్డు, ఆధార్ కార్డు తదితర ధృవీకరణ పత్రాల జిరాక్స్ కాపీలను అటెస్టేషన్ చేయించి దరఖాస్తుకు జతపరచి, అక్టోబర్ 20,2026 లోపు సంబంధిత చిరునామాలో నేరుగా సమర్పించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ఖాళీ దరఖాస్తు ఫారాలను జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమశాఖ స్టడీ సర్కిల్ వద్ద ఉచితంగా పొందవచ్చని తెలిపారు. అభ్యర్థుల ఎంపిక స్క్రీనింగ్ టెస్ట్ ప్రాతిపదికన జరుగుతుందని తెలిపారు. ఎంపికైన అభ్యర్థులకు బి.సి. భవన్, గొల్లపూడి, విజయవాడలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన స్టడీ సర్కిల్ ద్వారా ఉచిత శిక్షణ అందించనున్నట్లు తెలిపారు. ఎంపికైన అభ్యర్థులకు శిక్షణా కాలంలో ఉచిత బస, వసతి సౌకర్యాలు కూడా కల్పించనున్నట్లు పేర్కొన్నారు.అర్హులైన అభ్యర్థులు ఈ సదవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఇతర వివరాలకు జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ మరియు సాధికారత అధికారి కార్యాలయం, ఎన్టీఆర్ జిల్లా, విజయవాడ ఎ.పి. బి.సి. స్టడీ సర్కిల్, 74-2-1/5, పండరిపురం, విజయవాడ -- 520007 నందు సంప్రదించాలని లేక సెల్ నంబర్లు 9505094349, 9966849937, 8688855255 నందు కూడా సంప్రదించవచ్చని తెలిపారు.

## ప్రతి కుటుంబ ఆరోగ్య భద్రతకు భరోసా

ప్రాథమిక వైద్యం, మందులు,ఆరోగ్య పరీక్షలు అందుబాటులోకి

జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ

మైలవరం వీహెచ్‌సీని వర్చువల్‌గా ప్రారంభించిన మంత్రి సత్యకుమార్ యాదవ్



విజయవాడ శ్రీ వార్త న్యూస్:గ్రామీణ ప్రాంత ప్రజలకు మరింత మెరుగైన వైద్య సేవలను అందుబాటులోకి తీసుకురావడమే లక్ష్యంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆరోగ్య రంగానికి అధిక ప్రాధాన్యతనిస్తున్నాయని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ పేర్కొన్నారు. ఆరోగ్య ఆంధ్ర సాకారానికి గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు ప్రాథమిక వైద్య సేవలు సులభంగా అందించడంలో విలేజ్ హెల్త్ క్లినిక్‌లు కీలకపాత్ర పోషిస్తున్నాయని పేర్కొన్నారు.మంగళవారం మైలవరంలో 15వ ఆర్థిక సంఘం నిధులు రూ. 36 లక్షలతో నిర్మించిన ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్-విలేజ్ హెల్త్ క్లినిక్ భవనాన్ని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ వర్చువల్‌గా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ.డీఎంహెచ్‌వో ఎ.శ్రావణబాబు తదితరులతో కలిసి హాజరయ్యారు.ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత ప్రజలకు నాణ్యమైన ప్రాథమిక వైద్య సేవలను మరింత చేరువ చేయడంలో విలేజ్ హెల్త్ క్లినిక్‌లు కీలకంగా నిలుస్తాయన్నారు. ప్రజలు తమకు సమీపంలోనే అందుబాటులో ఉన్న ఈ వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.విలేజ్ హెల్త్ క్లినిక్‌ల ద్వారా ప్రజలకు ప్రాథమిక ఆరోగ్య సంరక్షణతో పాటు ఉచితంగా మందులు, అవసరమైన రోగ నిర్ధారణ పరీక్షలు అందిస్తున్నట్లు తెలిపారు. ప్రతి పేద కుటుంబానికి నాణ్యమైన వైద్యం అందించాలనే సంకల్పంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆరోగ్య రంగానికి అధిక ప్రాధాన్యత ఇస్తూ విస్తృతంగా అభివృద్ధి కార్యక్రమాలను చేపడుతున్నాయని పేర్కొన్నారు. ఆరోగ్య ఆంధ్ర నిర్మాణంలో భాగస్వాములై ప్రజలకు ఆరోగ్యంపై అవగాహన కల్పిస్తూ, వ్యాధులను ప్రారంభ దశలోనే గుర్తించి మెరుగైన వైద్య సేవలు అందేలా వైద్య సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు.కార్యక్రమంలో పంచాయతీరాజ్ ఇంజనీర్ రామయ్య, ప్రత్యేక అధికారి మౌనిక, తహసిల్దార్ అబ్దుల్ దరియా, స్థానిక అధికారులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.



## సేవా సేతు అభియాన్ క్యాంపును సందర్శించిన ఏపీసీపీడీసీఎల్ సీఎండీ పి. పుల్లారెడ్డి.



విజయవాడ శ్రీ వార్త న్యూస్:ప్రధానమంత్రి సూర్య ఘర్ ముఫ్త్ బిజిలి యోజనలో భాగంగా ఏపీసీపీడీసీఎల్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న "సేవా సేతు అభియాన్"క్యాంపులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఏపీసీపీడీసీఎల్ సీఎండీ పి. పుల్లారెడ్డి సూచించారు.విజయవాడ గుణదలలో ఏర్పాటు చేసిన సేవా సేతు అభియాన్ క్యాంపును మంగళవారం సీఎండీ మరియు డైరెక్టర్ ప్రాజెక్ట్స్ఉహెచ్ ఆర్ టీవీఎస్ఎన్ మూర్తి సందర్శించారు. క్యాంపులో ఏర్పాటు చేసిన వివిధ కౌంటర్లను పరిశీలించి, వినియోగదారులకు అందుతున్న సేవలు, ప్రధానమంత్రి సూర్య ఘర్ పథకం కింద రూఫ్‌టాప్ సోలార్ ఏర్పాటుకు సంబంధించిన వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా సీఎండీ మాట్లాడుతూ,గృహ వినియోగదారులు తమ ఇళ్లపై సౌర విద్యుత్ ప్లాంట్లను ఏర్పాటు చేసుకోవడం ద్వారా విద్యుత్ బిల్లుల భారాన్ని తగ్గించుకోవడంతో పాటు పర్యావరణ పరిరక్షణకు తోడ్పడవచ్చన్నారు. పీఎం సూర్య ఘర్ పథకం కింద కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీపై ప్రజలకు అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు.క్యాంపుల ద్వారా వినియోగదారులకు ఒకే వేదికపై పథకానికి సంబంధించిన పూర్తి సమాచారం,దరఖాస్తు ప్రక్రియ,సాంకేతిక అంశాలు, విక్రేతల వివరాలు తదితర సేవలను అందిస్తున్నట్లు తెలిపారు.అర్హులైన ప్రతి వినియోగదారుడు ఈ అవకాశాన్ని వినియోగించుకునేలా విస్తృతంగా ప్రచారం నిర్వహించాలని సూచించారు.క్యాంపును సందర్శించిన సమయంలో వినియోగదారులతో సీఎండీ మాట్లాడి,వారి సందేహాలను తెలుసుకున్నారు.సౌర విద్యుత్ ఏర్పాటుకు సంబంధించిన సందేహాలను నివృత్తి చేస్తూ, పథకం ద్వారా లభించే ప్రయోజనాలను వివరించారు.డిస్కమ్ పరిధిలోని సబ్ డివిజన్, జిల్లా స్థాయిలో ఈ క్యాంపులు 6,7,8 తేదీలలో జరుగుతాయని వినియోగదారులు ఈ సౌకర్యాన్ని వినియోగించుకోవాలని సీఎండీ తెలిపారు.ఈ కార్యక్రమంలో డైరెక్టర్ ప్రాజెక్ట్స్ ఉహెచ్ ఆర్ టీవీఎస్ఎన్ మూర్తి, ఎన్టీఆర్ జిల్లా సూపరిడెంట్ ఇంజనీర్ హనుమయ్య, గుణదల ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ విశ్వేశ్వరప్రసాద్ మరియు ఏపీసీపీడీసీఎల్ అధికారులు, సిబ్బంది, విక్రేతలు,బ్యాంకు అధికారులు,వినియోగదారులు పాల్గొన్నారు.

## ఫోక్సో కేసు కొట్టివేత - నిందితులకు ఊరట

నిందితుల తరపున వాదించిన న్యాయవాదులు కె. రాజగురు, ఎన్.సంగీత



మచిలీపట్నం శ్రీ వార్త న్యూస్:మచిలీపట్నం దిశా పోలీస్ స్టేషన్ లో నమోదైన ఫోక్సో కేసులో నేరం రుజువు కాకపోవడంతో నిందితులను నిర్దోషులుగా ప్రకటిస్తూ మచిలీపట్నం ప్రత్యేక ఫోక్సో కోర్టు సంచలన తీర్పు వెలువరించింది.వివరాల్లోకి వెళితే. ఎస్ పి ఎల్ ఎస్సీ 45/2023 కేసులో నిందితుడు కోడూరు మండలం ఉల్లిపాలెంకు చెందిన నడకుదిటి సురేంద్ర మరియు అతని తల్లి నడకుదిటి వాణిపై ఎస్/4 ఫోక్సో చట్టం, ఎస్/363 (కిడ్నాప్), ఎస్/376 (రేప్), ఎస్/509 (అవమానపరచడం) సెక్షన్ల కింద దిశా పోలీసులు కేసు నమోదు చేశారు.ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం పుల్లిగడ్డ గ్రామానికి చెందిన మైనర్ బాలిక ఇంటి నిర్మాణ పనులకు వచ్చిన సురేంద్ర... బాలికకు మాయమాటలు చెప్పి ప్రేమ పేరుతో వంచించి, 21-01-2023న కిడ్నాప్ చేసి మచిలీపట్నంలోని తన రూమ్ కు తీసుకెళ్లి ఇష్టానికి విరుద్ధంగా పలుమార్లు అత్యాచారం చేశాడని, పెళ్లి చేసుకోమని అడిగితే తను, ఆమె తల్లిదండ్రులను అవహేళన చేశారని ఆరోపణ.ఈ కేసులో 12 మంది సాక్షులను విచారించి, వాదనలు విన్న తర్వాత నిందితులపై నేరం రుజువు కాలేదని భావించిన ప్రత్యేక ఫోక్సో కోర్టు జడ్జి గాజుల వెంకటేశ్వర్లు కేసును కొట్టివేస్తూ తీర్పు ఇచ్చారు.నిందితుల తరపున న్యాయవాదులు కె. రాజగురు మరియు ఎన్. సంగీత వాదించారు.



Pulisher,Owner and Editor kureti satish, printed by Teja cards and stationery ground floor 26-25-2durgi vari veedhi,opp Inox theater Gandhi nagar Vijayawada ,Andra Pradesh 520003.PRGS Nembar: APTEL/26/A4813, Editor: kureti satish,cell number:9866640784,H. No:21-651a,near Suvarna Kalyana mandapam,parasupeta machilipatnam Krishna Distric, Andra Pradesh.521001